అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 15-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 350 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

కదంతొక్కిన స్పెయిన్ ప్రజలు

ప్రజారోగ్య వ్యవస్థ పరిరక్షణ కోసం భారీ ఉద్యమం

- పెడ్రో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రదర్శనలు



మాడ్రిడ్ : ప్రజారోగ్య వ్యవస్థను పరిరక్షించుకునేందుకు స్పెయిన్ ప్రజానీకం ఉద్యమబాట పట్టారు. అక్కడి పెడ్రో ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర చర్యలను నిరసిస్తూ భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గత ఆదివారం చేపట్టిన భారీ ర్యాలీల్లో ...5లో

బీబీసీపై ప్రతీకారం

ఢిల్లీ, ముంబయి కార్యాలయాల్లో ఐటీ సోదాలు

- పాత్రికేయుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- కేంద్ర దర్యాప్తు సంస్థలతో సర్కార్ కక్ష సాధింపు
- అబ్బే..ఇది కేవలం ఐటీ సర్వే : సంబంధిత అధికారులు
- ఐటీ అధికారులకు సహకరిస్తున్నాం : బీబీసీ
- మోడీ సర్కార్‌పై ప్రతిపక్షాల ఆగ్రహం
- అదానీ అక్రమాలపై విచారణ లేదు..ఎందుకు? : ప్రతిపక్షాలు

BBC NEWS

అదానీ వ్యవహారంలో వాస్తవాలు బయటకు రావాలని దేశం యావత్తు కోరుకుంటుంటే... కేంద్రం మాత్రం బీబీసీని టార్గెట్ చేసింది. అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకలు, అక్రమాలపై విచారణ జరపకుండా.. పాలకులకు వ్యతిరేకంగా వార్తా కథనాలు రాసిన మీడియా సంస్థలపైకి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని ప్రయోగిస్తున్నది. మంగళవారం బీబీసీ కార్యాలయాలపై ఐటీ సర్వేలు, దాడులు దేశ రాజకీయాల్లో సంచలనం రేపాయి. ఐటీ, సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తూ మీడియా సంస్థల్ని బెదిరిస్తోందని 'ద ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' ఆందోళన వ్యక్తం చేసింది. బీబీసీలో ఐటీ సోదాలు.. దేశంలో పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించింది.



న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్లపై సంచలనాత్మక డాక్యుమెంటరీ రూపొందించిన బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ (బీబీసీ)పై మోడీ సర్కార్ ప్రతీకార చర్యలకు దిగింది. భారత్‌లోని బీబీసీ కార్యాలయాలపై మంగళవారం ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. బీబీసీ-ఢిల్లీ, ముంబయి కార్యాలయాల్లో ఐటీ అధికారులు సర్వే నిర్వహించారని జాతీయ మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. పన్ను ఎగవేత ఆరోపణలపై ఈ దర్యాప్తు సాగుతుతోందని తెలిసింది. బీబీసీలో పనిచేస్తున్న సిబ్బంది ఫోన్లను ఐటీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది ఎవర్నీ బయటకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. సోదాలు మొదలైన కొద్ది గంటలకు కొంతమందిని వారి ఇండ్లకు పంపినట్టు వార్తలు వెలువడ్డాయి. ఐటీ దాడుల వ్యవహారంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

"ఇది కేవలం సర్వే మాత్రమే. ఐటీ దాడులు కాదు" అని ఐటీ అధికారులు మీడియాకు తెలిపారు. పన్నుల అవకతవకల ఆరోపణలపై ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగులు కంప్యూటర్లు వాడొద్దని, ఇంట్లోనే ఉండాలని అధికారులు చెప్పినట్టు తెలుస్తోంది. పాత్రికేయుల ఫోన్లను, ల్యాప్‌ట్యాప్లను కూడా స్వాధీనం చేసుకున్నారని సమాచారం. అవకతవకలకు సంబంధించి ఏవైనా ఆధారాలు గుర్తిస్తే, ఈ సర్వేను కాస్తా ఐటీ సోదాలుగా మార్చే అవకాశముందని సంబంధిత అధికారుల్లో ఒకరు మీడియాకు చెప్పారు. తమ కార్యాలయాల్లో ఐటీ విభాగం నిర్వహిస్తున్న సర్వేపై బీబీసీ స్పందించింది. "ప్రస్తుతం ముంబయి, ఢిల్లీలోని బీబీసీ కార్యాలయాల్లో ఐటీ అధికారులున్నారు. మేం వారికి సహకరిస్తున్నాం. ఈ వ్యవహారం త్వరలోనే సద్దుమణుగుతుందని ...2లో

అప్రకటిత ఎమర్జెన్సీ : కాంగ్రెస్



ప్రధాని మోడీపై వీడియో ప్రసారం చేసినందునే ఐటీ దాడులు జరుగుతున్నాయని కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్..తదితర పార్టీలకు చెందిన విపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. దేశంలో ...2లో

బీజేపీ చేతిలో ఐటీ, సీబీఐ, ఈడీ కీలుబొమ్మలు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఐటీ, సీబీఐ, ఈడీ లాంటి సంస్థలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. వాట్ ...2లో

బడి ఎరుగని పల్లెలు..!

ఆదివాసీ పిల్లలకు అందని ప్రాథమిక విద్య

- పాఠశాలల నిర్మాణంలో ఐటీడీఏ అలసత్వం
- అక్షరాలకు దూరమవుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

కొండ కోనల మధ్య అలరారుతున్న అందమైన పల్లెలివి. ప్రకృతి రమణీయతకు అద్దం పడుతున్న ఈ పల్లెల్లో అక్షరజ్ఞానం లేకుండా పోతోంది. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందిన ఈ రోజుల్లోనూ ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం బడులు లేవంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో ఇప్పటికీ బడులు నిర్మించలేదు. గతంలో కొన్ని చోట్ల పాకల్లో నడిచినవి నేడు కనుమరుగయ్యాయి. దీంతో అక్కడ నివాసముంటున్న ఆదివాసీ గిరిజన చిన్నారులకు అక్షరాలు నేర్పేవారు లేరు. బడులను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాభివృద్ధికి పాటుపడుతున్నమని చెబుతున్న ప్రభుత్వాలు.. ఏజెన్సీ ప్రాంతంలో కనీసం బడి కూడా లేని విషయాలపై దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఈ పేద గిరిజన చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పీచర గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పిల్లలు వీరు. ప్రస్తుతం ఈ గ్రామంలో 23మంది చిన్నారులు ఉన్నారు. కానీ ఇక్కడ బడి లేకపోవడంతో ఈ బాలలు ప్రాథమిక విద్యకు దూరమవుతు న్నారు. ఇంటి వద్దే ఉంటూ ఆటలతోనే కాలం గడుపుతున్నారు. ఈ గ్రామంలో పదేండ్ల కిందట పశువుల పాకలో బడిని ఏర్పాటుచేసి ఉపాధ్యాయుడిని నియమించారు. కొన్నాండ్లపాటు కొనసాగినా వివిధ కారణాలతో ఎత్తివేశారు. దీంతో ఈ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏజెన్సీ పరిధిలో ఇలాంటి బడులు 920 వరకు ఉండగా.. వీటి పరిధిలో సుమారు 15వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఐటీడీఏ ఏర్పడి అనేక ఏండ్లు గడుస్తున్నా ఏజెన్సీ పరిధిలోని కొన్ని పల్లెల్లో ఇప్పటికీ బడులు లేవు. జిల్లా వ్యాప్తంగా మొదటి నుంచి అసలు బడులే లేని గ్రామాలు సుమారు 20వరకు ఉంటాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దాంతోపాటు ఇటీవల రేషనలైజేషన్‌లో ఎత్తేసినవి అదనం. ఇలా పాఠశాలలు లేని ఏజెన్సీ గ్రామాలు చాలా ఉన్నాయి. దీంతో ఈ గ్రామాల పరిధిలోని విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. కొందరు ఆటల్లో.. మరికొందరు చిన్నారులు పనుల్లో నిమగ్నమవుతున్నారు. విద్యకు దూరమవడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం 20మంది పిల్లలు ఉన్న చోట తప్పనిసరిగా బడిని ఏర్పాటుచేసి చదువు చెప్పాలనే నిబంధన ఉన్నప్పటికీ ఐటీడీఏ అధికారులు ...5లో

నేటినుంచి

ఇంటర్ ప్రాక్టికల్స్

2,201 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

- 3.55 లక్షల మంది హాజరు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి రెండో తేదీ వరకు ఇవి జరుగుతాయి. ఈ పరీక్షలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు సర్వంసిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జనరల్ విద్యార్థుల కోసం 1,709, ఒకేషనల్ విద్యార్థుల కోసం 492 కలిపి మొత్తం 2,201 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనరల్ విద్యార్థులు ...5లో

పోరాడి సాధించుకోవాలి

అంగన్‌వాడీల పర్మినెంట్ చేయాలి

- ఇందిరాపార్కు వద్ద అంగన్‌వాడీల మహాధర్నా
- ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్ కల్పించాలి సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి డిమాండ్
- మార్చి 1,2,3 తేదీల్లో ర్యాలీలు, వంటావార్పు, కలెక్టరేట్ల దిగ్బంధనం : జయలక్ష్మి



నవతెలంగాణ- సిటీబ్యూరో

రాష్ట్రంలో 35వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సుమారు 70వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాడాలి.. కొట్లాడి హక్కులు సాధించుకోవాలని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పెరుగుతున్న ధరల వల్ల ఒక్క కుటుంబం కనీస ...2లో

ముంబయి టూ హైదరాబాద్‌కు డ్రగ్స్

యువతులను డ్రగ్స్‌కు బానిసలుగా చేసి లైంగికదాడులు

- రాచకొండ కమిషనరేట్ పరిధిలో అంతర్జాతీయ ముఠా అరెస్ట్
- 110కిలోల గంజాయి, డ్రగ్స్ స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో / హయత్‌నగర్

హైదరాబాద్‌లో పెద్దఎత్తున డ్రగ్స్.. దాన్ని సరఫరా చేస్తున్న ముఠాలను నార్కొటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్‌తోపాటు టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. ముంబయి నుంచి ...5లో

ఉపాధ్యాయ బదిలీలకు హైకోర్టు బ్రేక్


కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

- మార్చి 14 వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టొద్దు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలకు బ్రేక్ పడింది. హైకోర్టు ఆదేశాలతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. మార్చి 14వ తేదీ వరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలను పాఠశాల విద్యాశాఖ మంగళవారం రాత్రి లేదా బుధవారం విడుదల చేసే అవకాశమున్నది. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాతే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టే అవకాశమున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్పౌజ్ టీచర్లకు పది అదనపు పాయింట్లు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నాన్ స్పౌజ్ టీచర్లు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ మూడు నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయి. ఆ తర్వాత మూల్యాంకనం ప్రక్రియ ఉంటుంది. అనంతరం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందించి విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆమోదం కోసం పంపించినట్టు తెలిసింది. మంగళవారం రాత్రి లేదా బుధవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశమున్నది. అయితే ...5లో



కాంగ్రెస్‌లో కల్లోలం

పొత్తులపై నోరుజారిన వెంకన్న

- బీజేపీకి ఆయుధం... బీఆర్ఎస్‌కు ఆనందం
- భగ్గుమన్న క్యాడర్
- ఆయనపై క్రమశిక్షణ చర్యలకు హస్తం నేతల పట్టు





నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌లో కల్లోలం రేగుతుందనీ, రాష్ట్రంలో హంగ్ వస్తుందనీ, బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపుతున్నాయి. ఆయనపై పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను డామేజ్ చేశాయంటూ ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. కోమటిరెడ్డి కంటే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ నయం అంటూ కొంత మంది సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సందర్భాల్లో కాంగ్రెస్‌పై, రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయన...ఇటీవలే దారికొస్తున్నారనే పరిస్థితి నెలకొంది. ఈ వ్యాఖ్యలతో ఆయన మళ్లీ దారి తప్పాడు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్‌తో సై అంటున్న కాంగ్రెస్‌ను ఆయన వ్యాఖ్యలు కలవరపెడుతున్నాయి. బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీలో లేదనే విషయం స్పష్టమైందనీ, బీఆర్ఎస్‌కు బీజేపీకి పోటీ ఉంటుందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఏమీ లేకపోయినా ఉన్నట్టు ప్రచారం చేసుకుంటున్న బీజేపీ చేతికి కొబ్బరికాయ దొరికినట్టైయింది. కాంగ్రెస్ అంతర్గత విభేదాలను అకాశంగా మార్చుకోవచ్చు అనే సంబరపడుతున్నది.

పార్టీలో చర్చించకుండా వ్యక్తిగత అభిప్రాయాలను చెప్పి పార్టీలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి డిమాండ్ చేశారు. ఏ పార్టీతో పొత్తు ఉండదంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ సభలో చెప్పిన విషయాన్ని కూడా కోమటిరెడ్డి గుర్తుంచుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్ బహిరంగంగా పార్టీలో ఉంటే ఉండండి. లేకపోతే వెళ్లిపోండి' అంటూ ప్రకటించారు. ఆ తర్వాత ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనేక సార్లు రేవంత్‌రెడ్డి లక్ష్యంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేశారు. ఎన్నికల్లో ప్రచారం చేయకుండా కుటుంబ సభ్యులతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లారు. అంతటితో ఆగకుండా మునుగోడులో కాంగ్రెస్‌పార్టీకి డిపాజిట్ దక్కదంటూ వ్యాఖ్యానించి, పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. తాజా వ్యాఖ్యలతో మరోసారి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజుల క్రితం రాష్ట్రానికి వచ్చిన కొత్త ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన సందర్భంలో రేవంత్‌రెడ్డితోనూ భేటీ అయ్యారు. ఇద్దరూ కలిసి ఫోటోలకు ఫోజులిచ్చారు. దీంతో పార్టీకి కలిసిపోయామంటూ ఓ సంకేతం ఇచ్చారని పార్టీ నేతలు భావించారు. పార్టీ భావించినట్టు ఆ ఐక్యత ఎంతో కాలం ఉండలేదని ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు. చివరకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మద్దతుగా ఉన్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు కూడా రివర్స్ అయ్యారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేసి క్యాడర్ మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాత్రం రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందనీ, ఇతర పార్టీ మెజార్టీకి రాకపోతే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ చేతిలో ఉంటుందంటూ విశ్లేషించారు.



గొప్ప సంఘ సేవకులు సంత్‌సేవాలాల్ మహరాజ్ : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంత్ సేవాలాల్ మహరాజ్ గొప్ప సంఘ సేవకులని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తెలిపారు.. ఆయన 284వ జయంతి సందర్భంగా మంగళవారం సీఎం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సేవాలాల్ పేరుతో నిర్మించిన భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ వస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి వారి జయంతి ఉత్సవాల నిర్వహణ మరో ఉదాహరణగా నిలిచిందని తెలిపారు. అడవి బిడ్డలకే ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడడం కోసం సేవాలాల్ చేసిన కృషి గొప్పదన్నారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకునేందుకు సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితాంతం పోరాటం సాగించారన్నారు. ఆయన కల్పించిన చైతన్యం, చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా ఉన్న లంబాడా/బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని వివరించారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహిస్తున్నదని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అక్రమాలపై విచారణ జరిపించాలి

- గవర్నర్ కు టీపీఎస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశపూర్వకంగా ఆర్థిక అక్రమాలు చేస్తూ తప్పుడు లెక్కలను సమర్పిస్తూ, నిధులు మళ్లిస్తున్నదనే ఆరోపణలపై విచారణ జరిపించాలని తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఆ పార్టీ అధ్యక్షురాలు నీరా కిషోర్ నేతృత్వంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2017-18, 2018-19, 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో ఆర్థికంగా మెరుగ్గా ఉన్న రాష్ట్రాన్ని ప్రభుత్వం వెనక్కి నెట్టే చర్యలకు పాల్పడిందని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాన్ని మిగులు రాష్ట్రంగా చూపించిందని ఆరోపించారు. ఈ తప్పుడు సమాచారంతో అధిక వడ్డీలకు, 15 నుంచి 25 ఏండ్ల పాటు చెల్లించేలా కోట్లాది రూపాయల అప్పులు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవకతవలే కాకుండా పలుమార్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు లేకుండా పనులకు, స్కీంలకు ప్రజా ధనాన్ని దోచి పెడుతున్నదని విమర్శించారు. వేల కోట్ల రూపాయల చెక్కులు ఆర్థికశాఖ కార్యదర్శి సంతకం లేకుండా (కౌంటర్ సిగ్నేచర్) ఇవ్వడంతో నిధుల స్వాహా అయ్యాయనే అనుమానాన్ని కాగ్ లేవనెత్తిందని గుర్తుచేశారు. ఆర్థిక అవకతకవకలపై సంబంధిత సంస్థతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శులు సనావుల్లా ఖాన్, డాక్టర్ శంకర నారాయణ, ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు మన్మోహన్ రెడ్డి, ఎస్ఎస్.తన్వీర్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బిర్కెన్ స్టాక్ కొత్త స్టోర్ల ఏర్పాటు

హైదరాబాద్ : జర్మన్ ఫుట్‌వేర్ బ్రాండ్ బిర్కెన్ స్టాక్ హైదరాబాద్‌లో రెండు కొత్త స్టోర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. దీంతో దక్షిణాదిలో తమ ఉనికిని మరింత పెంచుకున్నట్లయ్యిందని బిర్కెన్‌స్టాక్ ఇండియా తెలిపింది. నగరంలోని నెక్సస్ మాల్, శరత్ సిటీ మాల్‌లో కొత్త స్టోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దేశ వ్యాప్త విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్‌తో పాటు లులు మాల్, కొచ్చి, ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్, చెన్నయ్, బెంగళూరులోని ఓరియన్ మాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

రాష్ట్రంలో క్రోమా 13వ స్టోర్లకు విస్తరణ

హైదరాబాద్ : టాటా గ్రూప్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ రిటైల్ చెయిన్ క్రోమా తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించినట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్‌లో 11వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తమ నూతన స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో 11 అవుట్ లెట్లకు విస్తరించినట్లయ్యిందని పేర్కొంది. కొత్త స్టోర్‌లో దాదాపు 550కు పైగా బ్రాండ్లలో 16 వేలకు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

పోరాడి సాధించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలు తీర్చుకోవడానికి రూ.20వేలకుపైగా అవుతుందని, అందువల్ల అంగన్‌వాడీలకు కనీస వేతనమివ్వడంతోపాటు వారిని పర్మినెంట్ చేయడం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్డ్ బెనిఫిట్స్ ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ రక్షణ, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు అన్ని జిల్లాల నుంచి వేలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, మినీటీచర్లు, హెల్పర్స్ తరలిరావడంతో ఇందిరాపార్కు ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. మహాధర్నాకు అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పద్మ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూ.3 లక్షల కోట్లు, కేంద్రం బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు.. మరి ఇంత పెద్ద బడ్జెట్లలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ సమస్యలను పరిష్కరించడానికి ఇబ్బందేముందని ప్రశ్నించారు. పొట్లాడి ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా కల్పించారు. రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శవంతంగా తీసుకునేలా తమ సర్కారు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నదని ముఖ్యమంత్రి చెబుతున్నారని.. అలా అయితే.. ఇక్కడి అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్స్ సమస్యలు పరిష్కరిస్తే.. దేశవ్యాప్తంగా వారు మీకు జై కొడుతారనే విషయాన్ని మరవొద్దన్నారు. అంగన్‌వాడీలవి గొంతెమ్మ కోర్కెలు కాదని.. రేపే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని.. ఒకవేళ ఈ మధ్య కలిస్తే ఆయనకు స్వయంగా వివరిస్తామని హామీ ఇచ్చారు.తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఈ ధర్నాకు అధికారులు, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించి.. అరెస్టులు చేసినా వేలాది మంది టీచర్లు, వర్కర్స్ తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు అంగన్‌వాడీల విషయంలో అన్నీ అబద్ధాలు చెప్పారన్నారు. అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌టీఎస్ ట్రాక్‌ను రద్దు చేయాలన్నారు. లేబర్ పదం చులకనగా ఉందని అంగన్‌వాడీ టీచర్స్‌గా సీఎం పేరు మార్చినా వారి జీవితాలు మారలేదన్నారు. ప్రభుత్వ టీచర్ల మాదిరిగా వేతనాలు కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి రోడ్లపైకి రావాలన్నారు. మార్చి 1న ర్యాలీలు, 2న కలెక్టరేట్ల వద్ద వంటావార్పు, నిద్ర, 3వ తేదీన కలెక్టరేట్ల దిగ్బంధం చేయాలని పిలుపునిచ్చారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో మరో వెయ్యి కోట్లు అదనంగా కేటాయిస్తే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌కు కనీస వేతనం అమలు చేయొచ్చని తెలిపారు. పర్మినెంట్‌తో పాటు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ అమలు చేయొచ్చని.. ఇది మీ చేతిలోనే ఉందని ప్రభుత్వానికి గుర్తుచేశారు. అవసరమైతే కేంద్రంపై పోరాటానికి అన్ని వామపక్షాల మద్దతు తీసుకుని ముందుకెళ్దామన్నారు. కేరళ సర్కారు కనీస వేతనం రూ.26వేలు అమలు చేస్తున్నదని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు కనీస వేతనాలతోపాటు 100 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు ఉద్యమాలకు సీఐటీయూ సంఘీభావం, సహకారం అందిస్తుందన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, కోశాధికారి కె.సునీత, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జి.కవిత, జి.పద్మ, ఈ.వెంకటమ్మ, స్వర్ణ, డి.సునీత, కోటేశ్వరి, స్వప్న, శారద, మేలమ్మ, నర్సమ్మ, త్రివేణి పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ కారు ఢీకొని వ్యక్తి మృతి

మేడ్చల్ మున్సిపాల్టీ పరిధిలోని అత్వెల్లి వద్ద ఘటన



నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్వెల్లి వద్ద జరిగింది. మేడ్చల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన గౌర్ల నర్సింహా(58) మంగళవారం ఉదయం తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై డబిల్‌పూర్ గ్రామం వైపు 44వ జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ మున్సిపాల్టీ పరిధి అత్వెల్లి వద్దకు చేరుకోగా అదే సమయంలో రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి కారు నర్సింహా ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ ఎస్ఐ శంకర్ గౌడ్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు. డ్రైవర్ చంద్రాపురం శేఖర్‌పై కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే, ప్రమాద సమయంలో కారులోనే ఉన్న వంటేరు ప్రతాప్ రెడ్డి వాహనం నుంచి దిగి కాసేపు ఘటన స్థలంలోనే ఉన్నారు. అనంతరం మరో వాహనంలో వెళ్లిపోయారు. మృతుడి కుటుంబీకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరగా.. వంటేరు ప్రతాప్ రెడ్డి అనుచరులు వారితో మాట్లాడి రూ.6 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

బీబీసీపై ప్రతీకారం

(మొదటిపేజీ తరువాయి)

ఆశిస్తున్నాం" అని ట్వీట్ చేసింది.

దాక్యుమెంటరీ ప్రసారం చేసిందనే

గుజరాత్ 2002 మత ఘర్షణలకు బాధ్యుడు ఆనాటి సీఎం నరేంద్రమోడీయేనని పేర్కొంటూ బీబీసీ రెండు భాగాలుగా ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. ఇది భారత్‌లోనూ, విదేశాల్లోనూ సంచలనం సృష్టించింది. పాలకుల మద్దతు, వారి ప్రోద్బలంతోనే మైనార్టీలు లక్ష్యంగా హింసాకాండ చెల రేగిందని డాక్యుమెంటరీలో చూపారు. ఈ డాక్యుమెంటరీ మనదేశ రాజకీయాల్ని తీవ్రంగా కుదిపేసింది. ఈ డాక్యుమెంటరీ భారత్‌లో విడుదల చేయరాదని మోడీ సర్కార్ ఆంక్షలు విధించింది. దాంతో బీబీసీ వెబ్‌సైట్ నుంచి కొద్ది గంటల్లోనే వీడియోను తొలగించారు. అయితే 'ఇండియా : ద మోడీ క్వశ్చన్' అనే ఈ డాక్యుమెంటరీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సామాజిక మాధ్యమా ల్లోనూ దీనిని ప్రసారం చేయవద్దని, దీనికి సంబంధించిన ట్వీట్లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 21న ఆదేశించింది. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న మోడీ సర్కార్ ప్రతీకార చర్యలకు దిగినట్టు తెలుస్తోంది. వ్యాపార కార్యకలాపాలు జరిగే ప్రదేశాల్లో మాత్రమే ఐటీ సర్వే నిర్వహిస్తారని తెలుస్తోంది. బీబీసీ డాక్యుమెంటరీని అడ్డుకునేందుకు కేంద్రం ప్రయత్నించి నప్పటికీ, దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల్లో, విద్యా సంస్థల్లో వీడియోను ప్రదర్శించారు. ఈ డాక్యుమెంటరీ ప్రసారంపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఆందోళన కలిగించే విషయం : ఎడిటర్స్ గిల్డ్

బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడుల్ని 'ద ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' (ఈజీఐ) తీవ్రంగా ఖండించింది. ఇది అత్యంత ఆందోళన కలిగించే విషయంగా పేర్కొంది. మీడియా సంస్థలపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాల్ని విమర్శిస్తే..ప్రతీకార ధోరణితో కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు దాడులకు దిగుతున్నాయని ఈజీఐ అభిప్రాయపడింది. మీడియా సంస్థల్ని లక్ష్యంగా చేసుకొని పదే పదే బెదిరింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించింది.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం - జర్నలిస్టు సంఘాల ఆగ్రహం

ఐటీ దాడులపై నేషనల్ ఎలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే), ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించాయి. ప్రభుత్వ ఏజెన్సీ లను ఉపయోగించుకుని ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిని భయపెట్టే ధోరణికి ఈ దాడులు కొనసాగింపేనని తెలిపాయి. జర్నలిస్టులు, మీడియా సంస్థల హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించాయి. గుజరాత్ లో 2002లో జరిగిన హింసాకాండ, భారతదేశంలోని మైనారిటీల ప్రస్తుత స్థితిగతు లపై బీబీసీ రెండు డాక్యుమెంటరీలను ప్రసారం చేసిన నేపథ్యంలోనే ఈ దాడులు జరిగాయని స్పష్టం చేశాయి. ప్రభుత్వ విధానాలను విమర్శించిన న్యూస్‌క్లిక్, న్యూస్ లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్ కార్యాలయాల్లోనూ 2021లో ఐటీ శాఖ సోదాలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశాయి. స్వతంత్ర మీడియాను బెదిరించే సాధనాలుగా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నదనీ, వెంటనే దీనికి కట్టడిచేయాలని డిమాండ్‌చేశాయి. ఈ దాడులు స్వతంత్ర ఆలోచనలను అరికట్టడానికి, అప్రకటిత పత్రికా సెన్సార్‌షిప్‌కు, జర్నలిజంపై నియంత్రణకు పరాకాష్ట అని మీడియా సంస్థలు విమర్శించాయి.

అప్రకటిత ఎమర్జెన్సీ : కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని కాంగ్రెస్ విమర్శించింది. బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులు చేపట్టడంపై కాంగ్రెస్ మండిపడింది. అదానీ వ్యవహారంలో జేపీసీ ఏర్పాటు చేయాలని తాము డిమా ండ్ చేస్తుంటే.. కేంద్రం బీబీసీ వెనుకాల పడిందని విమర్శించింది. బీబీసీపై దాడులను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ వీడియోను కూడా పోస్ట్ చేశారు. బీబీసీ కార్యాలయాలపై ఐటీ దాడులు..."సైద్ధాంతిక ఎమర్జెన్సీ'ని తలపిస్తున్నాయి" అంటూ అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు.

బీజేపీ చేతిలో ఐటీ, సీబీఐ, ఈడీ కీలుబొమ్మలు : కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

నెక్ట్స్ అంటూ కేటీఆర్.. తదుపరి హిండెన్ బర్గ్‌పై ఈడీ దాడులు ఉంటాయా అని ఎద్దేవా చేశారు. బీబీసీ కార్యాలయంపై ఐటీశాఖ దాడుల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా స్పందించారు. ప్రధాని మోడీపై డాక్యుమెంటరీ ప్రసారం చేసిన కొన్ని వారాలకే బీబీసీ ఇండియాపై ఐటీ దాడులు జరిగాయని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మోడీపై ప్రముఖ మీడియా సంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ వివాదాన్ని రాజేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ, ముంబయిలోని బీబీసీ కార్యాలయాల్లో ఐటీ శాఖ అధికారులు ప్రత్యక్షమయ్యారు. ఇది కేవలం సర్వే అని.. సోదాలు కాదని వెల్లడించారు. పన్నుల అవకతవకల ఆరోపణలపై ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు సిస్టమ్స్ వాడొద్దనీ, ఇంట్లోనే ఉండాలని అధికారులు చెప్పినట్టు సమాచారం. పాత్రికేయుల ఫోన్లను, ల్యాప్‌టాప్‌లు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సంబంధిత వర్గాల సమాచారం. ఇదిలా ఉంటే.. అవకతవకలకు సంబంధించి ఏవైనా ఆధారాలు గుర్తిస్తే.. ఈ సర్వేను కాస్తా సోదాలుగా మార్చే అవకాశముందని సంబంధిత అధికారులు వ్యాఖ్యానించినట్లు తెలుస్తున్నది.

బిజినెస్

ఫోర్డ్‌లో వేలాది ఉద్యోగులపై వేటు..!



వాషింగ్టన్ : బహుళజాతి కార్ల తయారీ కంపెనీ ఫోర్డ్ తమ వేలాది మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. వచ్చే మూడేండ్లలో యూరప్‌లో 3,800 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, మార్కెట్‌లో విద్యుత్ కార్ల డిమాండ్ నేపథ్యంలో వ్యయాలను తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నామని ఆ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలోనే జర్మనీలో 2,300 మందిని, బ్రిటన్‌లో 200 మందిని ఇంటికి పంపించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం యూరప్‌లో మొత్తం 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. 2035 నాటికల్లా యూరప్ అంతటా విద్యుత్ కార్లను అమ్మాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుత ఏడాదిలోనే కంపెనీ ఐరోపాలో తయారు చేసిన తొలి విద్యుత్ కారును విడుదల చేయనున్నట్లు పేర్కొంది. ఆర్థికంగా సవాళ్ల నెలకొన్న నేపథ్యంలో కంపెనీ కార్యకలాపాలను గాడిలో పెట్టే ఉద్దేశంతోనే ఉద్యోగుల కోత నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇందుకోసం సాధ్యమైనంత వరకు స్వచ్ఛంద విరమణ కార్యక్రమాన్ని తీసుకోనున్నామని తెలిపింది. విద్యుత్తు వాహన తయారీ దిశగా అడుగులు వేస్తున్నందున ఇంజినీర్ల సంఖ్య పెద్దగా అవసరం ఉండకపోవచ్చునని అభిప్రాయపడింది.

లింక్డిన్‌లోనూ ఉద్యోగుల తొలగింపులు..!

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లింక్డిన్‌లోనూ ఉద్యోగుల కోత మొదలయ్యిందని తెలుస్తోంది. నియామక శాఖలోని ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు సమాచారం. కాగా.. ఎంత మందిని తొలగించేది ఆ సంస్థ వెల్లడించలేదు. 2023 ప్రారంభంలో టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించిన ఈ సంస్థ ఇప్పుడు తిరిగి ఉద్వాసనలకు పాల్పడటం ఆందోళనకరం. దీనికి సంబంధించి లింక్డిన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.

ఆడిట్ కోసం గ్రాంట్ థోర్టంట్ నియామకం



- అదాని గ్రూపు వెల్లడి

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ తీవ్ర ఆర్థిక అరోపణల నేపథ్యంలో అదానీ గ్రూపు తనపై విశ్వాసం పెంచుకునే పనిలో పడింది. ఇందుకోసం తమ కొన్ని కంపెనీల్లో స్వతంత్ర ఆడిటింగ్ కోసం అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్ థోర్టంట్‌ను నియమించుకున్నది. అదానీ కంపెనీలు తీవ్ర ఎకౌంటెన్సీ అక్రమాలు, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకోవడం, డొల్ల కంపెనీలతో విదేశాల నుంచి పెట్టుబడులకు పాల్పడుతుందని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ ఓ రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ దెబ్బతో అదాని కంపెనీ స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. మరోవైపు అదానీ కంపెనీలకు అప్పులిచ్చిన బ్యాంక్‌లు, విత్త సంస్థలు, బీమా కంపెనీలు బెంబేలెత్తుతున్నాయి. అదానీ గ్రూపునపై వచ్చిన అరోపణలను తిప్పికొట్టేందుకు.. అదానీ వాదనలను సమర్థించుకునేందుకు, ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచుకునేందుకు గ్రాంట్ థోర్టంట్ సంస్థను ఆడిటింగ్‌కు నియమించుకుని ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. నిధుల దుర్వినియోగం, స్వదేశీ నిధుల దారి మళ్లింపు, రుణాలను ఇతర అవసరాలకు వినియోగించడం వంటి ఆరోపణలపై ఆడిట్ ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంటుంది. కానీ.. గ్రాంట్ థోర్టంట్ ఏమి చేస్తుందో వేచి చూడాలి. మంగళవారం సెషన్‌లోనూ అదానీ కంపెనీల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.87 శాతం, పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ 2.06 శాతం, ఎసిసి 0.39 శాతం చొప్పున పెరగ్గా.. మిగతా స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. అదానీ టోటల్ గ్యాస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మర్, అదానీ పవర్, ఎన్‌డీటీవీ సూచీలు 5 శాతం చొప్పున పతనమయ్యాయి.

వెస్టెండ్ హౌసింగ్ ఫైనాన్స్ చైర్మెన్‌గా జగదీశ్ కపూర్



ముంబయి : గృహ రుణాలు జారీ చేసే వెస్టెండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మెన్‌గా జగదీశ్ కపూర్ నియమితులయ్యారు. ముంబయిలో జరిగిన ఆ కంపెనీ బోర్డు భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జగదీశ్ కపూర్ ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా సేవలు అందించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు, బొంబాయి స్టాక్ ఎక్చేంజీకి చైర్మెన్‌గా పని చేసిన అనుభవం ఉంది. పలు ప్రభుత్వ ప్రయివేటు బ్యాంక్‌ల బోర్డుల్లోనూ సేవలు అందించారు.


ఇన్సూరెన్స్ దేఖోకు రూ.1240 కోట్ల నిధులు

హైదరాబాద్ : దేశీయ బీమా టెక్ కంపెనీ 'ఇన్సూరెన్స్ దేఖో' తొలిసారి భారీ నిధులను సమీకరించింది. ఈ సంస్థ సిరీస్ ఎ ఫండింగ్‌లో 150 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1,240 కోట్లు) నిధులను సేకరించినట్లు ప్రకటించింది. ఈక్విటీ రౌండ్‌లో ముందంజలో ఉన్న గోల్డ్ మన్ శాక్స్ అసెట్ మేనేజ్‌మెంట్, టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్, ఇన్వెస్ట్ కార్ప్, అవతార్ వెంచర్స్, లీప్ ఫ్రాగ్ ఇన్వెస్ట్ మెంట్స్ తదితర సంస్థలు నిధులు అందించిన వాటిలో ఉన్నాయి. 2016లో అంకిత్ అగర్వాల్, ఈష్ బబ్బర్ కలిసి ఇన్సూరెన్స్ దేఖోను ఏర్పాటు చేశారు. ప్రారంభించినప్పటి నుంచి ఈ కంపెనీ గణనీయమైన ప్రీమియం వృద్ధిని నమోదు చేస్తుంది. 2023 మార్చి నాటికి వార్షిక ప్రీమియం రూ.3,500 కోట్లు సాధించాలని లక్ష్యంగా పెటుకున్నామని ఇన్సూరెన్స్ దేఖో సీఈఓ కోఫౌండర్ అంకిత్ అగర్వాల్ పేర్కొన్నారు.

హాయర్ నుంచి కొత్త ఏసీలు

న్యూఢిల్లీ: గృహోపకరణాలు, వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ హయర్ కొత్తగా కినౌచి 5స్టార్ హెవీ డ్యూటీ ప్రో ఎయిర్ కండీషనర్ సిరీస్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ సిరీస్ ఏసీలు సూపర్ కూలింగ్ ఫీచర్‌తో శక్తిమంతమైన పనితీరును అందిస్తాయని పేర్కొంది. ఇవి 65 శాతం శక్తిని పొదుపు చేస్తాయని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. హయర్ రూ.14990 విలువైన 5 సంవత్సరాల వారంటీ, రూ.4000 వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లు, రూ.1500 విలువైన ఉచిత ఇన్‌స్టాలేషన్, జీవితకాల కంప్రెసర్ వారంటీ ఉందని పేర్కొంది. హయర్ కినౌచి హెవీ డ్యూటీ ప్రో 5 స్టార్ ఎయిర్ కండీషనర్ ప్రారంభ ధరను రూ.47,990గా నిర్ణయించినట్టు వెల్లడించింది.

సెంట్రల్ బ్యాంక్‌లో అగ్ని ప్రమాద మాక్‌టెస్ట్



హైదరాబాద్ : అగ్ని ప్రమాదం జరిగితే ఎలా అప్రమత్తంగా ఉండాలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీసులో మాక్‌టెస్ట్‌ను నిర్వహించారు. దీన్ని గౌలిగూడ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ప్రదర్శించి చూపారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్‌కు చెందిన 230 మందికి పైగా ఉద్యోగులు పాల్గొని.. ఆసక్తిగా గమనించారు.

హామీ ఇచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరేషన్ ఎప్పుడు..?

ముందు వరుసలో ఉండే కార్మికులకు భద్రత లేదు



- పేదలు ఆక్రమించుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలి : గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పాదయాత్రలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-దేవరుప్పుల/జనగామ డెస్క్

రెండు పర్యాయాల ఎన్నికల మేనిఫెస్టోల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని టీఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరించిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మూడవరోజు పాదయాత్ర సింగరాజుపల్లి గ్రామం నుంచి వనపర్తి, వడ్డిచర్ల, నవాబుపేట, పటేల్ గూడెం గ్రామాల మీదుగా నెల్లుట్లకు చేరుకుంది. ఈసందర్భంగా పటేల్ గూడెం వద్ద గుడిసె వాసులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సింగరాజుపల్లి గ్రామంలో మరణించిన సీఐటీయూ నాయకులు తాటిశెట్టి శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింగరాజుపల్లి గ్రామం చౌరస్తాలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సీఐటీయూ జనగామ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు అధ్యక్షతన జరిగిన సభల్లో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. 300 కిలోమీటర్లు ఐదు జిల్లాల మీదుగా కొనసాగుతున్న ఈ పాదయాత్ర మధ్యలోనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలవాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక్కో కార్మికునికి రూ.15,600 వేతనం ఇవ్వాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు రూ.19,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో జీపీ కార్మికుల కోసం నిధులు సవరణ చేసి వెంటనే అమలు చేయాలని కోరారు. కార్మికులు హక్కులను రక్షించుకోవాలంటే.. కార్మిక సంఘాలు ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు.

నెల్లుట్ల, పటేల్ గూడెం గ్రామాల మధ్య నిరుపేదలు ఆక్రమించుకున్న భూములకు ఇండ్లకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోవడం, పూర్తయిన వాటిని లబ్దిదారులకు ఇవ్వకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలపై కార్మికులు నుంచి వినతులు స్వీకరించారు. తమ సమస్యల కోసం పాదయాత్ర చేస్తున్న నాయకులకు మంగళహారతులతో బ్రహ్మరథం పడుతున్నారు. పాదయాత్రలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తునికి మహేష్, వినోద్ కుమార్, జనగామ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకన్న, మండల అధ్యక్షులు రామచందర్, కార్యదర్శి గనగాని ఉప్పలయ్య, గ్రామ సిబ్బంది సోమరాజు, నాగేష్, రాజు, సైదమ్మ కళమ్మ పరమేష్, సాయిలు, సోమన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

- హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.మాణిక్‌రెడ్డి తరపున టీఎస్ యూటీఎఫ్ ప్రచారం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటం చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.మాణిక్ రెడ్డి తరపున రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ జూనియర్ కాలేజీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు బాగుపడాలంటే ఈ ఎన్నికల సమయంలో ఓటును ఆయుధంగా వాడాలన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలిపారు. పోరాడుతేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా కౌన్సిలర్లు సీతయ్య, మల్లయ్య, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్యుత్ అందిస్తాం

- కోమటిరెడ్డి బ్రదర్స్ ఏం మాట్లాడతారో వారికే తెలియదు.. : విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా ఉచిత విద్యుత్‌ను ఆపే ప్రసక్తే లేదని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయితీ విద్యుత్ చార్జీలను డిస్కంలకు ముందస్తుగా చెల్లించాలనే నూతన కేంద్ర విద్యుత్ విధానంపై స్పందించిన మంత్రి మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పేద ప్రజలకు అందించే రాయితీ విద్యుత్‌పై కేంద్రం కుట్రలు పన్నడం దుర్మార్గం అన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు ఉచిత విద్యుత్ అందించడం కేంద్రానికి కంటగింపుగా మారిందన్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యం లేని దేశంలో సబ్సిడీలు అవసరం ఉందన్నారు. విద్యుత్‌రంగాన్ని ప్రయివేట్‌పరం చేయడం కోసమే కేంద్రం ఎత్తులు వేస్తుందని ఆరోపించారు. అన్నం పెట్టే రైతుకు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచడం కోసమే సబ్సిడీలు అందిస్తున్నామని చెప్పారు. రైతుకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని ఉచితమని కేంద్రం భావించడం అవివేకం అన్నారు. ఒకరిద్దరు సంపన్నుల కోసం కోట్లాది మంది ప్రజలను దారిద్ర్యంలోకి నెట్టే కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ప్రజలను ఏకం చేస్తామని చెప్పారు. కేంద్రం ఫ్యూడల్ ఆలోచనలతో పేదలకు నష్టం వాటిల్లుతుందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కేంద్రం చేసే దుర్మార్గమైన ఆలోచనకు తాము పూర్తి వ్యతిరేకమన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ ఎప్పుడు ఏ పార్టీ గురించి మాట్లాడుతారో వారికే తెలియదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో ఉండి బీజేపీ గెలుస్తుందని, బీజేపీలో ఉండి కాంగ్రెస్ గెలుస్తుందనడం హాస్యాస్పదమన్నారు. వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

రైతుబీమా పథకంలో రైతు పేరు నాట్ ఎన్రోల్డ్



(ఫైల్)

నవతెలంగాణ- యాలాల

అప్పుల బాధతో ఓ యువరైతు పొలంలోనే ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలం బండమీదిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. కుటుంబీకులు, ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లే అంజిలయ్య (35), బొల్లే పార్వతమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. వారికున్న మూడెకరాల వ్యవసాయ పొలంతో పాటు, ఇతరుల ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ రబీలో వేరుశనగ, వరిపంటలు వేశాడు. కొంతకాలంగా పంటల సాగుకు దాదాపు రూ.7 లక్షల వరకు అప్పు చేశాడు. ఆశించిన మేరకు పంటల దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు, వాటికయిన వడ్డీలు పెరిగాయి. దాంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి వేరుశనగ పంట కల్లం దగ్గరే తన భార్యా పిల్లలతో కలిసి పడుకున్న అంజిలయ్య.. అర్ధరాత్రి రెండు గంటలకు భార్య పార్వతమ్మ లేచి చూసేసరికి పక్కన భర్త కనిపించలేదు. భయపడ్డ ఆమె ఫోన్ లైట్ వేసి అటు ఇటు వెతకగా కల్లానికి కొంత దూరంలో ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. భయంతో ఫోన్ ద్వారా గ్రామస్తులకు విషయం తెలపగా, వారు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని దింపారు. వెంటనే యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైతుబీమా పథకంలో అంజిలయ్య పేరు నాట్ ఎన్రోల్డ్

రైతు సాధారణ మరణం చెందినా కూడా తెలంగాణ ప్రభుత్వం రైతుబీమా పథకం ద్వారా బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు అందజేస్తోంది. అయితే మృతులు అంజిలయ్య రైతుబీమా పథకంలో పేరు నమోదు చేసుకోలేదు. రైతుబీమాలో అంజిలయ్య పేరు నాట్ ఎన్రోల్డ్ అని చూపిస్తుందని మండల వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపారు. దాంతో మృతుని భార్య, పిల్లలు దిక్కులేని వారయ్యారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత

- మరో 9 గొర్రెలకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కొల్చారం

వీధి కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత పడగా, 9 గొర్రెలు తీవ్రంగా గాయపడిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న వెటర్నరీ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వెటర్నరీ అసిస్టెంట్ ఆకుల గట్టయ్య మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కుర్మ శేఖయ్య గొర్రెల పాకపై సోమవారం రాత్రి వీధి కుక్కలు దాడి చేశాయని తెలిపారు. ఈ ఘటనలో 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయని, మరో 9 గొర్రెలు తీవ్రగాయాల పాలయ్యాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక చేస్తామన్నారు. అయన వెంట సిబ్బంది మహిపాల్, లక్ష్మీ ఉన్నారు.

బీఆర్ఎస్‌తో కాంగ్రెస్‌కు ఎలాంటి పొత్తు ఉండదు

కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే

- సర్వేలను బట్టి మాట్లాడా.. :ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ -శంషాబాద్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీ నుంచి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు ఉండదన్నారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్షులు చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా జరుగుతుందన్నారు. ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుందని తెలిపారు.

సర్వేలను బట్టి మాట్లాడా : ఎంపీ ఓకోమటిరెడ్డి వెంకటరెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అంశం గురించి సర్వేల్లో వచ్చిన రిపోర్టులను గురించి మాత్రమే తాను మాట్లాడానని నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎన్నికల సర్వే చేయించారా అనే మీడియా ప్రతినిధి ప్రశ్నకు లేదని సమాధానం ఇచ్చారు. ఈ అంశం గురించి బీజేపీ నాయకులు రాజకీయంగా వాడుకోవడం కోసం ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీతోపాటు కాంగ్రెస్‌లోని కొంతమంది చిన్నవాళ్లు సైతం తనను విమర్శించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కి బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు ఉండదని రాహుల్ గాంధీ చెప్పిన మాటనే తాను కూడా చెప్తున్నానని తెలిపారు.

జేఎన్టీయూ నిబంధనలను ఉపసంహరించుకోవాలి : టీఎస్‌టీసీఈఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మొబిలిటీ ఆఫ్ ఫ్యాకల్టీపై జేఎన్టీయూ హైదరాబాద్ అనుబంధ కాలేజీలకు సర్క్యులర్ జారీ చేసిందని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ తెలిపారు. అధ్యాపకులు పదేపదే మారితే బ్లాక్‌లిస్టులో పెడతామంటూ ప్రకటించిన నిబంధనలను ఉపసంహరించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నిబంధన అధ్యాపకులను భయభ్రాంతులకు గురిచేసేలా ఉందని విమర్శించారు. సర్వీసు నిబంధనలు కాలేజీలు రూపొందించి అధ్యాపకులకు ఇవ్వాలని చెప్పడం సరైంది కాదని తెలిపారు. విశ్వవిద్యాలయమే ఆ నిబంధనలు రూపొందించి అన్ని కాలేజీలూ పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నెలవారీ జీతాల చెల్లింపుపై దృష్టిసారించాలని కోరారు. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధ్యాపకులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలనీ, వారికి న్యాయం చేయాలని కోరారు.

17 న కేసీఆర్ జన్మదినం సందర్భంగా సీతారాముల కళ్యాణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ 69వ జన్మదినం సందర్భంగా నల్లకుంట పురాతన రామాలయ మందిరంలో ఈ నెల 17న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించనున్నట్టు కేసీఆర్ చిన్ననాటి గురువు తెలుగు పండిట్ వలేటి మృత్యుంజయ శర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవంలో సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులతో పాటు 11 జంటలు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

వరి, పత్తికి ప్రత్యామ్నాయం ఆయిల్‌పామ్ సాగు

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



నవతెలంగాణ -ఆలేరురూరల్

వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మెన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో రైతు తోట మధుకర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను మంగళవారం రామకృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం జైన్ మందిర్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయే ఐదారేండ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం ఎంచుకుందన్నారు. 30 ఏండ్ల కిందట రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తప్ప ఎక్కడా సాగు చేయలేదన్నారు. ఈ మధ్య కాలంలో మిగతా జిల్లాల్లో కూడా సాగు చేయాలన్న ఉద్దేశంతో వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి సీఎం కేసీఆర్‌ని ఒప్పించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి తీసుకొని 27 జిల్లాల్లో లక్షా 27 ఎకరాల పంట సాగు చేశారన్నారు. 8 జిల్లాలకు ప్రభుత్వం అనుమతించినప్పటికీ 40 వేల ఎకరాల పంట సాగు చేశారన్నారు. ఇంకా 10 వేల ఎకరాల సాగు చేయడానికి నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో సాగు చేసినట్టు చెప్పారు. మోత్కూరు మండలం పాలడుగులో 50వేల ఎకరాల్లో 4 లక్షల మొక్కలు పెంచుతున్నారన్నారు. ఈనెల 17న మొక్కల పంపిణీ కార్యక్రమం ఉందన్నారు. ఆలేరు మండలంలో 20 మంది రైతులు 86 ఎకరాల్లో పంట సాగు చేశారని చెప్పారు. ఫిబ్రవరి, మార్చి నెలలో ఇంకా 200 ఎకరాల సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అయన వెంట సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మెన్ మొగులగాని మల్లేశం, ఉప సర్పంచ్ మామిడాల అనిత అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె.మల్లేష్ తదితరులు ఉన్నారు.

మింత్రా బ్రాండ్ రాయబారుల సమూహంలో చేరిన తమన్నా

నవతెలంగాణ: మింత్రాతో ప్రముఖ నటి ఫ్యాషనిస్టు తమన్నా భాటియా బ్రాండ్ రాయబారిగా తన భాగస్వామ్యాన్ని ప్రకటింగా, ఇది భారతదేశంలోని అగ్రగామి ఫ్యాషన్, బ్యూటీ, జీవనశైలి షాపింగ్ డెస్టినేషన్లలో సెలబ్రిటీ కోషియంట్‌ను మరింత వృద్ధి చేసింది. తమన్నా, త్వరలోనే ప్రసారమయ్యే మింత్రా వారి సరికొత్త బ్రాండ్ క్యాంపెయిన్‌లో కనిపించనున్నారు. మింత్రా బ్రాండ్ రాయబారిగా కొనసాగుతున్న విజయ్ దేవరకొండతో తన ఫ్యాషన్ అభిప్రాయాలను పూజించే ప్రజాదరణ పొందిన ఈ నటులు వారి నటనా ప్రతిభతో మింత్రాకు విశిష్ట మరియు పరిణామకారి బ్రాండ్ క్యాంపెయిన్‌ను సృష్టించేందుకు సిద్ధమయ్యారు.మింత్రా సరికొత్త బ్రాండ్ క్యాంపెయిన్, 'బి ఎక్స్‌ట్రార్డినరీ ఎవిరీ డే'లో ఫ్యాషన్ ఎప్పుడూ కేంద్ర స్థానంలో ఉంటుండగా, ఇది దేశ వ్యాప్తంగా ఫ్యాషన్ కోసం వేసి చేసే కొనుగోలుదారులను దృష్టిలో ఉంచుకుని మింత్రాను ప్రజలకు, వారి దైనందిక ఫ్యాషన్ మరియు స్టైల్‌ను ఉన్నతీకరించడం ద్వారా వారికి బ్రాండెడ్ ఫ్యాషన్‌లో అత్యుత్తమమైన దాన్ని లభించేలా చేస్తుంది. భారతదేశపు చిత్రపరిశ్రమలో సూపర్ హిట్ సినిమాలలో నటించిన తమన్నా తన వైవిధ్యత, నటనా సామర్థ్యం మరియు నటనా శైలి ఆమె తాజా ఫ్యాషన్ శైలితో వారికి భారతదేశ వ్యాప్తంగా హార్డ్‌కోర్ అభిమానులను సంపాదించి పెట్టింది.

నేటినుంచి టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- సాయంత్రం అల్పాహారం అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి ఉదయం, సాయంత్రం పూట ప్రత్యేక తరగతులను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులుంటాయి. కరోనా తర్వాత వందశాతం సిలబస్‌తో పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది నుంచి పదో తరగతిలో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లతోనే పరీక్షలను నిర్వహిస్తారు. ఉత్తీర్ణత శాతం పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యేంత వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహించాలని నిర్ణయించింది. ఏప్రిల్ మూడు నుంచి 13వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే బుధవారం నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 34 పనిదినాలపాటు ఆ విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం (స్నాక్స్) అందించనున్నట్టు ప్రకటించింది. ఈ క్రమంలో అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు చేస్తున్నట్టు వివరించింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4,785 పాఠశాలల్లో 1,89,791 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. వారికి స్నాక్స్ కోసం రోజుకు రూ.28,46,865 ఖర్చవుతుందనీ, 34 రోజులకు వారికి రూ.9,67,93,410 ఖర్చు చేస్తున్నామని ప్రకటించింది. ఈ నిధులను డీఈవోలకు ఇప్పటికే విడుదల చేసింది. అప్పటికప్పుడు వండి వేడిగా ఉండే పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో జిల్లాలో ఒక్కో వంటకాన్ని సాయంత్రం అందించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవోలు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా అరటిపండుతోపాటు ఏదైనా వేడిగా ఉండే వంటకం అందించాలని నిర్ణయించారు. ఉడికించిన శనగలు, అటుకులు, చుడువ, వేయించిన పల్లీలు, బెల్లం, ఉడికించిన గుడ్డు, రెండు సమోసాలు, బిస్కట్ ప్యాకెట్, పకోడీ, ఉడికించిన పల్లీలు ఇచ్చే అవకాశమున్నది. సోమవారం నుంచి శనివారం వరకు ఒక్కో రోజు ఒక్కో వంటకాన్ని విద్యార్థులకు అందించాలని భావిస్తున్నారు.

బీఆర్ఎస్ పాలనలో భద్రాద్రి గుర్తింపు కోల్పోయింది

- శ్రీరాముడికి మాట ఇచ్చి మోసం చేసినోడు బాగుపడతాడా..
- తెలంగాణలో బీజేపీ గెలిచేది లేదు..
- వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తాం
- రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తాం: భద్రాచలంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం

శ్రీరాముడు నడయాడిన ప్రాంతం భద్రాచలం అని, గొప్ప చరిత్ర కలిగిన భద్రాచలం.. బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా గుర్తింపు కోల్పోయిందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర మంగళవారం రాత్రి భద్రాచలం చేరుకుంది. ముందుగా అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విభజించు.. పాలించు.. అనే విధానంతో దేశంలో బీజేపీ పరిపాలన సాగుతోందన్నారు. ఈ సందర్భంలో దేశ సమగ్రతను కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేశారని తెలిపారు. రూ.100 కోట్లతో శ్రీరాముని ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్న సీఎం హామీ ఏమయిందని ప్రశ్నించారు. గోదావరి వరద ముంపు బాధితులను ఆదుకుంటామని రూ.10వేలు ఇస్తానన్న సీఎం హామీ అమలుకాలేదని విమర్శించారు. శ్రీరాముడికి కనీసం తలంబ్రాలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ రాలేదని ఆరోపించారు. శ్రీరాముడికి మాట చెప్పి మోసం చేసినోడు బాగుపడతాడా అని కార్యకర్తల సమక్షంలో ప్రశ్నించారు. భద్రాచలాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకనే 7 మండలాలు ఆంధ్రాలో కలిపారని, భద్రాచలాన్ని కుట్రపూరితంగా మూడు ముక్కలు చేశారని విమర్శించారు. పినపాక నియోజకవర్గంలో రైతుల కష్టాలు చూసి చలించిపోయానన్నారు. సీతారామ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూములకు ఇప్పటికీ పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడుపోతుందో తెలియడం లేదని రైతులు చెబుతున్నారని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. నిత్యవసర ధరల పెరుగుదలతో రోజు కూలీకి నూనె ప్యాకెట్ కూడా వస్తలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రౌండ్‌లో కాంగ్రెస్ లేదని బీజేపీ నేతలు పిచ్చి కూతలు కూస్తున్నారని, భద్రాచలం వచ్చి చూడండి అని తెలిపారు. బోడి గుండుపై జుట్టు వచ్చేది లేదు.. తెలంగాణలో బీజేపీ గెలిచేది లేదని స్పష్టంచేశారు. ఇండ్లు లేని ప్రతి పేద కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. కౌలు రైతులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని, వరంగల్ డిక్లరేషన్ ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ పీసీసీ అధ్యక్షులు హనుమంతరావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు ప్రసంగించారు. పాదయాత్రలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి కృష్ణ, భద్రాచలం కాంగ్రెస్ నాయకులు బడగం శ్రీనివాస్, నల్లపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ విద్యార్థి రమాదేవి మరణానికి కారణమైన శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్ ఆజాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన ఆ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అనుమతుల్లేని బ్రాంచీలను రద్దు చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇంటర్ బోర్డు, శ్రీచైతన్య యాజమాన్యం మధ్య ఉన్న సంబంధం బట్టబయలు చేస్తూ ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చెడును అడ్డుకోవడం బాధ్యతే కాదు.
హక్కుగా భావించాలి - సర్వేపల్లి రాధాకృష్ణ.

సంపాదకీయం

అవునా? సీతమ్మా!


"భారత దేశ రెగ్యులేటర్లు అత్యంత శక్తి వంతులు! నిష్ణాతులు కూడా..!" అన్నది 'సీతమ్మ'. ఉంగరాల వేళ్ళతో సుప్రీం మొట్టికాయల తర్వాత ఒక ప్రధాన 'నిష్ణాత రెగ్యులేటర్' ఏమిచేస్తున్నదో తెలుసుకోవడానికే అనుకుంటా బహుశా భారత విత్తమంత్రి ఆర్.బి.ఐ. బోర్డు మీటింగుకు హాజరై ఉంటారు. మీరు పెద్ద కోర్టులో చెప్పాల్సిన మాటలు ముందే

> అదానీ సంపద ఈ స్థాయిలో పెరిగింది ఈ మూడేండ్లుగానేగా! ఆయన్ని మూడో నెంబర్‌లోకి తేవడం కోసమేనా గత ఆరేండ్లుగా సెబీ సప్పుడు చేయంది! ఇప్పుడేమైంది? ఆయన జారుడు బండమీద జారి జారి పదిహేడో స్థానానికి చేరాడు కదా! మోడీ నుండి కేటీఆర్ వరకు పెట్టుబడులు దేశంలోకి దొర్లుకుంటూ వచ్చేస్తున్నాయని గప్పాలు కొడుతున్నారు కదా! భారత నియంత్రణా వ్యవస్థలపై నమ్మకం సడలిపోయిన తర్వాత ప్రపంచంలో ఏ పెట్టుబడిదారుడైనా ఇటువైపు తొంగిచూస్తారా?

మీడియాకి చెప్పి 'సబ్ జుడైస్' కేసులో ఎందుకు ఇరుక్కుంటారులేండి? మీరు చెప్పిన అత్యంత పురాతన రెగ్యులేటర్, రిజర్వు బ్యాంకు, సుప్రీం మొట్టికాయల దాకా ఎందుకు తెచ్చిందనేదే నేడు మీడియా ప్రశ్న! సగటు భారతీయుడు అడుగుతున్న ప్రశ్న.

"ఇప్పటిదాకా షేర్ మార్కెట్ మదుపుదారులకు జరిగిన నష్టం భవిష్యత్‌లో జరుగకుండా ఉండాలంటే మేము ఏమి చేయాలి? 20వ తేదీకల్లా తేల్చుమ"ని మరో కీలక నియంత్రణా సంస్థ సెబీకి దాదాపు వార్నింగ్ ఇచ్చింది సుప్రీంకోర్టు. తామే ఒక ఎక్స్‌పర్ట్ ప్యానెల్ ఏర్పాటు చేస్తామని చెప్పింది. ప్రభుత్వం గీసిన గీతల మధ్యే నడిచే 'నిష్ణాతులు' సర్కారీ నిష్ణాతులనేగా సుప్రీం అభిప్రాయం. అందుకేనేమో హడావుడిగా ఒక ఎక్స్‌పర్ట్ ప్యానెల్‌కు పచ్చజెండా ఊపింది ప్రభుత్వం!

కొన్ని కీలక ప్రశ్నలను ఇక్కడ ప్రస్తావించాలి. మొత్తం షేర్ హెూల్డర్ల ప్రయోజనాలు కాపాడే నిష్ణాతులకమిటీనా, అదానీని కాపాడే కమిటీనా దేశానికి కావల్సింది? సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) కచ్చితంగా అత్యంత నైపుణ్యం కలిగిన నిష్ణాతులతో నిండిన సంస్థే! దానిలో ఎవరికీ సందేహం ఉండాల్సిన పనిలేదు. సమస్య 'సెబీ'ది కాదు. దాన్ని నియంత్రించే పాలకులది. అదానీతో, అంబానీతో చెట్టాపట్టాలేసుకున్న పాలనది. 2017లో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నాటి సంపాదకుడు పరంజయ్ గుహా ఠాకూర్తా అదానీ మోసాల గురించి మొట్టమొదట ప్రస్తావించారు. అంత ప్రతిష్టాత్మక సంస్థ ఆయనకి ఉద్వాసన పలికే దాకా విశ్రమించలేదు మోడీ-1 సర్కార్. 2019లో మొదటిసారి, 2020లో రెండవసారి, 2022లో 3వసారి తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా లోక్‌సభలో అదానీ 'దందా' గురించి ప్రస్తావిస్తే ఆర్థికశాఖ మంత్రులు సెబీ తీవ్రంగా పరిశీలిస్తోందని (సెబీ ఈజ్ సీజ్డ్ ఆఫ్ ద మ్యాటర్) సమాధానం చెప్పారు. తోటకూర కాడలు దొంగిలించినప్పుడే దండించి ఉంటే ఇంత పెద్ద దొంగనై జైలుకి పోవాల్సిన స్థితి రాకపోనుకదా!" అని దొంగరాముడు సినిమా చివరిడైలాగు గుర్తుచేసుకోవాలి!



2017 నుండి 2023 దాకా ఆరేండ్ల పాటు సెబీ తేల్చలేక పోయిందా? తేల్చే నైపుణ్యం అసలు దానికి లేదా? ఎవరైనా అడ్డు పడ్డారా? సెబీని అడ్డుకోగల శక్తివంతులెవరు? అదానీ షేరు ధర రూ.2000 ఉండగా మొన్న ఆయన ఎఫ్‌పిఒకి వెళితే చివరి నిముషంలో ముఖేష్ అంబానీ, నవీన్ జిందాల్ వంటివారు రూ.3200 పెట్టి భారీగా ఎందుకు కొన్నారు? అదానీ చాలా శక్తివంతుడే అని ప్రపంచానికి రుజువుచేసేందుకేనా? మొత్తం రూ.20వేల కోట్ల డబ్బును తోటిపెట్టుబడిదారులందరికీ తిరిగి చెల్లించేశాడాయన. ఇవన్నీ సెబీ పట్టించుకోవాల్సినవి కావా? దాని వాచ్‌డాగ్ పనిలో వీటన్నిటినీ చూసి కూడా కరవకపోతే పోయే, కనీసం మొరగదా? అని జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

మారిషస్ వంటి చోట్ల తన డొల్లకంపెనీల ద్వారా మనీలాండింగ్ చేశాడని, రౌండ్ ట్రిప్పింగ్‌కి పాల్పడ్డాడని అదానీపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరగదా? సుప్రీంకోర్టు అభిప్రాయాలను కూడా ఒక 'లీడ్'గా వాడుకున్న సర్కార్ షేర్ మార్కెట్‌లో డబ్బు కోల్పోయిన మదుపుదారుల రక్షణ అనే పేర అదానీకే అండగా నిలబడటం సరైందేనా? డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డి.ఆర్.ఐ) అసలు మనదేశంలో ఉందా? పనిచేస్తోందా? అనే సందేహం ఎవరికైనా రాక మానదు. అదానీ సంపద ఈ స్థాయిలో పెరిగింది ఈ మూడేండ్లుగానేగా! ఆయన్ని మూడో నెంబర్‌లోకి తేవడం కోసమేనా గత ఆరేండ్లుగా సెబీ సప్పుడు చేయంది! ఇప్పుడేమైంది? ఆయన జారుడు బండమీద జారి జారి పదిహేడో స్థానానికి చేరాడు కదా! మోడీ నుండి కేటీఆర్ వరకు పెట్టుబడులు దేశంలోకి దొర్లుకుంటూ వచ్చేస్తున్నాయని గప్పాలు కొడుతున్నారు కదా! భారత నియంత్రణా వ్యవస్థలపై నమ్మకం సడలిపోయిన తర్వాత ప్రపంచంలో ఏ పెట్టుబడిదారుడైనా ఇటువైపు తొంగిచూస్తారా?

'అదానీ' అస్తమించని సామ్రాజ్యంలో చీకటి పడకుండా దివిటీలు పట్టుకు కాపలాకాసే వ్యక్తులు, వ్యవస్థలూ ఇంకా ఉన్నాయా? వాటిని నియంత్రించగలిగితేనే మన రెగ్యులేటరీ వ్యవస్థ సరిగా ఉన్నట్టు లెక్క సీతమ్మా!

వియత్నాంలో తమ మిలిటరీ మారణకాండను నిర్ధారించిన దక్షిణ కొరియా కోర్టు!

వియత్నాం! స్వాతంత్ర్యం, మూడు సామ్రాజ్యవాద దేశాల కబంధహస్తాల నుంచి విముక్తి కోసం మూడున్నర దశాబ్దాల పాటు అపార రక్తం ధారపోసి, త్యాగాలు చేసిన ఒక చిన్న దేశం. ఇలాంటిది ప్రపంచంలో మరొకటి లేదు. ఖండాలన్నింటినీ తన చెప్పుచేతల్లో ఉంచుకొనేంత బలం కలిగిన అమెరికా సేనలను ప్రాణాలు దక్కితే చాలు బతుకుజీవుడా అంటూ పారిపోయేట్లు చేసి ప్రజాశక్తితో ఎంత పెద్ద మిలిటరీనైనా మట్టికరిపించవచ్చు అని నిరూపించిన దేశం కూడా అదే!! అలాంటి వీర గడ్డకు చెందిన గుయన్ థీ థాన్ (62) వేసిన కేసును తొలిసారిగా విచారించిన దక్షిణ కొరియా కోర్టు వియత్నాంలో మారణకాండకు దక్షిణ కొరియా మిలిటరీ కారణమని ఫిబ్రవరి మొదటి వారంలో సంచలనాత్మక తీర్పునిచ్చింది. ఫ్రెంచి వలసగా ఉన్న వియత్నాంను రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమించింది. అది


ఎం. కోటేశ్వరరావు

పతనమైన తరువాత తిరిగి ఫ్రాన్స్ ఆక్రమణలోకి వెళ్లింది. దాన్ని ఓడించిన తరువాత అమెరికా రంగంలోకి దిగి ఉత్తర వియత్నాంలోని సోషలిస్టు సమాజాన్ని, కమ్యూనిస్టులను, దక్షిణ వియత్నాంలోని జాతీయవాదులు, కమ్యూనిస్టులను అణచేందుకు చూసింది. దానికి మద్దతుగా తైవాన్‌లో తిష్టవేసిన చాంగ్‌కై షేక్ మిలిటరీ, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, లావోస్, కంపూచియా, ఫిలిప్పైన్స్, థాయిలాండ్, దక్షిణ వియత్నాం మిలిటరీలు వచ్చాయి. ఉత్తర, దక్షిణ వియత్నాంలలోని కమ్యూనిస్టులకు మద్దతుగా చైనా, సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, లావోస్, కంపూచియాల్లోని కమ్యూనిస్టు గెరిల్లాలు బాసటగా నిలిచారు.

వియత్నాంలో అమెరికా కూటమి జరిపిన మారణకాండకు గురికాని గ్రామం, పట్టణం లేదంటే అతియోక్తి కాదు, ప్రతి చెట్టూ, పుట్ట, రాయి, రప్ప దేన్ని

> దక్షిణ వియత్నాంలో అమెరికా జరుపుతున్నదాడులకు తోడుగా దక్షిణ కొరియా మూడు లక్షల 20వేల మంది సైనికులను అక్కడకు పంపింది. వారు అమెరికన్లతో కలిసి లక్షల మందిని చంపారు. దాన్ని దక్షిణ కొరియా ప్రభుత్వం ఇంతవరకు అంగీకరించలేదు. ఈ దారుణం తరువాత మై లాయి అనేచోట అమెరికా మిలిటరీ ఇలాంటి ఊచకోతకే పాల్పడి పెద్ద సంఖ్యలో చంపింది. విమానాలు, మిలిటరీ శకటాలతో అమెరికా దాడి జరపగా గెరిల్లాలు భౌగోళిక అనుపానులు ఎరిగి ఉన్నందున తప్పించుకొని శత్రువులను దెబ్బతీశారు. వారికి తినేందుకు తిండి కూడా లేని స్థితిలో ఆహారాన్ని కూడా పరిమితంగా తీసుకొంటూ పోరు జరిపారు.

కదిలించినా దుర్మార్గాలు-వాటికి ప్రతిగా పోరులో ప్రాణాలర్పించిన వారి కథలు, గాథలు వినిపిస్తాయి. అతివల కన్నీటి ఉదంతాలు కోకొల్లలు. అలాంటి మారణకాండలో ఏడు సంవత్సరాల ప్రాయంలో గాయపడి కోలుకున్న గుయన్ థీ థాన్ అనే 62ఏండ్ల మహిళ 2020లో వేసిన కేసులో దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని ఒక కోర్టు తీర్పునిచ్చింది. దక్షిణ కొరియా మిలిటరీ జరిపిన దారుణంలోనే ఆమె గాయపడిందని చెప్పటమే గాక, కేసులో ప్రభుత్వం చేసిన వాదనలన్నింటినీ తోసి పుచ్చి ఆమెకు మూడు కోట్ల వన్‌లు (24వేల డాలర్లు) నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. దీని మీద ప్రభుత్వ అప్పీలు చేస్తుందా? మరొకటి చేస్తుందా అన్నది వెంటనే వెల్లడి కాలేదు. ఫాంగ్ హట్ సమీపంలోని ఫాంగ్ నీ అనే వియత్నాం గ్రామంలో 1968 ఏప్రిల్ 12న దక్షిణ కొరియా మిలిటరీ మూకలు నిరాయుధులైన పౌరులపై అకారణంగా జరిపిన కాల్పుల్లో 70మంది మరణించగా 20మంది గాయపడ్డారు. వారిలో గుయన్ థీ థాన్ ఒకరు. ఆ ఉదంతంలో అమెతల్లి, సోదరుడితో సహా కుటుంబంలోని ఐదుగురు మరణించారు. ఈ ఉదంతం గురించి అమెరికా మిలిటరీ రికార్డులలో నమోదు చేశారు. ఒక దక్షిణ కొరియా మిలిటరీ జవాను గెరిల్లాల కాల్పుల్లో గాయపడిన తరువాత ఈ ఉదంతం జరిగినట్లు పేర్కొన్నారు. అంటే గెరిల్లాలనేమీ చేయలేక సాధారణ పౌరుల మీద కక్ష తీర్చుకున్నట్లు స్పష్టం అవుతున్నది. ఈ దారుణానికి ఒడిగట్టిన తరువాత గెరిల్లాల దాడికి భయపడి సైనికులు పారిపోయినట్లు అమెరికా రికార్డుల్లో ఉంది.

దశాబ్దాల పాటు సాగిన దుర్మార్గం, దాన్ని ప్రతిఘటిస్తూ సాగిన పోరులో మరణించిన వారి కచ్చితమైన సంఖ్యలు అందుబాటులో లేవు. అనేక మందిని అంతర్ధానం చేశారు, మిలిటరీ మరణాలను దాచారు. వియత్నాం పోరును రెండు భాగాలుగా చూడవచ్చు. 1945లో జపాన్ దురాక్రమణ నుంచి తిరిగి ఫ్రాన్స్ ఆక్రమించిన తరువాత 1954 జూలై 21వరకు ఒకటి, తరువాత జరిగిన పరిణామాలను రెండో అంకంగా చెబుతున్నారు. ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా సమాచారం ప్రకారం 1945 నుంచి 1954వరకు ఫ్రెంచి సామ్రాజ్యవాదులతో కమ్యూనిస్టు నేత హెూచిమిన్ తదితరుల నేతృత్వంలో సాగిన పోరును చరిత్రకారులు తొలి ఇండోచైనా వార్‌గా పిలిచారు. ఈ పోరులో కమ్యూనిస్టు గెరిల్లాలు, సాధారణ పౌరులు మూడు నుంచి ఐదులక్షల మంది వరకు ప్రాణాలర్పించారు. ఫ్రెంచి దళాలు, వారితో చేతులు కలిపిన స్థానికులు, కొద్ది మంది ఫ్రెంచి పౌరులు మొత్తం 92 నుంచి లక్షా పదివేల మంది వరకు మరణించారు. ఈ పోరు ముగింపు మరొక కొత్త పరిణామాలకు నాంది పలికింది. జెనీవాలో కుదిరిన ఒప్పందం ప్రకారం వియత్నాంను ఉత్తర-దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తరవియత్నాం కమ్యూనిస్టుల ఆధీనంలోకి వచ్చింది. రెండు సంవత్సరాల్లో దక్షిణ వియత్నాంలో ఎన్నికలు జరిపి రెండు ప్రాంతాల విలీనం జరపాలని దానిలో ఉంది. ఆ ఒప్పందం ప్రకారం ఎన్నికలు జరిగితే దక్షిణ వియత్నాంలో ఫ్రెంచి అనుకూల శక్తులు ఓడిపోవటం ఖాయంగా కనిపించింది. దాంతో ఆసియాలో కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టేందుకు అమెరికన్లు ఫ్రాన్స్ స్థానంలో ప్రవేశించి విలీనాన్ని అడ్డుకున్నారు. దక్షిణ వియత్నాంలోని దేశభక్తులు, కమ్యూనిస్టులు వియట్‌కాంగ్ పేరుతో ఒక దేశభక్త సంస్థను ఏర్పాటు చేసి అమెరికా, స్థానిక మిలిటరీ నుంచి విముక్తికోసం పోరు ప్రారంభించారు. దానికి ఉత్తర వియత్నాం పూర్తి మద్దతు ఇచ్చింది. అది 1975 ఏప్రిల్ 30వరకు సాగింది. అమెరికా దళాలు అక్కడి నుంచి పారిపోయాయి.

దాడుల్లో 30లక్షల మంది అమెరికా సైనికులు పాల్గొన్నారు. దాడుల్లో అక్కడికక్కడే లేదా గాయాలు తగిలి చచ్చిన వారు గానీ 58,220 మంది, వీరుగాక దక్షిణ వియత్నాం కీలుబొమ్మ మిలిటరీ రెండు నుంచి రెండున్నరలక్షల మంది, మొత్తంగా మరణించిన వారు 3,33,620 నుంచి 3,92,364 మంది ఉంటారని లెక్క. ఈ కూటమికి చెందిన పదకొండు లక్షల మంది సైనికులు గాయపడ్డారని అంచనా. కమ్యూనిస్టు వియత్నాం మిలిటరీ, గెరిల్లాలుగానీ పదకొండు లక్షల మంది ప్రాణాలర్పించారు. అమెరికా దాని తొత్తుల దాడుల్లో ఇరవైలక్షల మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని అంచనా.

దక్షిణ వియత్నాంలో అమెరికా జరుపుతున్నదాడులకు తోడుగా దక్షిణ కొరియా మూడు లక్షల 20వేల మంది సైనికులను అక్కడకు పంపింది. వారు అమెరికన్లతో కలిసి లక్షల మందిని చంపారు. దాన్ని దక్షిణ కొరియా ప్రభుత్వం ఇంతవరకు అంగీకరించలేదు. ఈ దారుణం తరువాత మై లాయి అనేచోట అమెరికా మిలిటరీ ఇలాంటి ఊచకోతకే పాల్పడి పెద్ద సంఖ్యలో చంపింది. విమానాలు, మిలిటరీ శకటాలతో అమెరికా దాడి జరపగా గెరిల్లాలు భౌగోళిక అనుపానులు ఎరిగి ఉన్నందున తప్పించుకొని శత్రువులను దెబ్బతీశారు. వారికి తినేందుకు తిండి కూడా లేని స్థితిలో ఆహారాన్ని కూడా పరిమితంగా తీసుకొంటూ పోరు జరిపారు. అనేక రోజులు పస్తులు కూడా ఉన్నారు. సరైన పడకలు, నిదురలేని రోజులు అనేకం. సొరంగాలు తవ్వి రక్షణ తీసుకోవటమే గాక అమెరికా మిలటరీ మీద దాడి చేసి అడవుల్లో కనిపించకుండా తప్పించుకొన్నారు. ఇదంతా ఒక రోజు, ఒకనెల, ఏడాది కాదు పందొమ్మిది సంవత్సరాల పాటు పోరాడారు.

మై లాయి మారణ కాండ అమెరికా దుష్ట చరిత్రలో చెరగని మచ్చ. ఇలాంటి అనేక దారుణాలు జరిపిన అమెరికా, ఫ్రాన్స్, అంతకు ముందు జపాన్ జరిపిన దారుణాలను ఇప్పటికీ ఆ ప్రభుత్వాలు అంగీకరించటం లేదు. మరోవైపు మానవహక్కులు, మన్నూ అంటూ ప్రపంచానికి కబుర్లు చెబుతున్నారు. మై లాయిలో మరతుపాకులతో అమెరికన్లు జనాలను ఊచకోత కోశారు. విలియం కాలే అనే లెఫ్టినెంట్ నాలుగు గంటల పాటు ఆ మారణకాండను పర్యవేక్షించాడు. వందలాది మహిళల మీద లైంగిక దాడులు జరిపి నరికి చంపటంతో పాటు రెండు వందల మంది పిల్లలతో సహా 504మందిని చంపారు. వారందరినీ గోతుల్లో దించి ఎటూ వెళ్లకుండా మరతుపాకులతో కాల్చి చంపారు. ఈ ఉదంతాన్ని తరువాత కాలంలో అమెరికా మిలిటరీలో పాఠంగా చెప్పారంటే దుర్మార్గాలను ఎలా జరపాలో శిక్షణ ఇచ్చారన్నది స్పష్టం. వైమానిక దళ మేజర్ లాగాన్ సిషన్ పాఠాలు చెబుతూ మనం వారిని హీరోలుగా పరిగణించవచ్చని, మై లాయిలో ఎవరైనా హీరోలు ఉంటే వారే అని చెప్పాడంటే ఎంత దుర్మార్గంగా ఉంటారో వేరే చెప్పనవసరం లేదు. ఆ మారణకాండ జరిపినప్పుడు జనం మీదకు హెలికాప్టర్‌ను తోలిన ముగ్గురు పైలట్లను మూడు దశాబ్దాల తరువాత హీరోలుగా అమెరికా సత్కరించింది. విలియం కాలే మీద తప్పనిసరై విచారణ జరిపి శిక్ష వేశారు. తరువాత దాన్ని గృహనిర్బంధంగా మార్చారు, అది కూడా మూడున్నర సంవత్సరాల తరువాత వదలివేశారు. ఇలాంటి దుర్మార్గులను వదలివేసిన కారణంగానే తరువాత 2005లో ఇరాక్‌లోని హడితా అనే చోట అమెరికా ముష్కరులు

> 1945 నుంచి 1954వరకు ఫ్రెంచి సామ్రాజ్యవాదులతో కమ్యూనిస్టు నేత హెూచిమిన్ తదితరుల నేతృత్వంలో సాగిన పోరును చరిత్రకారులు తొలి ఇండోచైనా వార్‌గా పిలిచారు. ఈ పోరులో కమ్యూనిస్టు గెరిల్లాలు, సాధారణ పౌరులు మూడు నుంచి ఐదులక్షల మంది వరకు ప్రాణాలర్పించారు. ఫ్రెంచి దళాలు, వారితో చేతులు కలిపిన స్థానికులు, కొద్ది మంది ఫ్రెంచి పౌరులు మొత్తం 92 నుంచి లక్షా పదివేల మంది వరకు మరణించారు. ఈ పోరు ముగింపు మరొక కొత్త పరిణామాలకు నాంది పలికింది.



మహిళలు, పిల్లలతో సహా 24మంది పౌరులను ఊచకోత కోశారు. దానికి ఒక్కడిని బాధ్యుడిగా చేసి మందలించి వదలివేశారు. ఆఫ్ఘనిస్తాన్‌లో కూడా అమెరికన్లు ఇలాంటి దుర్మార్గానికే పాల్పడ్డారు.

వియత్నాంలో దక్షిణ కొరియా మిలిటరీ దుర్మార్గాన్ని కోర్టు నిర్ధారించిన తరువాత కొరియాను ఆక్రమించినప్పుడు జపాన్ చేసిన దుర్మార్గాలను కూడా విచారించాలని, వాటిని జపాన్ అంగీకరించాలని దక్షిణ కొరియన్లు కొందరు ప్రదర్శన జరిపి డిమాండ్ చేశారు. జపాన్ సైనికులకు కొరియా మహిళలను బానిసలుగా మార్చి రాత్రుళ్లు బలవంతంగా అప్పగించి బలిచేశారు. వారిని "సుఖ మహిళలు"గా అభివర్ణించి దుర్మార్గానికి పాల్పడ్డారు. జపాన్ మాదిరి అక్రమాలు జరగలేదని బుకాయించకుండా మానవ హక్కుల పట్ల గౌరవం ఉన్నదిగా కొరియా నిరూపించుకోవాలని కూడా వారు కోరారు. దక్షిణ కొరియా క్రైస్తవ మతాధికారులు కూడా వియత్నాం బాధితులకు క్షమాపణలు చెప్పారు. వియత్నాంలో మారణకాండతో పాటు అమెరికా జరిపిన మరొక దుర్మార్గం ఏమంటే ఏజెంట్ ఆరెంజ్ పేరుతో రసాయన దాడులకు కూడా పాల్పడింది. దీని వలన భూమి, నీరు కలుషితం కావటంతో జనాలు అనేక రుగ్మతలకు గురికావటం, పంటలకు దెబ్బతగిలింది.అమెరికా జరిపిన ఈ దాడి వలన తమకు జరిగిన నష్టాన్ని పూడ్చాలంటూ కొన్ని కేసులను దాఖలు చేశారు. దీని బాధితులకు కూడా న్యాయం చేయాలి. మరి ప్రజాస్వామ్యం, మానవహక్కుల పరిరక్షణ గురించి కబుర్లు చెప్పే అమెరికా, ఫ్రాన్స్, జపాన్ ఇండోచైనా దేశాలు, కొరియన్లకు క్షమాపణ చెప్పటమే కాదు, నష్టపరిహారం చెల్లిస్తాయా!

సెల్: 8331013288



అవార్డులు నిర్జీవం - ఆదర్శాలు సజీవం

ఆర్థిక నేరస్తుడు గౌతమ్ అదానీ స్పాన్సర్డ్ అవార్డును తమిళ కవయిత్రి సుకీర్తరాణి తిరస్కరించి ఎందరికో ఆదర్శంగా నిలవడం శుభ పరిణామం. ఈ రకంగా ఆమె అవార్డుని స్వీకరించపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా ప్రతి ఒక్కరిని ఆలోచింప జేసిందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అవార్డులను ప్రకటించగానే స్వీకరించాలనుకునే వారు కోకొల్లలు ఉన్న ఈ రోజుల్లో ఆమె తాను విశ్వసించిన ఆదర్శాల మేరకు ఆ అవార్డుని తిరస్కరించి భావి తరాలకు సరికొత్త సందేశాన్ని అందివ్వడం అభినందనీయం. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించే 'దేవి అవార్డ్స్' కోసం దేశవ్యాప్తంగా సుకీర్తరాణితో పాటుగా శాస్త్రవేత్త గగన్దీప్ కాంగ్, భరతనాట్యం నృత్యకారిణి ప్రియదర్శిని గోవింద్, పరోపకారి రాధికా సంతానకృష్ణ, స్క్వాష్ క్రీడాకారిణి జోష్నా చినప్ప తదితరులు మొత్తంగా 12 మంది మహిళా ప్రముఖులను ఎంపిక చేయగా, తమిళ కవయిత్రి సుకీర్తరాణి మాత్రమే అవార్డును తిరస్కరించడం గమనార్హం. ముఖ్యంగా సుకీర్తరాణి దళిత సాహిత్యానికి చేసిన కృషికి ఎంపికయ్యారు. 'నేను మొదట ఈ అవార్డును స్వీకరించడానికి అంగీకరించాను. కానీ ముఖ్యంగా ఈ అవార్డ్ ఈవెంట్‌కు ప్రధాన స్పాన్సర్ అదానీ అని తెలుసుకుని నేను నిర్ఘాంతపోయాను. నేను మాట్లాడే రాజకీయాలు, నేను నమ్మిన సిద్ధాంతాల కోసం అదానీ గ్రూప్ ఆర్థికంగా మద్దతు ఇచ్చే కార్యక్రమంలో అవార్డును స్వీకరించడం నాకు సంతోషంగా లేదు. కాబట్టి నేను 'దేవి అవార్డు'ని స్వీకరించడానికి నిరాకరి స్తున్నాను. అయితే నిపుణుల బృందం ఎంపిక తీర్పును మాత్రం గౌరవి స్తాను' అని పేర్కొనడం ఆమె విధేయత పటిమని స్పష్టంగా వెల్లడిస్తుంది.

1973లో తమిళనాడులోని వేలూరు జిల్లాలోని లాలాపేట్ అనే గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో సుకీర్తరాణి జన్మించారు. ఎకనామిక్స్, తమిళ సాహిత్యంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఆమె రాణిపేట జిల్లాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తమిళం బోధిస్తున్నారు. ఆమె చురుకైన స్త్రీవాది, సామాజిక కార్యకర్త. సుకీర్తరాణి తమిళంలో రాసే దళిత స్త్రీవాద కవయిత్రి. ఆమె కవితలు కులం, శరీరం చుట్టూ కేంద్రీకృతం అయ్యాయి. కుల వ్యవస్థ స్త్రీల శారీరక స్వేచ్ఛను ఎలా నిర్బంధిస్తుందో ఆమె తన రచనల ద్వారా బట్టబయలు చేశారు. ఆ ప్రాంతంలోని పది దళిత కుటుంబాలలో పాటుగా ఆమె ఒకరిగా పెరిగారు. ఆమె చిన్నప్పటి నుండి కుల వివక్షని ఎదుర్కొన్నారు. నేను ఇంటి బయట అడుగు పెట్టగానే కులం 'కుక్క'లా వెంటాడుతుంది అని ఆమె ఆవేదన చెంది తక్షణమే సామాజిక కార్యాచరణ దిశగా ప్రేరేపింపబడ్డారు.

కైపత్రి యెన్ కనవు కేల్, ఇరవు మిరుగమ్, కామత్తిప్పూ, తీండపడతా ముత్తం, అవలై మొజిపెయర్తాల్, ఇప్పదిక్కు ఏవల్ మొదలైన ఆరు కవితా సంకలనాలను సుకీర్తరాణి రచించారు. ఆమె తన రచనల ద్వారా మరుగున పడిన అనేక విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా సుకీర్తరాణి కవితలు తమిళనాడులోని కళాశాల పాఠ్యాంశాలలో చేర్చబడ్డాయి. 2021 ఆగస్టులో ఢిల్లీ యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ ఏకపక్షంగా ఇంగ్లీష్ హానర్స్ సిలబస్ నుండి సుకీర్తరాణి రాసిన బామా అలియాస్ ఫౌస్టినా సూసైరాజ్ అనే పాఠ్యాంశాన్ని తొలగించడం సర్వత్రా విమర్శలకు గురైంది. ఆమె కవితలు ఇంగ్లీష్, మలయాళం, కన్నడ, హిందీ, జర్మన్ భాషలలోకి అనువదించబడ్డాయి.

దళిత స్త్రీలు అధ్వాన స్థితుల్లో కొట్టు మిట్టాడుతున్న ప్రస్తుత తరుణంలో ఆమె ప్రధానంగా స్త్రీ విముక్తి గురించి ముఖ్యంగా దళిత మహిళల అభ్యున్నతిపై దృష్టిని కేంద్రీకరించి ఆ దిశగా పురోగమిస్తున్నారు. 'నమ్మిన ఆదర్శాల ముందు అవార్డులు ఏమాత్రం సరితూగవు' అని సుకీర్తరాణి నిరూపించారు. నిర్జీవ అవార్డుల కన్నా చరిత్రలో కలకాలం సజీవంగా మనగలిగే ఆదర్శాలు నూతన సమాజ నిర్మాణానికి బాసటగా నిలుస్తాయి అని నిస్సందేహంగా చెప్పవచ్చు.


జెజెసిపి బాబూరావు
9493319690



ఒక విధ్వంస కావ్యం

కేళ్ళ ముందు కదలాడిన భూమి
కొన్ని కలలు కరుగుతూ కడు దుఃఖాన్ని నిలిపింది
సిరియా, టర్కీ ఇప్పుడు
ఓదార్పు లేని దుఃఖపు గూడులా మిగిలింది

ఏ క్షణం ఏ గూడు ఒరుగుతుందో
ఎప్పుడు ఏ గుండె కన్నీటిమయం అవుతుందో
అంతుచిక్కని గడియలు వెక్కిరిస్తున్నా
భారంగా గంటల్ని మోస్తూ ఉత్కంఠనల నడుమ ఊపిరి
అయోమయాన్ని మోస్తోంది

తప్పొప్పుల నడుమ
అక్కడి మనిషికి ఘోర తప్పిదమే జరిగింది
కలల జీవితం పేకమేడలా కూలాయి
తల్లికి, బిడ్డలు దూరమై తండ్రికి, కన్న పేగులు మాయమై
చుట్టూ వెలుగులు ఉన్నా
దుఃఖపు పెను చీకటి ఆవహించింది

మనిషి జీవనయానంలో అత్యాశ అడుగుల్లో
ప్రకృతిని విస్మరించి తప్పుల్ని తన తలపై రుద్దుకొని
తకరారుపై తన తలని నిలిపాడు
ప్రకృతి కోపాగ్నికి తనే బలిపశువై పోయాడు

మనిషికి కనువిప్పు కలగాలి
భూమిపై తనతో పాటు ప్రకృతిని కాపాడు కోవాలి
విపత్కర విధ్వంసాల నుండి
తనను తాను రక్షించుకోవాలి
ఏది ఏమైనా సిరియా భూకంపం
మనిషి చరిత్రలో ఒక విధ్వంస కావ్యంలా
నిలవడం కడు దుఃఖభరితం...!!

- మహబూబ్ బాషా చిల్లెం, 9502000415

పెన్షన్ సరుకు కాదు... ఉద్యోగి సామాజిక భద్రత

ప్రభుత్వ సేవలో నిమగ్నమైన ఉద్యోగికి వయసు మళ్ళిన తర్వాత ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఇచ్చేదే పెన్షన్. బ్రిటిష్ కాలం నుండి 1950 వరకు పెన్షన్ ఇవ్వటం అనేది ప్రభుత్వాలు బాధ్యతగా చేస్తూ ఉన్నాయి. 1951లో పోరాటాల ఫలితంగా పెన్షన్ గ్యారెంటీ స్కీమ్ ప్రవేశపెట్టబడింది. ప్రభుత్వాలు నిర్ధారించిన కొంత మొత్తంలో పెన్షన్ ఇచ్చేవారు. 1982లో సుప్రీంకోర్టు 'పెన్షన్ భిక్ష కాదు... హక్కు. ఇది ఉద్యోగి సామాజిక భద్రత' అని తీర్పు ఇచ్చిన తర్వాత ట్రిబుల్ బెనిఫిట్ స్కీమ్ అమలులోకి వచ్చింది. పిఆర్‌సిలో స్కేళు మారినప్పుడల్లా పెన్షన్‌లో మార్పులు రావడం, ఉద్యోగి చరమాంకంలో అత్యంత గౌరవపదమైన భృతిగా ఉపయోగపడుతుంది. జనవరి 2004 తర్వాత అపాయింట్ అయిన ఉద్యోగికి న్యూ పెన్షన్ స్కీమ్ పేరుతో, షేర్ మార్కెట్ ఆధారిత పెన్షన్, గ్యారెంటీలేని పెన్షన్, మార్కెట్ శక్తుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి తీసుకునే పెన్షన్‌గా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఉద్యోగి సామాజిక భద్రత కోసం ప్రభుత్వమే ఇవ్వాల్సిన పెన్షన్‌ని మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీదికి ఎందుకు వదిలి పెట్టింది? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ బాధ్యత నుండి ఎందుకు తప్పుకుంటున్నాయి? పెన్షన్ అనేది నిజంగానే ప్రభుత్వానికి భారంగా మారిందా? పెన్షన్ ప్రభుత్వం ఇస్తే ఆర్థిక వ్యవస్థ అంధకారం అవుతుందా? పెన్షన్ ఉద్యోగి కొనుక్కోవలసిన (సరుకా) సాధనమా? పెన్షన్ హక్కు కాదా? ఇలాంటి ప్రశ్నలు వస్తున్నాయి.


ఎస్. వెంకటేశ్వర్లు

వస్తువు-సరుకు

తన అవసరాల కోసం ఉత్పత్తి చేసుకునేది వస్తువు. మార్కెట్లో క్రయవిక్రయాల కోసం ఉపయోగించేది సరుకు. సరుకు అనే భావన లాభనష్టాల గురించి మాట్లాడుతుంది తప్ప, బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడదు. 1947 నుంచి 1980 వరకు భారతదేశంలో సంక్షేమ రాజ్యం అమల్లో ఉంది. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకులోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పుకోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరం కొనుక్కోవటం (అంటే సరుకుగా మారిపోవటం) ప్రారంభమైంది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా మారి పోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసింది.

ప్రపంచంలో ఏర్పడిన ఆర్థికమాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో ఉండగా... భారతదేశ ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రయివేటు రంగానికి కేటాయింపులు చేసేందుకు ఒత్తిడి తేసాగింది. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచుతోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చేసింది. కార్పొరేట్లకు ఏ



కొద్దిపాటి నొప్పి తగలకుండా జాగ్రత్త పడుతోంది. ఎలాంటి పోరాటాలు జరగకుండా నిర్బంధాలు ప్రయోగిస్తోంది. గతంలో ప్రజలకి... ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హక్కులన్నిటిని ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. దానిలో భాగంగానే హక్కుగా ఉన్న పెన్షన్‌ను కాంట్రిబ్యూషన్ పెన్షన్‌గా మార్చింది. అంటే దేశంలో ప్రతిదీ సరుకుగా మాత్రమే

> ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వినటం ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప లక్షణం. వినకపోవడం ఎలాంటి ప్రజాస్వామ్యం? ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేసే వైపు ప్రభుత్వాలు నిలబడటం సరికాదు. కార్పొరేట్ల వైపు నిలబడితే ప్రతిదీ భారంగానే మారుతుంది.

అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వం కార్పొరేట్లకు కావాల్సిన నిధులు సేకరించే పని చేస్తుందన్నమాట.

ప్రతిదీ మానెటైజేషన్

భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వ రంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రయివేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు ఇచ్చేయడం ప్రారంభించింది. 400 రైల్వే స్టేషన్లు, 90 ప్యాసింజర్ రైళ్లు, 1400 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్, 15 రైల్వే స్టేడియంలు, 265 రైల్వే గూడ్స్ షెడ్లు మానిటైజేషన్ చేస్తున్నారు. 35 వేల కోట్ల విలువ కలిగిన టెలికం ఆస్తులు, 28,747 కోట్ల విలువ చేసే బొగ్గు గనులు, 761 ఖనిజ బ్లాక్స్, 12,828 కోట్ల షిప్పింగ్ అసెట్ల వేలం, 25 విమానాశ్రయాల మానెటైజేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. దీనివల్ల భవిష్యత్తులో విమానాశ్రయం గేటు దగ్గరికి వెళ్ళినా రైల్వే స్టేషన్‌కి పోయినా బస్ స్టేషన్‌కు పోయినా ఆఖరికి ప్రభుత్వ పార్కుల్లోకి పోయినా యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్నది.

ప్రభుత్వ వైఖరి మారాలి

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని చూడాలి. ప్రజల కష్టాల్ని, భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాలి. పన్నుల భారం నుండి, అధిక ధరల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ప్రజలకి ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వినటం ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప లక్షణం. వినకపోవడం ఎలాంటి ప్రజాస్వామ్యం? ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేసే వైపు ప్రభుత్వాలు నిలబడటం సరికాదు. కార్పొరేట్ల వైపు నిలబడితే ప్రతిదీ భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. దానితో పాటు సామాజిక భద్రతను ఇచ్చే పెన్షన్ కూడా భారంగానే మారుతుంది. కనుక ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచిస్తే... పెన్షన్ సరుకు కాదు. సామాజిక భద్రతను ఇచ్చే ఆసరాగా మారుతుంది. ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించేట్లు మనం పోరాటం చేయాలి. కార్పొరేట్లకు లాభాలను చేకూర్చే సిపిఎస్ లేదా జిపిఎస్‌కి వ్యతిరేకంగా ఉద్యమించాలి. పాత పెన్షన్ కోసం నిలబడాలి.

కరీంనగర్
నవతెలంగాణ
మానవి
బుధవారం 15 ఫిబ్రవరి 2023
www.navatelangana.com





భాష ప్రాణమై.. కళలు ఊపిరై...

తెలుగు భాషా పరిశోధనలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముప్పై మందికి పైగా పరిశోధనా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. సంగీతం, నృత్యం, వాద్య పరికరాల గురించి పరిశోధన చేసి ఆ కళల గురించిన ఎన్నో కొత్త విషయాలను బయటకు తీసుకొచ్చారు. రెండు పీహెచ్‌డీలు చేశారు. డి. లిట్ డిగ్రీ చేసి వాచస్పతి బిరుదును పొందిన ఏకైక వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎనభైకిపైగా పత్రసమర్పణలు, పదికి పైగా జాతీయ సెమినార్లు నిర్వహించిన గొప్ప ఘనత ఆమెది. వారే ఆచార్య కె.కుసుమారెడ్డి(కుసుమాబాయి). తెలుగుయూనివర్సిటీచే మాతృవందనం పురస్కారం పొందిన వారి పరిచయం వారి మాటల్లోనే.

ముఖాముఖి



మీరు చేస్తున్న సాహిత్య సేవకు పునాది వేసిన మీ స్ఫూర్తిదాయకమైన బాల్యం గురించి వివరిస్తారా?

చిన్నతనం నుండి నాకు స్ఫూర్తి మా నాన్నగారు జయరామిరెడ్డి. ఆయన తెలుగు పండితులు. హైస్కూల్ హెడ్ మాస్టర్‌గా రిటైర్ అయ్యారు. మంచి కవి. చదవంటే ఆయనకు చాలా ఇష్టం. నేను చదువుకునే రోజుల్లో అమ్మాయిలు పెద్దగా చదువుకునేవారు కాదు. నన్ను చూసి చాలామంది కాలేజీకి రావడం మొదలుపెట్టారు. హైస్కూల్ చదువు అయిపోయిన తర్వాత కాలేజీలో బీఎస్సీ ఇంగ్లీష్ మీడియంలో చేరాను. బీఎస్సీలో చదివేటపుడు తెలుగు సాహిత్యంపై అభిరుచి ఉండేది. ఎప్పుడూ తెలుగు గురించే ఆలోచించేదాన్ని. దాంతో ఎమ్మే తెలుగు చేస్తానంటే మా నాన్న ఒప్పుకున్నారు. 'జయరామిరెడ్డి గారు మీ అమ్మాయి తెలుగు చదివితే ఉద్యోగాలు రావు కదా' అంటూ కొంత మంది అంటే పుస్తకాలు రాసి మంచి పేరు తెచ్చుకుంటుంది అని సమాధానం చెప్పారు. అయితే తెలుగు తీసుకొని ఏదో సాధిస్తానని ఆయనా అనుకోలేదు, నేనూ అనుకోలేదు. అలా నాన్న ప్రోత్సాహంతో ఎమ్మే ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను.

తర్వాత ఎంఫిల్, పీహెచ్‌డీలు కూడా చేశారు.. వాటి గురించి..?

నాకున్న ఆసక్తితోనే చేశాను. అయితే అసలు ఎంఫిల్ చేయాలని నేను ముందు అనుకోలేదు. బిరుదురాజు రామరాజు గారు నన్ను ప్రోత్సహించారు. పీహెచ్‌డి పూర్తి చేసే సమయంలోనే ఎంఫిల్, పీహెచ్‌డీ వచ్చేలా నేను చూస్తాను అన్నారు. అయితే ఏ అంశంపై ఎంఫిల్ చేయాలో ఆలోచిస్తుంటే నిడదవ్రోలు వెంకటరావుగారు ఓ సలహా ఇచ్చారు. తెలుగు సాహిత్యంలో కనకాభిషేకం చేయించుకున్న వారి గురించి చెప్పుకోవాలంటే మొదటగా శ్రీనాథుడు గురించే చెబుతారు. అయితే తెలుగు సాహిత్య చరిత్రలో స్త్రీలలో మొట్టమొదట కనకాభిషేక సత్కారం పొందిన కవయిత్రి రంగాజమ్మ. ఆమె గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ఆమె గురించి ఎంఫిల్ చేస్తే బాగుంటుందన్నారు. ఆయన సలహా బాగా నచ్చింది. అలా ఎంఫిల్ 'రంగాజమ్మ కృతుల్లోని భాష'పై పరిశోధన చేశాను. ఆమె గురించి ఎన్నో విషయాలు బయటి ప్రపంచానికి చెప్పగలిగాను. అమెకు సంబంధించిన గొప్ప గొప్ప విషయాలు తెలుసుకుంటుంటే చాలా ఆశ్చర్యంగా, స్ఫూర్తిదాయకంగా అనిపించింది.

ఆమె గురించి తెలుసుకోవడానికి తంజావూరు వెళ్ళినట్టున్నారు?

అక్కడికి వెళ్ళకుండా ఆమె గురించి రాయలేము. తంజావూరు గ్రంథాలయానికి వెళ్ళి చాలా విషయాలు సేకరించాను. సమాచారం కోసం అక్కడే కొంత కాలం ఉండి వచ్చాను. అక్కడ మూడు వేలకుపైగా తాళపత్రాలు తెలుగులో ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ముద్రితమయ్యాయి. ఆమె రాసిన యక్షగానం ప్రింట్ కాలేదు. అదంతా నేను చేతిరాతలో రాసుకుని వచ్చాను. అప్పుడే సంగీతం, నృత్యానికి సంబంధించిన ఎన్నో గ్రంథాలు నాదృష్టికి వచ్చాయి. ఆ ఆసక్తితో నాయకరాజులు సంగీత, నృత్యాలకు చేసిన సేవలు గుర్తించి ఒక పుస్తకం రాయాలనుకున్నాను. అప్పుడే రెండవ పీహెచ్‌డీకి 'ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్'లో అప్లయి చేశాను. ఆ డిపార్ట్‌మెంట్ నుండి నాయకరాజులు పోషించిన సంగీత, నృత్య రీతుల గురించి పరిశోధన చేసి రెండవ పీహెచ్‌డీని పొందాను.

మీ మొదటి పీహెచ్‌డీ విశేషాలు మాతో పంచుకుంటారా?

నా మొదటి పీహెచ్‌డీ 'మడికి సింగన కృతుల పరిశీలన'. మడికి సింగన గొప్ప కవి. ఈయన గురించి కూడా సాహిత్య ప్రపంచానికి పెద్దగా తెలియదు. ఆయన్ని పరిచయం చేస్తే బాగుంటుందని రామరాజు గారు సలహా ఇచ్చారు. లోకానికి తెలియని వారిని పరిచయం చేయడమంటే నాకూ చాలా ఆసక్తి. అందుకే అంగీకరించాను. ఆయన తెలంగాణలోని రామగిరిదుర్గం పరిపాలించిన ముప్పభూపతి ఆస్థాన కవి. మొత్తం నాలుగు గ్రంథాలు రాశారు. వాటన్నింటిని అధ్యయనం చేసి పీహెచ్‌డీ పూర్తి చేశాను. ఇది అలా పూర్తయిందో లేదో వెంటనే ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది.

యూజీసీ ప్రాజెక్టులు కొన్ని చేశారు కదా, వాటి గురించి..?

తెలుగులో పద్యరూపంలో రచింపబడిన శాస్త్ర గ్రంథాలన్నింటినీ పరిశోధించి యూజీసీ ప్రాజెక్ట్‌గా 'శాస్త్ర గ్రంథ సమాలోచనం' అనే గ్రంథాన్ని రాసి ప్రచురించాను. నేను ఏది చేసినా సంగీతం, నృత్యం, కళలపై ఉన్న ఆసక్తితోనే చేశాను. మన తెలుగు రాష్ట్రాలలో కూచిపూడి, ఆ తర్వాత ఈ మధ్య కాలంలో కాస్త పేరిణి నృత్యం కనిపిస్తాయి. కానీ పురాతన పుస్తకాల్లో చూస్తే ఎన్నో రకాల నృత్య రీతులు ఉన్నాయి. వాటి గురించి ఎవరికీ తెలియదు. కేళికా నృత్యాలు అనేవి ఇప్పుడు అసలు లేవు. వీటిపైనే యూజీసీ రెండో ప్రాజెక్ట్. 'తెలుగు నృత్య కళా సంస్కృతి' పేరుతో గ్రంథంగా ముద్రించాను. ఈ గ్రంథానికే తెలుగు యూనివర్సిటీవారు ఉత్తమ గ్రంథ పురస్కారం ఇచ్చారు.

పరిశోధనా విద్యార్థులకోసం మీరేమైనా పుస్తకం రాశారా?

ప్రొ.కులశేఖర్‌రావుగారు పిల్లలకు ఉపయోగపడే గ్రంథం ఒకటి రాయమన్నారు. ఏం రాస్తే బాగుంటుంది అంటే పిల్లలకు ఉపయోగపడేలా పరిశోధనా గ్రంథాలు ఎలా రాయాలి, పరిశోధన ఎలా చేయాలి అనే దాని గురించి రాస్తే బాగుంటుంది అన్నారు. అయితే అంత పెద్ద పని చేయడం నా వల్ల కాదు అంటే ఇద్దరం కలిసి రాద్దాం అన్నారు. అదే 'తెలుగు పరిశోధనా పద్ధతులు (రీసర్చ్ మెథడాలజీ) అనే గ్రంథంగా వచ్చింది. ఇప్పటి వరకు మొత్తం 20 పుస్తకాలు రాశాను. అందులో రెండు నవలలు ఉన్నాయి. అందులో ఒకటి పొట్టిశ్రీరాములుగారి గురించి ఒక నవల. రంగాజమ్మ గురించి రెండో నవల.

హిందీపై కూడా మీకు పట్టు వున్నట్టుంది?

విశారద పూర్తి చేశాను కాబట్టి హిందీ మాట్లాడగలను. కానీ హిందీలో ఏమీ రాయలేదు. సంస్కృతంలో మాత్రం డి.లిట్ డిగ్రీకి ఓ గ్రంథం రాశాను. అదే "నాట్య శాస్త్ర దిశా, రసతత్త్వ వరంపరాయాహా: సమీక్షణం". దీనికే వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత యూనివర్సిటీ వారు డి.లిట్ డిగ్రీ, వాచస్పతి అనే బిరుదు ఇచ్చారు. దీన్ని పొందిన మొదటి వ్యక్తి నేనే.

జాతీయ స్థాయిలో తెలంగాణ నుండి ఓ ఫెలోషిప్‌కు ఎంపికైన ఏకైక మహిళగా కూడా మీరున్నారు. ఆ వివరాలు చెప్పండి?

ఇది కూడా గొప్ప విషయంగా చెప్పుకోవచ్చు. 29 రాష్ట్రాలకుగాను 10 అవార్డులు మాత్రమే ఉంటాయి. అలాంటిది మన తెలంగాణ నుండి నాకు ఈ అవార్డు పొందే అవకాశం వచ్చింది. ఇది చరిత్రకు సంబంధించింది. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసర్చ్' అనే సంస్థవారు సీనియర్ అకడమిక్ ఫెలో అనే అవార్డులు ప్రకటించారు. 'తెలంగాణ గిరిజనుల సంస్కృతి, సంగీతం, నృత్యం, సంగీత వాద్యాలు' అనే అంశంపై పరిశోధన చేయడానికి ఫెలోషిప్‌ను అందించారు. ఆ సందర్భంగానే గిరిజన ప్రాంతాలన్నీ తిరిగాను. వాళ్ళ అనుభూతులు, వారి అతిథ్యాలు, వాళ్ళ అమాయకత్వం, వాళ్ళ ప్రేమ చూసినపుడు చాలా గొప్పగా అనిపించింది. ఆదిలాబాద్‌లో కొమరంభీం మ్యూజియంతో పాటు ఆయన మనవరాలిని కూడా చూశాను. అక్కడ ఉన్న అనేక జాతుల వారిని కలిశాను. వాళ్ళ పాటలు, సంస్కృతి, నృత్యాలు, వాద్యాలు అన్నింటి గురించి సేకరించాను. అవన్నీ కలిపి గ్రంథంగా తీసుకొచ్చి ఫెలోషిప్‌కు సమర్పించాను.

భాష, కళలు, శాస్త్ర పరిశోధనలు చేశారు. మూడింట్లో మీకు బాగా నచ్చిన అంశం?

కళలంటేనే బాగా ఇష్టం. ఎందుకంటే సాహిత్యానికి సంబంధించి ఎంత లోతుకు వెళ్ళిన ఇప్పుడు తెలుసుకున్న దాని కంటే ఎక్కువగా తెలుసుకోలేము. అదే కళలైతే లోతుల్లోకి వెళ్ళే కొద్దీ ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. అందుకే కళలంటే అందులోనూ నృత్యం, వాయిద్య పరికరాలంటే చాలా మక్కువ. నా మెదుడు ఎప్పుడూ వీటి గురించే ఆలోచిస్తుంది.

పరిశోధనా విద్యార్థులతో మీరు ఎంతో స్నేహభావంతో ఉంటారని విన్నాము. ఆ వివరాలు చెబుతారా?

అవును నిజమే. పిల్లలతో నేను అలాగే ఉంటాను. ముఖ్యంగా అప్పట్లో పిల్లలకు కల్చర్ టూర్స్ ఉండేవి. పిల్లలు వాటికి వెళ్ళడానికి చాలా ఇష్టపడేవారు. వాళ్ళతో ఒక మగ ప్రొఫెసర్, ఒక ఆడ ప్రొఫెసర్ కచ్చితంగా వెళ్ళాలి. అప్పట్లో మహిళా ప్రొఫెసర్స్ తక్కువ మంది ఉండే వాళ్ళం. ఉన్నవారు కూడా టూర్లకు వెళ్ళడానికి పెద్దగా ఆసక్తి చూపే వారు కాదు. దాంతో పిల్లలు వచ్చి నన్ను రమ్మనమని అడిగేవారు. నాకూ ఎలాగో కొత్త ప్రదేశాలు చూడడం ఇష్టం, అందులోనూ ఆడపిల్లలు ఉంటారు కాబట్టి నేనూ వెళ్ళేదాన్ని. ఆ సమయంలో వారికి కావల్సిన ఏర్పాట్లు అన్నీ నేనే చూసుకునేదాన్ని. వారికి ఒక ప్లాన్ చెప్పి అలా ఫాలో అవ్వమని చెప్పేదాన్ని. అలా నాకు పిల్లలతో బాగా చనువు వుండేది. సుమారు 70 మంది వరకు టూర్లకు వచ్చేవారు. అలా ఒక సారి కన్యాకుమారి వెళ్ళాము. ఆ యాత్రా విశేషాలనే 'కన్యాకుమారి దీపకళిక' అనే గ్రంథంగా ముద్రించాను.

ఇప్పటి వరకు మీరు నిర్వహించిన బాధ్యతలు?

ఉస్మానియా యూనివర్సిటీలో 30 ఏండ్లు పని చేసి ప్రొఫెసర్‌గా, తెలుగు శాఖా అధ్యక్షురాలిగా రిటైర్ అయ్యాను. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో ఆర్‌జీయూకేటీ ఐఐఐటి మూడు సెంటర్లకు తెలుగు ప్రొఫెసర్‌గా, కో - అర్డినేటర్‌గా పని చేశాను. అలాగే ఉమ్మడి రాష్ట్రంలోనే ఇంటర్ బోర్డులో పాఠ్యప్రణాళిక సంఘం సభ్యురాలిగా కూడా ఉన్నాను.

మీరు పొందిన అవార్డుల గురించి..?

వాటి గురించి కచ్చితంగా చెప్పాలంటే గుర్తు లేవు. ఎన్నో కాలేజీల వారు భాషా, మహిళా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎన్నో సన్మానాలు చేశారు. అన్నింటికంటే వాచస్పతి పురస్కారం అత్యంత గొప్పది. అలాగే జాతీయ స్థాయిలో పొందిన సీనియర్ అకడమిక్ ఫెలో, తెలుగు యూనివర్సిటీవారు ఇచ్చిన ఉత్తమ గ్రంథ రచయిత్రిగా ఇచ్చినవి ముఖ్యమైనవి.

మీ భవిష్యత్ ప్రణాళిక..?

త్వరలో గిరిజనుల సంస్కృతికి సంబంధించిన ఒక పుస్తకం ఇంగ్లీష్‌లో, తెలుగులో తీసుకురాబోతున్నాను. ఆ తర్వాత రాయడం ఆపేద్దామనుకుంటున్నాను. ఎందుకంటే డిజిటల్ యూనివర్సిటీ ఒకటి ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నాను. మరుగుపడి ఉన్న తాళపత్ర, ప్రాచీన గ్రంథాలే కాకుండా అన్నీ గ్రంథాలు డిజిటల్ రూపంలోకి తీసుకురావాలని నా కోరిక. ఇలా చేస్తే అవి అందరికీ అందుబాటులో ఉంటాయి. అయితే దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కావాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

- అయినంపూడి శ్రీలక్ష్మి



నేటి నుంచి హౌరాలో వ్యకాస అఖిల భారత మహాసభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత పదో మహాసభ పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో బుధవారం ప్రారంభం కానుంది. ఈనెల 18 వరకూ ఆ మహాసభ కొనసాగనుంది. కామ్రేడ్ జ్యోతిబసునగర్‌లోని కుమార్ సిరార్కర్, సారంగధర్ పాశ్వాన్ వేదికగా అది కొనసాగనుంది. మహాసభ ప్రారంభ సూచికగా బుధవారం ఆ సంఘం అఖిల భారత అధ్యక్షులు ఎ.విజయ రాఘవన్ అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సంబంధిత ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. మహాసభ నేపథ్యంలో గురువారం వివిధ అంశాలపై సెమినార్లు నిర్వహించనున్నారు. ముఖ్య వక్తగా ప్రకాశ్ కరత్ హాజరై 'కార్పొరేటీకరణ, హిందూత్వ ప్రమాదం..వ్యవసాయ కార్మికులపై ప్రభావం' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఈనెల 17న జరిగే భారీ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. 20 రాష్ట్రాలకు చెందిన 732 మంది ప్రతినిధులు, పరిశీలకులు మహాసభకు హాజరుకానున్నారు. తెలంగాణ నుంచి 81 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 45 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. వీరితో పాటు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్నన్‌మొల్లా, విజ్జుకృష్ణన్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ తోపాటు పలు సం ఘాల నాయకు లు హాజరై సౌహార్ద్ర సందేశాలివ్వను న్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే పనికి పూనుకున్న తర్వాత వస్తున్న మార్పులు, గ్రామీణ భారతంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మహాసభలో ప్రధానంగా చర్చించనున్నారు. వ్యవసాయ కూలీలకు ప్రధాన సమస్యలుగా ఉన్న ఉపాధి కల్పన, సామాజిక భద్రతపై కూడా చర్చిస్తారు. వ్యవసాయంలో నిరంతర సంక్షోభాలతో పనిదినాలు తగ్గిన క్రమంలో వ్యవసాయ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి పరిష్కారం కోసం కేంద్రంపై చేయాల్సిన పోరాటాలకు సంబంధించిన కార్యాచరణను మహాసభలో రూపొందించనున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెరిగిన జీవన వ్యయం, సాంఘిక సంక్షేమం పట్ల పాలకుల చిన్నచూపుతో గ్రామీణ పేదల జీవితాలు మరింత అభద్రతలో కూరుకుపోయాయి. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్ నివేదిక ప్రకారం ఒక్క 2021లోనే 5,563 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరంతా పనుల్లేక, కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యలకు పాల్పడిన వారే. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికలో మన దేశం 107వ స్థానానికి పడిపోయిన విషయం విదితమే. ఇలాంటి సమయంలో ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది. వ్యవసాయం, మార్కెటింగ్ వ్యవస్థలను కార్పొరేట్లకు అప్పగించే పనిలో ఉన్న మోడీ సర్కారు కులాలవారీగా హాజరు నమోదు చేయాలనే అహేతుక ఆలోచనతో ముందుకు సాగుతున్నది. దాంతోపాటు ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో రెండుపూటలా హాజరు నమోదు చేయాలనే షరతును విధించింది. పాలకుల విధానాలతో పేదలు భూమి నుంచి వేగంగా దూరమవుతున్నారు. 1992-93లో గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని కుటుంబాలు 35 శాతముంటే ప్రస్తుతం అది 50 శాతానికి దాటింది. దీన్నిబట్టి భూమి కొందరి వద్దే ఏ రకంగా కేంద్రీకృతమవుతున్నదో.. ప్రజలు ఏ విధంగా పేదరికంలోకి కూరుకుపోతున్నారో అర్థమవుతున్నది. మరోవైపు కేంద్రం వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల కష్టాలను వినడం లేదు కానీ ప్రజలను విభజించి మనుస్మృతిని తిరిగి స్థాపించాలనే ఆర్‌ఎస్‌ఎస్ అజెండాతో ముందుకు సాగుతున్నది. దళితులు, గిరిజనులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశాన్ని తిరోగమనం వైపు మళ్లించాలనే బీజేపీ ఎత్తుగడలను ఎక్కడికక్కడ తిప్పికొడుతూ... క్షేత్రస్థాయిలో వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు, పేదలు, వృత్తిదారులందర్నీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వర్గ ఐక్యతను సాధించేందుకు చేయాల్సిన కృషిపైనా వ్యకాస మహాసభలో ప్రధానంగా చర్చించనున్నారు. రోజురోజుకీ పనిదినాలు తగ్గిపోతున్న క్రమంలో వ్యవసాయ కూలీల భద్రత కోసం సమగ్ర చట్టం తీసుకురావాలనే డిమాండ్‌పైనా ఈ సభలో ప్రధానంగా చర్చిస్తారు. మహాసభ నేపథ్యంలో హౌరా నగరం ఆసాంతం ఎరుపు రంగును పులుముకుంది.

విస్తృత ఏర్పాట్లు

బి.వెంకట్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

'అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పురుడుపోసుకున్న బెంగాల్ గడ్డపై పదో మహాసభ జరుగబోతున్నది. బెంగాల్‌లో ఇదే తొలి మహాసభ. దీన్ని జయప్రదం చేసేందుకోసం ఇప్పటికే విస్తృతంగా ఏర్పాట్లు చేశాం. పశ్చిమ బెంగాల్‌లోని అమరవీరులను స్మరించుకుంటూ ఆ రాష్ట్రంలో ప్రారంభమైన నాలుగు జాతాలు బుధవారం ఉదయానికి మహాసభ ప్రాంగణానికి చేరుకోనున్నాయి.

బడి ఎరుగని పల్లెలు..!

(మొదటిపేజీ తరువాయి)

అవేమీ పట్టించుకోవడం లేదు. మరికొన్ని చోట్ల రేషనలైజేషన్ పేరుతో 20మంది కంటే తక్కువగా విద్యార్థులు ఉన్న బడులను మూసేసి ఆ విద్యార్థులను వేరే చోటకు బదిలీ చేశారు. సొంతూరిలో బడిలేక.. మరో చోటకు దూరం వెళ్లలేక ఆ పిల్లలు డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారు.

దృష్టిసారించని ఐటీడీఏ..!

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఐటీడీఏను ఏర్పాటు చేసింది. విద్య, వైద్యం ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఈ శాఖమీదనే ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకించి ఐటీడీఏకు నిధులు అందజేసి అధిక ప్రాధాన్యతనిస్తుంటాయి. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని పాలకులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం అభివృద్ధి జాడలు కనిపించడం లేదనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలో ప్రాథమిక విద్యను అందించే గిరిజన ఆశ్రమ పాఠశాలల పరిస్థితి దయనీయంగానే ఉంది. అనేక పాఠశాలల్లో టీచర్లు లేకపోవడం.. వారు ఉన్న చోట భవనాలు లేకపోవడం వంటి సమస్యలు అనేకమున్నాయి. కొన్ని గ్రామాల్లో ఏండ్లుగా బడులు లేకపోవడం.. అక్కడి పిల్లలు పనులకు వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడి గ్రామస్తులు పలుమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి ఫలితమూ కనిపించడం లేదని ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

పదేండ్ల నుంచి ఇక్కడ బడి లేదు
జైవంత్‌రావు- సిడాం దేవ్‌రావు

మా గ్రామంలో పదేండ్ల కిందట పశువుల పాకలో బడిని ఏర్పాటుచేసి ఉపాధ్యాయుడిని నియమించారు. ఆ సమయంలో చదువుకున్న కొందరు పిల్లలు ఇతర ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు వెళ్లడంతో ఇక్కడి బడిని మూసేశారు. అప్పటి నుంచి మా పిల్లలకు చదువు లేకుండా పోయింది. బడిని ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదు. ఇక్కడ బడిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం
దిలీప్- ఐటీడీఏ డీడీ- ఆదిలాబాద్

ఏజెన్సీ పరిధిలోని కొన్ని గ్రామాల్లో బడులు లేవనే విషయాన్ని గుర్తించాం. ఇలాంటి గ్రామాలు సుమారు పది వరకు ఉంటాయని అంచనా వేశాం. వీటిలో బడుల నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అక్కడ్నుంచి అనుమతి రాగానే నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

సిరికొండ మండలం పాలవాగు గ్రామానికి చెందిన విద్యార్థులు వీరు. ఇక్కడ 20మంది విద్యార్థులు ఉన్నారు. 30ఏండ్ల కిందట ఈ గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ పాఠశాల లేదు. గతంలో ఈ మండలంలో పనిచేసిన సీఐ, ఎస్‌ఐలు చొరవ తీసుకొని తాత్కాలికంగా ఓ గుడిసెలో పాఠశాల ఏర్పాటుచేసి విద్యావాలంటీర్‌ను నియమించి అక్షరాలు నేర్పించారు. కానీ వారు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ పాఠశాల నిర్వహణ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న సిరికొండ యువసేన సభ్యులు సొంతంగా డబ్బులు పోగు చేసి ఏడు నెలల నుంచి ఒక విద్యావాలంటీర్‌ను నియమించడంతోపాటు విద్యార్థులకు పలకలు, పుస్తకాలు అందించి అక్షరాలు నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కదంతొక్కిన స్పెయిన్ ప్రజలు

(మొదటిపేజీ తరువాయి)

పది లక్షల మంది పైగా ప్రజలు పాల్గొన్నారు. వాయువ్య స్పెయిన్‌లోని శాంటియాగో డి కంపెస్టెలాలో నిర్వహించిన ర్యాలీలోనే దాదాపు 20 వేల మంది ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. 'ఆరోగ్య హక్కు.. మానవ హక్కు. ఆరోగ్య సేవలను రక్షించండి' అంటూ ప్లకార్డులు పట్టుకుని జాతీయ పతాకాలతో ఆందోళనకారులు నినాదాలను హోరెత్తించారు. 'స్పెయిన్‌లో ప్రజారోగ్య వ్యవస్థ చాలా బాగుండేది. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య వ్యవస్థ క్షీణించింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత మరీ క్షీణిస్తున్నది' అని ఆందోళనకారులు పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆస్పత్రిలో పనిచేసే నర్సు మైట్ లోపెజ్ మాట్లాడుతూ.. 'పరిస్థితి ఏం బాగోలేదు. మేం రోగులకు సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోతున్నాం' అని వాపోయారు.

ముంబయి టూ హైదరాబాద్‌కు డ్రగ్స్

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాల సభ్యులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 110కిలోల గంజాయితోపాటు 244గ్రాముల ఎండీఏఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన డ్రగ్స్ సప్లయర్ వికాస్ మోహన్ కోడ్మూర్ అలియాస్ విక్కీ, జునైద్ షేక్ షంషుద్దీన్, జతిన్ బాలచంద్ర భలేరావు, జావేద్ షంషైర్ అలీ సిద్దిక్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఇదిలా ఉండగా మరో ముఠాకు చెందిన బిల్కిస్ మహ్మద్ సులేమాన్ షేక్ అలియాస్ గర్ సఫుద్దిన్ రాంపుర వాలా, ముర్తుజా షేక్ అలియాస్ షైబాజ్‌తోపాటు మరో ముఠాకు చెందిన మెహ్రాజ్‌కాజీ ముంబయిలో డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏజెంట్లను, వినియోగదారులను ఏర్పాటు చేసుకుని గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్‌తోపాటు టాస్కఫోర్సు పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. అన్నికోణాల్లో విచారించి మూడు ముఠాలకు చెందిన నిందితులను అరెస్టు చేశారు.

ముంబయి కేంద్రంగా మాదక ద్రవ్యాల సరఫరా దేశవ్యాప్తంగా జరుగుతోందన్నారు. గోవాపై ప్రత్యేక నిఘా వేసి డ్రగ్స్ డాన్లను అరెస్టు చేయడంతో స్మగ్లర్లు రూటు మార్చారని చెప్పారు. గోవా రాష్ట్రం కాకుండా ముంబయి కేంద్రంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. యువతీయువకులకు మాదక ద్రవ్యాలను అలవాటు చేస్తున్నారని తెలిపారు. కొన్ని డ్రగ్స్ 12 నుంచి 16 గంటల వరకు మత్తునిస్తాయి.. ఈ క్రమంలో కొన్ని ముఠాలు యువతులను డ్రగ్స్‌కు, గంజాయికి బానిసలుగా చేసి మత్తులో ఉన్న సమయంలో వారిపై లైంగిక దాడికి పాల్పడుతున్నారని సీపీ తెలిపారు. ముంబయిలో డ్రగ్స్ సప్లయ్ దారుల నుంచి నైజీరియన్లు సైతం డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ముంబయిలో డ్రగ్స్ డాన్లతోపాటు డ్రగ్స్ కొనుగోలుదారులు, సరఫరా దారులేకాకుండా వినియోగ దారులను గుర్తించామని తెలిపారు. త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాల వ్యవహారంలో గోవా పోలీసులు ఎలాంటి సాయమూ చేయలేదన్నారు. ముంబయి పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారని, వారి సహకారంతో డ్రగ్స్ సరఫరాను అడ్డుకుంటామని సీపీ స్పష్టం చేశారు. ఇప్పటికే మాదక ద్రవ్యాల ముఠాపై ముంబయి పోలీసులకు సమాచారమిచ్చామని తెలిపారు. ముంబయి పోలీసుల సాయంతో అక్కడ కూడా దాడులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా అరెస్ట్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఓ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సింథటిక్ డ్రగ్స్, గోల్డ్, ఎలక్ట్రానిక్ గూడ్స్ స్మగ్లింగ్ చేసే ఇద్దరిని నాచారం, మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసినట్టు రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహన్ తెలిపారు. ఎల్‌బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీపీ తెలిపారు. మహమ్మద్ ఖాసీం, రసూల్ డీన్‌తో పాటు మహారాష్ట్రలోని పూణేకు చెందిన షైక్ ఫరీద్ మహమ్మద్, అదే ప్రాంతానికి చెందిన ఫైజాన్ అరుణ్ ముజాహిద్ ముఠాగా ఏర్పడ్డారు. అంతర్జాతీయ కొరియర్ సేవల ద్వారా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు సింథటిక్ డ్రగ్స్‌ను కవర్లలో వేసి, బట్టలతో పాటుగా క్లాత్ బాక్స్ లోపల పొరలలో దాచి జీవీఆర్ ఇంటర్నేషనల్ సర్వీస్ ద్వారా సరఫరా చేసేవారు. గత ఏడాది మహమ్మద్ ఖాసీం, రసూల్ డీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధం గా మిగతా ఇద్దరు మలేషియా నుంచి పూణే, హైదరాబాద్ నగరాల్లో విక్రయాలు చేసేందుకుగాను హైదరాబాద్‌కు రావడంతో విశ్వసనీయ సమాచారం అందుకున్న రాచకొండ నాచారం, మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకు న్నారు. వారి నుంచి 500గ్రాముల సూడో ఫ్రెడీన్ (సింథటిక్) గంజాయి, 80గ్రా ముల బంగారం, రూ. 2500, పాస్ పోర్ట్, 2 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.55 లక్షలు ఉంటుందన్నారు. ఆయన వెంట మల్కాజిగిరి డీసీపీ గిరిధర్, ఎల్‌బి నగర్ ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, ఎస్‌ఓటీ ఏసీపీ నరేష్ రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు హైకోర్టు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

2015 నుంచి పదోన్నతులు, 2018 తర్వాత ఉపాధ్యాయులకు బదిలీల్లేవు. ఇప్పుడు ఆ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులంతా ఎంతో ఆశగా ఉన్నారు. కానీ హైకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ ఆగిపోవడంతో వారందరూ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 13,904 దరఖాస్తులు

హైకోర్టు ఆదేశాల ప్రకారం 317 జీవో ద్వారా వేరే జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో మంగళవారం సాయంత్రం నాటికి 13,904 మంది దరఖాస్తు చేశారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 1,104 మంది, కరీంనగర్‌లో 733 మంది, మహబూబ్‌నగర్‌లో 653 మంది, వికారాబాద్‌లో 616 మంది, హన్మకొండలో 604 మంది, అత్యల్పంగా హైదరాబాద్‌లో ఒకరు, జోగులాంబ గద్వాలతో 147 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. మంగళవారంతో దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసింది. అయితే ఆ టీచర్లకు పూర్వ జిల్లా సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ బదిలీలకు గతంలోనే 59,909 దరఖాస్తులొచ్చాయి. దీంతో మొత్తం 73,813 దరఖాస్తులను సమర్పించారు.

నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

(మొదటిపేజీ తరువాయి)

2,62,153 మంది, ఒకేషనల్ విద్యార్థులు 93,298 మంది కలిపి 3,55,451 మంది విద్యార్థులు హాజరవుతారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఒఎఱవ.ఎస్ర్తస్ర.స్త్రశీఱ.ఱఅ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఇంటర్ బోర్డు గతంలోనే సూచించిన విషయం తెలిసిందే. వాటిపై ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్ల సంతకం అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే ఈ సంవత్సరం కూడా ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయలేదు. విద్యార్థులు చదువుతున్న కాలేజీలో ఈ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. వాటి పర్యవేక్షణ కోసం ప్రభుత్వం డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించింది. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే 040-24600110 నెంబర్‌ను సంప్రదించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు జరుగుతాయని వివరించారు.

త్రిపురలో ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ : మంగళవారం నాటితో త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం నాటి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైందని ఎన్నికల ముఖ్య అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీకి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ వామపక్షాలు, కాంగ్రెస్‌కు, బీజేపీ కూటమికి మధ్య నెలకొంది. "అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4గంటలతో ముగిసింది. ఎన్నికల ప్రచారం అంతా ప్రశాంతంగా సాగింది. పోలింగ్‌ను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ యంత్రాంగమంతా సన్నద్ధమైంది" అని సీఈవో కిరణ్‌కుమార్ మీడియాకు తెలిపారు. పోలింగ్ నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా 3328 పోలింగ్ బూత్‌లను ఈసీ ఏర్పాటుచేసింది. ఇందులో 1100 సున్నితమైన ప్రాంతాల్లో, 28 ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్నట్టు ఆయన తెలిపారు. బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి భద్రత, పోలీస్ పహారా పెంచినట్టు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి ఒకరు ప్రకటించారు. గత నెలరోజులుగా సాగిన ఎన్నికల ప్రచారంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీజేపీ తరఫున ప్రధాని మోడీ, అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా..మరో డజనుమందికిపైగా కేంద్ర మంత్రులు త్రిపురలో పర్యటించారు. వామపక్షాలు, కాంగ్రెస్ తరఫున సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీనియర్ నాయకులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, మహమ్మద్ సలీం, మాజీ సీఎం మాణిక్ సర్కార్, రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి మొదలైన వారు ఎన్నికల ప్రచారంలో ప్రధాన భూమిక వహించారు. కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ..ఎవ్వరూ ప్రచారంలో పాల్గొనకపోవటం చర్చనీయాంశమైంది. బీజేపీ-55 స్థానాల్లో, ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో అభ్యర్థుల్ని నిలిపింది. వామపక్షాలు-47, కాంగ్రెస్-13 స్థానాల్లో పోటీ చేస్తోంది. దాదాపు 28.13 లక్షల మంది ఓటర్లు రేపు జరిగే పోలింగ్‌లో అభ్యర్థుల భవిష్యత్తును తేల్చనున్నారు.

రాష్ట్రంలో రెండో సుందర నగరంగా కరీంనగర్

మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్:

రాష్ట్రంలో రెండో సుందర నగరంగా కరీంనగర్ రూపుదిద్దుకుంటుందని, సీఎం కేసీఆర్ ఆశయాలు, ఆకాంక్షల మేరకు కరీంనగరాన్ని సుందరంగా, స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలో అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల తీరుపై ఆరా తీశారు. ప్రధానంగా నగరంలోని రోడ్లు, ట్రాఫిక్, ఐలాండ్‌లపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ చౌక్, వన్ టౌన్‌ల వద్ద ఐలాండ్‌ల కోసం తవ్వి అలాగే వదిలేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్, తెలంగాణ చౌక్, బొమ్మకల్ జంక్షన్లతో పాటు 13 కూడళ్ల పనులను ప్రారంభించి, మార్చి 31లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 16న స్మిత సబర్వాల్ కరీంనగర్‌లో పర్యటించి మానేరు రివర్ ఫ్రంట్, కేసీఆర్ రెస్ట్ హౌస్, కేబుల్ బ్రిడ్జ్, రోడ్లతో పాటు నగరంలో జరిగిన అభివృద్ధిని పరిశీలించనున్నారన్నారు. కరీంనగర్ అభివృద్ధికి ఎవరు కృషి చేసినా ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామన్నారు. నగరంలో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే కరీంనగర్ నియోజక వర్గానికి ప్రత్యేక ఫండ్ కింద 20 కోట్లు ఇచ్చారని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇప్పటికే నగరంలో 80 శాతానికి పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి-హరి శంకర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు, గ్రంధాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

వాటర్ లిఫ్టింగ్ పైపులో పడి వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్), శ్రీనివాస్ మృతదేహం

నవతెలంగాణ-తిమ్మాపూర్:

తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి మోయతుమ్మె మీద వాగు నుంచి పర్లపల్లి లిక్కర్ ఫ్యాక్టరీకి పోయే పైపులైన్ వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వాటర్ లిఫ్టింగ్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతి చెందిన వ్యక్తి పర్లపెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ (40) అని, పర్లపెల్లి లిక్కర్ ఫ్యాక్టరీలో మెకానికల్ డిపార్ట్మెంట్లో పని చేస్తాడని స్థానికులు, పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్టు ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్ రెడ్డి చెప్పారు.

శ్రీనివాస్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

: సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

ప్రజల తిరుగుబాటుతో హరిత బయో కంపెనీ రక్షణ చర్యలు చేపట్టినట్టు కాగితాలకు పరిమితమైందని, కానీ ఆచరణలో చూపించడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ అన్నారు. మంగళవారం మానేరు వాగులో గల హరిత బయో కంపెనీ బావిలో పడి అందులో పనిచేసే కార్మికుడు కాట శ్రీనివాస్ మృతి చెందడమే దీనికి నిదర్శనమన్నారు. కార్మికుల జీవితాలతో చెలగాట మాడకుండా కంపెనీ వెంటనే రక్షణ చర్యలు చేపట్టి, కాట శ్రీనివాస్ కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని, అతని మృతిపై సమగ్ర దర్యాప్తు నిష్పక్షపాతంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. అందులో పని చేస్తున్న కార్మికులందరికీ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సమగ్రమైన ఆరోగ్య వసతి సౌకర్యాలు, ఆ కంపెనీ ఆవరణంలోనే ఒక డిస్పెన్సర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


ఎడ్ల రమేష్

బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్


బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మేకల ప్రభాకర్

నవతెలంగాణ-శంకరపట్నం:

మండల కేంద్రంలోని మొలంగూర్ గ్రామంలో మంగళవారం శక్తి కేంద్ర ఇంచార్జీ అంతం రాజిరెడ్డి ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్ యాదవ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, శంకరపట్నం మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, ఎంపీటీసీ 2, సీనియర్ నాయకులు పలకల రాజిరెడ్డి, దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, మండల ప్రధాన కార్యదర్శులు దాసరపు నరేందర్, ఎలుకపెల్లి సంపత్, మండల ఉపాధ్యక్షులు పెసర అర్జున్, జానపట్ల రాజిరెడ్డి, కార్యదర్శి దాసరి సంపత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గౌరవేణి శ్రీనివాస్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు బిజిలి సారయ్య, మండల్ సోషల్ మీడియా కన్వీనర్ చుక్కల శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు పొద్దుటూరి భాస్కర్, శక్తి కేంద్ర ఇంచార్జులు, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఐటీకి చూపాల్సిన అవసరం లేదు

నవతెలంగాణ-కరీంనగర్:

ట్రెజరీలో బిల్లు పాసైనప్పటికీ ఉద్యోగుల అకౌంట్‌లో జమ కానప్పుడు ఇన్‌కంటాక్స్ కోసం ఆదాయంగా చూపాల్సిన అవసరం లేదని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ స్పష్టం చేశారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు డీటీఏతో చర్చించిన సందర్భంలో వ్యక్తిగత ఖాతాలో జమైన మొత్తానికి మాత్రమే టాక్స్ లెక్కించాలని స్పష్టం చేశారు. ఆ మేరకు ట్రెజరీ అధికారులకు సూచనలు ఇస్తామని కరీంనగర్ జిల్లా కమిటీ టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, కేఎఫ్ జావీద్ తెలిపారు.

ముందస్తు 'మహా శివరాత్రి' వేడుకలు



మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్:

నగరంలోని స్థానిక వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్స్ కైలాసాన్ని తలపించేలా పండుగ వాతావరణం ఉట్టిపడేలా వేడుకగా అల్ఫోర్స్ ముందస్తు మహా శివరాత్రి వేడుకలు ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా వేద మంత్రాల మధ్య జ్యోతి ప్రజ్వలన చేసి పార్వతి పరమేశ్వరుల విగ్రహాలకు పూజా కార్యక్రమం నిర్వహించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహాదేవుని నామస్మరణ చాలా శక్తివంతమైందని, శివారాధన చేయడం వల్ల స్వర్గ ప్రాప్తి కలుగుతుందని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన శివ పార్వతుల పరిణయం, జ్యోతి లింగాల దర్శనం, శివరాత్రి పర్వదినాన ఉపవాసం సమాచారం దైవ దర్శనాన్ని మరిపించింది. ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో న్యాయ విద్య కోర్సులు ప్రవేశపెట్టాలి

బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ నర్సింగ్


తిప్పారపు సురేష్ కు వినతిపత్రం అందజేస్తున్న జనగామ నర్సింగ్

నవతెలంగాణ-కరీంనగర్:

శాతవాహన యూనివర్సిటీలో న్యాయ విద్య కోర్సులు ప్రవేశపెట్టాలని, యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ నర్సింగ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ కోరారు. శాతవాహన యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సులు ప్రవేశపెట్టాలని, యూనివర్సిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం కోర్సులను ప్రవేశపెట్టాలని వినతిపత్రంలో కోరారు. యూనివర్సిటీ విద్యార్థులకు హానికరమైన జంతువుల నుంచి, విష సర్పాల నుంచి రక్షణ కల్పించాలని, హాస్టల్లో సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని కోరారు. వారి వెంట భూమేష్, మనోహర్ పటేల్ బృందం తదితరులున్నారు.

కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి

కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ-కరీంనగర్:

కేబుల్ బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేబుల్ బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తీగల వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను రాత్రింబవళ్లు చేపట్టి త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బీ డీఈ రవీందర్, ఏఈ రాజాశేఖర్, అశోక్ కాంట్రాక్టర్ కామాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో భాధలు వెళ్లబోసుకున్న సుభాష్ నగర్ ప్రజలు

నవతెలంగాణ-కరీంనగర్:


కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో బాధలు చెబుతున్న ప్రజలు

కాంగ్రెస్ డబ్బా ఇల్లిచ్చింది మేము డబుల్ బెడ్రూం ఇల్లిస్తాం అని కేసీఆర్ చెప్పి తొమ్మిది సంవత్సరాలైనా ఒక్కరికీ డబల్ బెడ్రూం ఇల్లు కట్టియ్యలేదని హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో మహిళ లు ఆవేదన వ్యక్తం చేశారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గడప గడపకు వెళ్తూ రాహుల్ గాంధీ సందేశం కరపత్రం పంపిణీ చేస్తూ స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరాగాంధీ ఆవాస్ యోజన పథకం కింద ఇల్లు కట్టిచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. డబల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని వాగ్దానం చేసి నగరంలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్రూం కట్టియ్యక మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అని ఎద్దేవా చేశారు. అర్హులైన వృద్ధులు చాలా మంది ఆసరా పెన్షన్లు మంజూరు గాక కార్పొరేటర్ల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ సుభాష్ నగర్ ఇన్‌చార్జి దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, లింగంపల్లి బాబు శ్రవణ్ నాయక్, పోచయ్య, అరుణ్ కుమార్, షబానా, కవిత, నదీమ్, శారద, ముక్క భాస్కర్ నాగుల సతీష్, అజ్మత్, జిల్కర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి

ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్:

హైదరాబాద్‌లోని కార్పొరేట్ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్యకు కారుకులైన శ్రీచైతన్య యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ.. మార్కులు, ర్యాంకుల కోసం శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ ఫలితాలే లక్ష్యంగా మానసిక వేదనకు గురిచేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి శ్రీచైతన్య యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థికి న్యాయం చేసేంత వరకు ఏఐఎస్బీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రమేష్ యాదవ్, హరీష్, వినయ్, విజయ్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి

ప్రజలను దగా చేస్తున్న సీఎం కేసీఆర్

సినీ నటి జీవిత విమర్శ

నవతెలంగాణ-గంగాధర:


సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటి జీవిత

సీఎం కేసీఆర్ మభ్యపెట్టే వాగ్దానాలు చేస్తూ ప్రజలను దగా చేస్తున్నాడని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి జీవిత విమర్శించారు. గంగాధర (మధురానగర్) చౌరస్తాలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్ట్రీ కార్నర్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ ప్రజల కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోడి పని చేస్తుంటే, సీఎం కేసీఆర్ కుటుంబ సంక్షేమం కోసం పని చేస్తున్నాడని ఆరోపించారు. ప్రజలకు కల్లబొల్లి మాటలు చెపుతూ 8 ఏండ్లుగా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, నిజం గ్రహిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చిన కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకే దిక్కులేదు.. ఇక దేశ ప్రజలకు ఏదో చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకే స్ట్రీట్ కార్నర్ సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలను చైతన్య పరిచే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. రాష్ట్రంలో సాగుతున్న కుటుంబ పాలనను అంతం చేసే సమయం ఆసన్నమవుతుందని, ప్రజల సమయం కోసం ఎదిరి చూస్తున్నారని అన్నారు.

బీజేపీ అనుసరిస్తున్న విధానాలు గిట్టని సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి నరేంద్రమోడి, కేంద్రంపై విషం చిమ్మే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ గ్రామాన నిర్మించిన వైకుంఠ ధామాలు, రైతు వేదికలు, సీసీ రోడ్లతో పాటు అనేక అభివృద్ధి పనులు కేంద్రం విడుదల చేసిన నిధులతోనే జరిగితే, మేమే నిధులిచ్చామని రాష్ట్ర ప్రభుత్వ పాలకులు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. ప్రతీ స్త్రీ ఒక శక్తి కావాలని, టీఆర్ఎస్ దోపిడీపై తిరుగుబాటు చేయాలని జీవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై ప్రజలు పోరాట స్పూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి, నియోజకవర్గ ప్రభారి రాజేశ్, చొప్పదండి నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవన్‌కుమార్, బీజేపీ జిల్లా కోశాధికారి వైద రామానుజం, మండలశాఖ అధ్యక్షుడు కోల అశోక్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తూం నారాయణ, బీజేపీ జిల్లా నాయకులు దూలం కళ్యాణ్, రేండ్ల శ్రీనివాస్, ప్రశాంత్‌తోపాటు పలువురు జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి

ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

నవతెలంగాణ-కరీంనగర్:


మాట్లాడుతున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

నగరంలో క్షేత్రస్థాయి లో ఎంఐఎం పార్టీని విస్తరించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 25 డివిజన్లలో గెలుపే లక్ష్యంగా ప్రజలకు ఎంఐఎం పార్టీని చేరువ చేసి, విస్తృత స్థాయిలో బలోపేతం చేసేందుకు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ సూచనలకు, ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్క ఎంఐఎం కార్యకర్త కంకణ బద్దులై కృషి చేయాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు పిలుపునిచ్చారు. 45వ డివిజన్ గోష్ కట్ట ఇస్లాంపుర అశోక్ నగర్‌లో ఎంఐఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ సందర్శన, హాలాతే హాజిరా కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, యువనేత కేటీ రామారావుల సారథ్యంలో బంగారు తెలంగాణ నిర్మాణం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు సయ్యద్ బర్కత్ అలీ, హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, సయ్యద్ ఖమరుద్దీన్, సయ్యద్ ఇబ్రహీం, మహమ్మద్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాలకు పాలిచ్చే గేదెల లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-రామడుగు: షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు పాలిచ్చే గేదెల లబ్దిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారా చేస్తున్నట్లు రామడుగు ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, చైర్మన్ డీఎస్సీఎస్సీడీఎస్ కరీంనగర్ వారు రామడుగు మండలానికి 140యూనిట్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 21న గుండి, గోపాలరావుపేట, తిర్మలాపూర్, 22న లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, 23న రామడుగు, శ్రీరాములపల్లి, దత్తోజిపేట, 24న వన్నారం, కొక్కరకుంట, మోతె, 25న షానగర్, గోలిరామయ్యపల్లి, పందికుంటపల్లి, కిష్టాపూర్, కొరటపల్లి, దేశరాజుపల్లి, వెలిచాల, వెదిర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్లలో రైటర్ల పాత్ర కీలకమైంది

కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్. సుబ్బరాయుడు

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం:

పోలీస్ స్టేషన్లకు చెందిన రికార్డుల నిర్వహణ, వివధ రకాల కేసుల వివరాల నమోదులో రైటర్ల పాత్ర కీలకమైందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. పోలీస్ స్టేషన్లకు చెందిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మంగళవారం కమిషనరేట్ కేంద్రంలో వివిధ పోలీస్ స్టేషన్లు, సర్కిల్, ఏసీపీ కార్యాలయాలకు చెందిన రైటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ .. కేసుల వివరాల నమోదులో ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా పోలీస్ స్టేషన్ల రైటర్లు వివరాలు నమోదు చేయాలన్నారు.ప్రజలకు సేవ చేసేందుకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొండగట్టు బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి

యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్

నవతెలంగాణ-రామడుగు:

కొండగట్టు బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 20 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు, ఇంటికొక్క ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సు ప్రమాద బాధితులకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చొరవ తీసుకుని ముఖ్యమంత్రిని వారిని పరమర్శించేలా చేసి వారికి ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ రాసిన బహిరంగ లేఖలో లేవనెత్తిన అంశాలపై స్పందించి వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, రేణికుంట బాపిరాజు, పిండి శ్రీనివాస్ రెడ్డి, కొత్త అజయ్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అసిఫ్, రవీందర్, నేరేళ్ల మల్లేశం, మహేష్, గాదె మహేష్, బిసవేని రవీందర్, సుధాకర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు



నవతెలంగాణ-కరీంనగర్: నగరంలోని స్థానిక కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అత్యధిక బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని, అందులో ప్రతిభ కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో సూడా చైర్మన్ కరాటే కప్ పేరుతో నిర్వహించిన అంతరాష్ట్ర కరాటే పోటీలలో పాఠశాలకు చెందిన హర్షిని 7వ తరగతి, మనుకృతి 8వ తరగతి, లక్ష్మి 9వ తరగతి, పి.శ్రీనిధి 9వ తరగతి, ఆర్.వేధిక 9వ తరగతి బంగారు పతకాలు సాధించారని, రజత కాంస్య పతకం కైవసం చేసుకుందని హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు పుష్పగుచ్చాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళులు




నివాళులర్పిస్తున్న అక్షర స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-రామడుగు:

మండలంలోని గుండి గోపాల్రావుపేటలోని అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో పుల్వామా అమరవీరులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి త్యాగాల గూర్చి, దేశ సేవ గురించి విద్యార్థులకు వివరించారు. ఉగ్రవాదం నశించాంటూ నినాదాలు చేస్తూ గోపాల్రావుపేట్ బస్టాండ్ వరకు ర్యాలీ తీసి, మానవహారం నిర్వహించారు. బస్టాండ్‌లో నిత్య జనగణమన టీం ఆధ్వర్యంలో ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అక్షర స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునిందర్, నిత్య జనగమన కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజయం సాధించిన పారమిత విద్యార్థి

నవతెలంగాణ-కరీంనగర్:


ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థి శుభశ్రీ

కరీంనగర్ పట్టణం లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని శుభశ్రీ సాహు సీబీఎస్ఈ నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్ 2022-23 విజేతగా నిలిచారు. దేశంలో పాల్గొన్న అన్ని సీబీఎస్ఈ పాఠశాలల్లో 'పర్యావరణ' అంశంలో ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. రైతుల ప్రయోజనం కోసం 'మల్టీ ఫంక్షనల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషిన్' అనే వినూత్నమైన వర్కింగ్ మోడల్‌ను రూపొందించినందుకు ఆమెకు ఈ అవార్డు లభించింది. సీబీఎస్ఈ డైరెక్టర్ అభిజిత్ సాహా, కార్యదర్శి అనురాగ్ త్రిపాఠి శుభశ్రీకి అవార్డుతో పాటు మెరిట్ సర్టిఫికేట్, ప్రశంసలతో కూడిన వ్యక్తిగత వివరణ, రూ.5వేల నగదు బహుమతి అందించారు. ఇనిషియేటివ్ ఫర్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ నిర్వహించే ప్రీ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడానికి నేరుగా ప్రవేశం పొందింది. జనవరి 2024లో జరిగే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కి అర్హత సాధించింది. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మెన్ ప్రసాద్ రావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, వీయూఎం ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపల్ సంజయ్ భట్టాచార్య ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు శుభశ్రీ, లలిత్ మోహన్ సాహు లను అభినందించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



నవతెలంగాణ-కోరుట్ల :మండలంలోని అయిలాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆల యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఎమ్మెల్సీని సన్మానించారు. బెల్ట్ షాపులతో గీత కార్మికుల వృత్తికి విఘాతం కలుగుతుందని, వృత్తిని కాపాడేందుకు ప్రభుత్వం 5 నుంచి 10 ఎకరాలు కేటాయించి చెట్లు పెంచాలన్నారు. ఈత, తాటి చెట్లు పెంచుకునేందుకు ప్రోత్సాహం అందిస్తూ గీత కార్మికులకు ప్రభుత్వ భరోసా కల్పించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజాం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు శశిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మెటపెల్లి అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెనిద్రతో ప్రజలకు మరింత చేరువ

- పల్లెనిద్రతో పండగ వాతావరణం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-రాయికల్

ప్రజల మధ్య ఉండి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు మీరు -నేను కార్యక్రమం ద్వారా మైతాపూర్ గ్రామంలో పల్లెనిద్ర చేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే మంగళవారం ఉదయం 6గంటలకే గ్రామంలోని వార్డులను కాలినడకన సందర్శించి ప్రభుత్వ పథకాలు,వైద్య సేవలు, విద్య, వ్యవసాయం,పరిశుభ్రత,త్రాగునీరు,విద్యుత్తు వంటి పలు పథకాలు సేవలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ.. రాయికల్ మండలంలో రూ.50 కోట్లతో చెక్ డ్యాంల నిర్మాణంతో అన్ని గ్రామాల్లో జలకళ సంతరించుకుందన్నారు. రాష్ట్రంలో కులవృత్తుల అధిక ప్రాధాన్యం ఇస్తూ గొర్ల, చేప పిల్లల పంపిణీ, నేతన్నలు, ఎస్సీలకు దళిత బంధుతో భరోసా కల్పి స్తుందన్నారు. మైతాపూర్ గ్రామంలో 438 మంది బీడీ కార్మికులకు,41 మందికి మహిళలకు ఒంటరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

మహిళ పెన్షన్,129 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం, 590 మంది రైతులకు రైతుబంధు పథకాలు అందుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలో అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న తనను కులం పేరుతో దూషించడం బాధ కలిగించిందని వాపోయారు. అనంతరం రాయికల్ మండలంలోని చెర్ల కొండాపూర్, కొత్త పెట్, ముటపల్లి, వడ్డెర కాలనీ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడియ సంధ్యారాణి సురేందర్, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, సర్పంచ్ అజారుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్,సర్పంచులు బత్తిని రాజేశం, మన్నెగుండ్ల వెంకమ్మ నరసయ్య,బెక్కం తిరుపతి,జక్కుల చంద్రశేఖర్, అనుపురం శ్రీనివాస్, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, నాయకులు మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే రాజారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాజ రాజేశ్వర నాగాలయ కమిటీ కార్యవర్గం ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలంలోని కొత్త పెట్ గ్రామంలోని శ్రీ రాజ రాజేశ్వర నాగాలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎంపీపీ లావుడియా సంధ్యారాణి సురేందర్ దంపతు లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జాదవ్ అశ్విని, సర్పంచ్ బత్తిని రాజేశం, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఆలయ కమిటీ, నాయకులు పాల్గొన్నారు.

ఇథైనల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ర్యాలీ



మాట్లాడుతున్న కంతి మోహన్ రెడ్డి

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామంలో ప్రారంభించనున్న ఇండస్ట్రియల్ పార్క్, ఇథైనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలోని బస్ డిపో నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మెట్లచిట్టాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 498,506 లలోని పట్టాలు పొందిన రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్, ఇథైనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు పేరిట పేదల భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. నిరసనగా జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీ కార్యక్రమాన్నీ రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు పులి సంజీవ్, చింతకుంట దేవేందర్, రాధారపు హరికృష్ణ, గడిపల్లి రాజేశ్వర్, అడపా ముత్యంరెడ్డి, బైరి పెద్ద సాయన్న, కంతి రమేష్, పసునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగుపై ఇంటింటి ప్రచారం చేయాలి



పరీక్షిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని ముత్యంపేట గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొల్లం కృష్ణవేణి మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిని వాహిని మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది, గ్రామస్థాయి అధికారులందరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌరు నాగేష్,ఉపసర్పంచ్ అల్లూరి మహేష్ రెడ్డి,మండల వైద్యాధికారిని వాహిని, కంటి వైద్యులు మారుతి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మొబిన్, శటగోప శ్రీనివాస్,ఏఎన్ఎంలు రమ,అంగన్వాడి టీచర్లు ఆమేటి శ్రీలత, దాసరి లక్ష్మి, సుద్దాల కృష్ణవేణి,ఆశాకార్యకర్తలు సుజాత,వనిత, లయ,శాంత, ప్యాట రాజు,భాగ్య,సామల్ల లక్ష్మీ జ్ఞానేశ్వర్ తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లిలో ఆరోగ్యంపై అవగాహన

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని వేంపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం హెల్త్ మేళాను పురస్కరించుకుని వైద్య సిబ్బంది, ఏఎన్ఎం అధ్వర్యంలో హెల్త్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. వచ్చిన పెషెంట్లకు యోగా చేసే విధానంపై ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. 30 ఏండ్లు నిండిన వారందరికీ బిపి, షుగర్, రక్త పరీక్షలు నిర్వ హించారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిట్ల సరోజన ఎంపీటీసీ భూమి రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఎఎన్ఎం కోమల, శైలజ, అంగన్వాడీ టిచర్స్, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-మల్యాల

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పరిసరాలను పరిశీలించారు. కొండగట్టు అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించిన సందర్భంగా అభివృద్ధిపై సమీక్షించేందుకు వస్తున్నట్టు తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు దాతలు చేయూత అందించాలి

జగిత్యాల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత శ్రీధర్

నవతెలంగాణ-జగిత్యాల

క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని అందించడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుష్పాల శ్రీధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని మోతెవాడ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో హోప్ ఫ్రెండ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పలువురు క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కిట్లలో పప్పులు, నూనె, బియ్యం, కోడిగుడ్లు, ప్రోటీన్ పౌడర్ తదితల పదార్థాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జైపాల్‌రెడ్డి, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్లు శ్రీనివాస్, మహేష్, సిబ్బంది సృజన్, మహేశ్, దివ్య పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరిహారం అందజేయాలి

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

నవతెలంగాణ-రాయికల్



పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్ మండలం ధావన్‌పెల్లి గ్రామంలోని మలోవత్ ప్రసాద్‌కు చెందిన ఎడ్ల కొట్టం ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధం కాగా అగ్ని ప్రమాదంలో ఒక గేదె మృతి మృత్యువాత పడింది. మరో ఎద్దు పాక్షికంగా గాయపడి ఆర్థికంగా నష్ట పోయిన బాధిత రైతును ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ధావన్ పెల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు దగ్ధమైన పశువుల కొట్టాన్ని పరిశీలించారు. ప్రమాద సంఘ టనపై ఆరా తీశారు. వీరి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, నాయకులు చెక్క బండి సుధాకర్ ,మల్లయ్య,బాణావత్ సురేష్, తిరుపతి రైతులు,స్థానిక నాయకులు ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి ఈశ్వర్

నవతెలంగాణ- పెగడపల్లి:

పెగడపెల్లి మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం పుర స్కరించుకొని ఈనెల 16నుంచి మూడు రోజులు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక ను ఆలయ కమిటీ సభ్యులు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, కార్యదర్శి పోచమల్లు, సర్పంచ్ మెరుగు శ్రీనివాస్, ఎంపీటీసీ బొమ్మెన జమున స్వామి, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు, ఉప సర్పంచ్ సాగర్‌రావు, ప్రవీణ్‌రావు, వెంకటేశం పాల్గొన్నారు.

జిల్లాలో ముగ్గురు సీఐల బదిలీ

నవతెలంగాణ జగిత్యాలటౌన్

మల్టీ జోన్ పరిధిలో పని చేస్తున్న 17 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణకుమార్ ఐజీ ఆఫీస్‌కు బదిలీ కాగా, ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కారేపల్లిలో పని చేస్తున్న సీఐ ఆరిఫ్ అలీఖాన్ జగిత్యాల రూరల్‌కు బదిలీ అయ్యారు. కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు జగిత్యాల డిఎస్బికి బదిలీ కాగా ఆయన స్థానంలో బైంసాటౌన్ సీఐగా పని చేస్తున్న ప్రవీణ్‌ను కోరుట్లలో నియమించారు. అలాగే జగిత్యాల ఎస్బిలో ఉన్న శ్రీనివాస్‌ను ఐజీ ఆఫీస్‌కు బదిలీ చేశారు.

రైతు సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు



నవతెలంగాణ- కథలాపూర్

మండల కేంద్రంలో రైతు సంఘ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి మండలంలోని రైతుల సంక్షేమం కొనసాగించాలని ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబును మండల రైతు సంఘం అధ్యక్షులు గడ్డం భూమరెడ్డి కోరారు. భీంగల్ - భూషణ్‌రావుపేట రహదారికి మరమ్మతులు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి

నవతెలంగాణ-మెట్‌పల్లిరూరల్



నివాళలర్పిస్తున్న నాయకులు

మెట్‌పల్లి మండలంలోని వెల్లుల గ్రామంలో సంస్కృతి యూత్ ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్‌లకు నివాళి అర్పిం చారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్ రాజు, ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రాజు, స్వామి, రాజు, వెంకటేష్ ,రాజేష్, కిషోర్, వేణు,రాజు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో బీజేపీ నాయకులు జవాన్లకు నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో సునీత పార్లమెంట్ కో -కన్వీనర్ గుంటుక సదశివ్, మోలుమురి రాజమురళి, కౌన్సిలర్లు పెండం గణేష్, మాడవేణి నరేష్, దాసరి శేఖర్, రుద్ర విగ్నేష్, నరేష్, ప్రవీణ్, సంతోష్, వంశీ, కళదార్, వసాల నవీన్, చింటూ, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

షుగర్ ఫ్యాక్టరీ ఇంకెప్పుడు తెరుస్తారు.?

టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-కోరుట్ల



టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ముత్యంపేట చక్కర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని చెప్పి రైతులను మోసం చేశారని, టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు కొండగట్టు పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్ చక్కర ఫ్యాక్టరీపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పోరాట ఫలితంగానే కొండగట్టుకు రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ధర్మపురి వేములవాడ దేవస్థానాలకు రూ.500 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తామని ఆనాడు వాగ్దానం చేశారని కానీ నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రంలో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో చేసిన అభివృద్ధి పనులే తప్ప కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ- మల్లాపూర్

నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోస్‌రా శ్రీనివాస్ అన్నారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పటు ఆయా గ్రామాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ శాఖ అధ్యక్షుడిగా యువజన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులుగా ఎన్నికైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగుంట ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రిపెల్లి మల్లయ్యయ, కోటగిరి ఆనంద్, జమాల్, సుంకెటి నారాయణరెడ్డి, శు ద్ధపల్లి మల్లయ్య, అమత రాజ్ను, మిట్టపల్లి జలపతిరెడ్డి, మల్లాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతు శేఖర్‌అ,బ్బూరి నాగరాజుగౌడ్, రాజు. మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

డీఈవో జనార్ధన్ రావు

నవతెలంగాణ-మానకొండూర్:

పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించడం తేలికని కరీంనగర్ జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ సమీకృత బాలుర వసతి గృహంలో జిల్లాలోని బీసీ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతుల్లో భాగంగా ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో తొలిమెట్టుగా గుర్తించుకుని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాసి పదికి పది జీపీఏ సాధించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజ మనోహర్ రావు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రాజ్ మహమ్మద్, అంజయ్య, ఇంతియాజ్ అలీ మోటివేటర్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నవతెలంగాణ-కరీంనగర్ క్రైమ్

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక కోసం ప్రిలిమినరీ పరీక్షలో రాష్ట్ర హైకోర్టు తీర్పుతో 7మార్కులు కలుపడం ద్వారా అర్హత సాధించిన అదనపు అభ్యర్థులకు నేటి నుంచి శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభకానున్నాయి. ఈ పరీక్షలు కరీంనగర్ బైపాస్ రోడ్డులోని సిటీ పోలీసు శిక్షణకేంద్రం (సిటిసి)లో జరుగనున్నాయి. ఈ పరీక్షలకు 6862 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందులో 4862 పురుష అభ్యర్థులు, 1958 మంది మహిళ అభ్యర్థులు ఇతర కేటగిరిలకు చెందిన 42 మంది అభ్యర్థులు ఉన్నారు. నేటి నుండి (బుధవారం) ఈనెల 21వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఆర్ఎఫ్ఐడి రిస్ట్ బ్యాండ్, బిబ్ జాకెట్లను ఉపయోగించి పరుగు పరీక్షను నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యే రసమయికి ఘన సన్మానం

నవతెలంగాణ-మానకొండూర్:



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అంజి, వెంకటస్వామి

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇస్కూళ్ల అంజి, కొండ్ర వెంకటస్వామి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలో దళితుల సమస్యలు, దళితుల అభ్యున్నతి కోసం మాట్లాడినందుకుగాను ఎమ్మెల్యే రసమయికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఆంజనేయులు, సురేందర్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక ఒత్తిడిని జయించేలా పదో తరగతి ప్రతిభా పరీక్షలు

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పోడిషెట్టి అభిలాష్

నవతెలంగాణ-హుజురాబాద్:

ఎస్ఎఫ్ఐ హుజురాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పదో తరగతి ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పొడిశెట్టి అభిలాష్ మాట్లాడుతూ ...విద్యార్థులను చైతన్యవంతులను చేసేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి సంఘం పోరాటాలకే కాకుండా విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పడుతూ వారిని గొప్ప స్థాయిలో నిలబడే విధంగా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సహకరిస్తున్న యజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు ఈ నెలలో బహుమతుల ప్రదాన ఉత్సవ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

ఎన్‌పీసీడీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-హుజురాబాద్:

ఆర్టిజన్‌లకు ఈపీఎఫ్ సీలింగ్ లిమిట్ ఎత్తివేయాలని 50 శాతం పీఆర్సీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎన్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులందరికీ ఒకే రకమైన రూల్స్ ఉండాలని, పర్సనల్ పే ను బేసిక్ పే లో కలపాని, 50 శాతం పీఆర్సీ ఫిట్మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీఈయూహెచ్-82 పాలవేణి రవి, డివిజన్ అధ్యక్షులు తొంట గట్టయ్య ప్రధాన కార్యదర్శి కర్ర సమ్మిరెడ్డి, యూనియన్ నాయకులు విక్రమ్‌రెడ్డి, శంకరయ్య, సదానందం, మహేందర్, సారంగపాణి , తిరుపతి, సౌమ్య, సరిత, సుధాకర్, మల్లయ్య, పూర్ణచందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ-మానకొండూర్:

ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేద పాఠశాలలో తల్లిదండ్రుల పూజ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల విలువను విద్యార్థి దశ నుంచే వివరించి పిల్లలకు తల్లిదండ్రులంటే దైవంతో సమానమనే భావన కల్పించేదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముందుగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మాతృ, పితృ పూజలు చేయగా.. తల్లిదండ్రులు అక్షింతలు వేసి తమ పిల్లలను ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ముంజంపల్లి సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ నెల్లి మురళి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు పిట్టల మధు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్‌రెడ్డి, నాయకులు నెల్లి శంకర్, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



నివాళలర్పిస్తున్న బంజారాలు

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని రాజారాంపల్లి గ్రామంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. బంజారా, సాంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం సాంప్రదాయ బద్ధంగా భోగ బండార్‌కు చేతులు జోడించి అమ్మవారికి సేవాలాల్ మహారాజ్‌కి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయిని సత్తెమ్మ, నందగిరి సింగిల్ విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, సర్పంచుల పురం మండల అధ్యక్షుడు కోరు కంటి రాజేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ నాగుల రాజశేఖర్ గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగావత్ తిరుపతి నాయక్, ఎస్టీ అధ్యక్షుడు ఇస్లావత్ రాజేశం నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శేఖర్ నాయక్, తిరుమని నర్సింహారెడ్డి, రాజు ఆంజ నేయులు, గ్రామశాఖ అధ్యక్షుడు కనుకయ్య తిరుపతి, శ్రీనివాస్ గౌడ్‌పా పాల్గొన్నారు.

వేములకుర్తిలో హెల్త్ మేళా



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో హెల్త్ మేళ గ్రామ సర్పంచ్ సున్నం నవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజలకు అసంక్రమిత వ్యాధులు హైపర్ టెన్షన్, మధుమేహం, రొమ్ము క్యాన్సర్, క్షయ, లెప్రసీ, డివార్మింగ్ మొదలైన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశెట్టి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ ఆసతిరాజం పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు కృషి చేయాలి

ఎంపీపీ జాజాల భీమేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీపీ జాజల భీమేశ్వరి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ జాజల భీమేశ్వరి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సెర్ప్ తరపున ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని వీటి వల్ల భూగర్భ జలాలు అంతరిం చిపోకుండా ఉంటాయని వివరించారు. వీటి నిర్మాణంలో గ్రామంలోని ప్రజా ప్రతినిధులు కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీపీ కోరారు. ఎంపీడీవో ద్వారా మండలంలో మంజూరు కాబడిన లబ్దిదారుల లిస్టు తీసుకుని సంబంధిత సభ్యులకు గ్రామ సంఘం ద్వారా నిర్మాణం జరిగేలా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కటుకం ప్రభు, గ్రామ సమైక్య లీడర్లు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్నం 2 గంటల వరకు కొండగట్టులో దర్శనలు నిలిపివేత

జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ-జగిత్యాల

ప్రసిద్ధ కొండగట్టు ఆంజనేయస్వామి స్వామి ఆలయ అభివృద్ధి కోసం నేడు సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులను అనుమతించబోమని జిల్లా కలెక్టర్ తెలిపారు. భద్రత, పర్యటన ఏర్పాట్ల దృష్ట్యా దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి భక్తులు సహకరించాలని కలెక్టర్ కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ -మెట్‌పల్లి



సన్మానిస్తున్న ఎమ్మెల్యే

జీవిత సాఫల్య జాతీయ పుర స్కారం అందుకున్న భారత జాగృతి యువజన విభాగం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్‌ను బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మంగళ వారం సన్మానించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు గాను జీవిత సాఫల్య జాతీయ పురస్కారం అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, రానవేణి సత్య నారాయణ, మునిసిపల్ వైస్ చైర్మన్ చంద్ర శేఖర్‌రావు, నిమ్మల అశోక్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-మెట్‌పల్లి రూరల్

మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న కంటి పరీక్షలను పర్యవేక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు

స్వగ్రామానికి చేరిన మృతదేహం

నవతెలంగాణ-కథలాపూర్



కథలాపూర్ మండలంలోని గంభీర్పూర్ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేష్ ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. జీతం సరిగా లేక పనులు దొరకక పోవడం వల్ల 14 రోజుల క్రితం ఆత్మ హత్య చేసు కున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు స్పందించి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా గల్ఫ్ ఎంబసీతో మాట్లాడి మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి, ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మన ఊరి -మనబడిలో మైతాపూర్‌ను ఎంపిక చేయాలి

మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి రాజేష్

నవతెలంగాణ-రాయికల్



రెండో విడత మన ఊరి మనబడి లో మైతాపూర్,చేర్ల కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి రాజేష్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.

మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుండి మూడు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను మంగళవారం సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. ఆలయ పార్కింగ్ ప్రదేశం, క్యూలైన్లు, ధర్మగుండం, ప్రసాదాల కౌంటర్ తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, డీపీఓ రవీందర్, డీఎస్పీ నాగేంద్రచారి, ఆలయ ఈఈ రాజేష్, పట్టణ సీఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ

కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు

నవతెలంగాణ - గోదావరిఖని : కన్వేయన్స్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటీయు అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆర్జీ 1 డిజిఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు సంఘం రాష్ట్ర కోశాధికారి వేల్పుల కుమారస్వామి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ-1లో వివిధ సెక్షన్ల లో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల కు స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ ఇచ్చారని, కాని దాన్ని అమలు చేయించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని అన్నారు. అదేవిధంగా సిఎంపిఎఫ్, బోనస్ అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని అధికారుల దష్టికి తెచ్చినప్పటికీ స్పందించడం లేదని అన్నారు. సింగరేణి యాజమాన్యం ఇస్తున్న వేతనాలు ఓనర్లు డ్రైవర్లకు ఇవ్వడం లేదని అన్నారు. వెట్టిచాకిరి చేయించ్చుకుంటున్నారని అన్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓనర్లు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని లేని యెడల ఈనెల 28 వ తేదీ తరువాత ఏ రోజునుండైన సమ్మెలోకి వెళ్తామని అన్నారు. డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లక ముందే వెహికిల్ ఓనర్లు స్పందించి సింగరేణి ఇస్తున్న వేతనాలు యధావిధిగా డ్రైవర్లకు చెల్లించాలని, ఆ విధంగా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని అన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో ఆర్జీ 1 అధ్యక్ష కార్యదర్శులు నందిని, ఉపేందర్, కన్వేయన్స్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షకార్యదర్శులు ఓదెలు, లింగయ్య, సంపత్, అసిఫ్, తిరుపతి, రమేష్, వినోద్, భూమయ్య, సాయి తదితరులున్నారు.



సమ్మె నోటీసులు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ - సిరిసిల్ల : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఈ నెల 20, 21తేదీలలో నిర్వహించే టాలెంట్ టెస్ట్ కరపత్రాలను మంగళవారం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి వార్షిక పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రముఖ విద్యావేత్తల ద్వారా రూపొందించిన టాలెంట్ టెస్ట్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పరీక్షను విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు మరిన్ని ఉపయోగకరమైన పరీక్షలు నిర్వహించాలని అన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఎస్పీకి అంబేద్కర్ చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు నర్సింహులు, ఆదిత్య, రామ్ చరణ్ ఉన్నారు.



టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరణ చేస్తున్న ఎస్పీ

రెండో రోజు రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ - సిరిసిల్ల : డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల డ్రాలో పేర్లు రాని వారికి వెంటనే ఇంటి స్థలం ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు ప్రభుత్వం అందించకుంటే పట్టాలిచ్చే వరకు కట్టిన ఇండ్లలో ఉంటామని రిలే నిరాహారదీక్ష లో పాల్గొన్న పేదలు అన్నారు. డబుల్ బెడ్ రూమ్ డ్రా లో రానివారికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగింది. పార్టీ సీనియర్ నాయకుడు మిట్టపల్లి రాజమౌళి ప్రారంభించారు. దీక్షలో మామిడాల పద్మ, శ్రీరామోజి లావణ్య, గాజుల కమల, చంద్రవ్వ, వడ్లుల వీరేశం, పోగుల రాజు, బచ్చు సదానందం, సూరం పద్మ సామల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకుడు శ్రీరాం సదానందం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మోర అజయ్, శ్రీరామ్ రమేష్ చంద్ర, బెజిగం సురేష్, శ్రీపతి ముని, తదితరులు పాల్గొన్నారు.



ఆర్జి-3లో సీఎం పిఎఫ్ సమన్వయ కమిటీ సమావేశం

నవతెలంగాణ - రామగిరి : సింగరేణి ఆర్జీ-3 ఏరియా జీఎం కార్యలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిఎంపిఎఫ్, సింగరేణి అధికారులు, కార్మిక సంఘ నాయకులతో సిఎంపియఫ్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సిఎంపియఫ్ రీజనల్ కమిషనర్ హరి పచౌరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్జీ-3 జీఎం టివి.రావు, డిజిఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పోతెదార్, టిబిజికేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఎంపీపీ

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ మండలంలోని నారాయణరావుపల్లి, సాంబయ్యపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ మొగ్దంపూర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎంపీపీ బాలాజీరావు, స్థానిక ఎంపీటీసీ గట్టు శ్రీనివాస్ పరిశీలించారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు ఉన్నారు.

నూతన వరి వంగడాల సందర్శన

నవతెలంగాణ - ఇల్లంతకుంట : జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో మండలంలోని పొత్తూర్ గ్రామానికి చెందిన సంకిటి రవీందర్‌రెడ్డి, చెరుకు రవీందర్ రెడ్డి అనే రైతులు వేసిన చిరు సంచి దశలో ఉన్న నూతన వరి వంగడాలను మంగళవారం సందర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన చిరు సంచి దశలో ఉన్న వరి వంగడాలను (జె.జి.ఎల్.-28639, డబ్ల్యు.జి. ఎల్. 1119, డబ్ల్యు. జి. ఎల్. 1246 మరియు ఆర్.ఎన్.ఆర్.-31479) జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి పరిశీలించారు. అదే విధంగా ఇతర రైతుల పొలాలను సందర్శించి తగు సూచనలు చేశారు. క్షేత్ర సందర్శనలో ఏఈఓ దొడ్ల లతాశ్రీ, రైతులు పాల్గొన్నారు.

బట్ట సంచులు, టీ షర్ట్‌లు పంపిణీ

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో కార్మికులకు బట్ట సంచులు, టీ షర్ట్‌లను జూలపల్ల జెడ్పీటీసీ, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ సౌజన్యంతో జిల్లా అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చాతళ్ల కాంతయ్య, టీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు కల్లెపల్లి సాయి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కెసిఆర్ సేవా దళం జిల్లా యూత్ అధ్యక్షుడు బొద్దుల సాయినాథ్, సాగర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమ వేదికకు విరాళం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాల వేదిక కోసం బేతి మల్లేశం, అతని కుమారులు బేతి శ్రీనివాస్, బేతి వేణు మాతృమూర్తి కీర్తిశేషులు బేతి రాధమ్మ జ్ఞాపకార్థం 30 వేల రూపాయల విరాళాన్ని ప్రధానోపాధ్యాయుడు పి.మురళీధర్‌కు అందజేశారు. పదవ తరగతి వార్షిక పరీక్షలలో అత్యున్న ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి 5వేలు, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.3వేలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ పాశం సరోజనదేవరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ గోగురి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యుడు పాటి దేవయ్య, హెచ్ఎం అభినందించారు.

ఎమ్మెల్యే రమేష్ బాబు నివాసం ముందు అలజడి

గల్ఫ్ కార్మికుడి మృతదేహంతో గల్ఫ్ జేఏసీ నాయకుల నిరసన

నవతెలంగాణ - వేములవాడ :

వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు నివాసమైన సంగీత నిలయం ముందు మంగళవారం మధ్యాహ్నం అలజడి నెలకొంది. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేశం (35) అనే గల్ఫ్ కార్మికుడు 15 రోజుల క్రితం అనారోగ్య కారణాలతో దుబాయిలో మృతిచెందాడు. అతని మృతదేహం మంగళవారం స్వదేశానికి చేరింది. ఈ క్రమంలో వెంకటేష్ మృతదేహంతో సరాసరి ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్న గల్ఫ్ జేఏసీ నాయకులు గేట్ ముందు శవపేటికను ఉంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఉన్న ఊరిని, కుటుంబ సభ్యులను వదిలి ఎడారి దేశాలకు వెళ్లే గల్ఫ్ కార్మికులకు ఉమ్మడి రాష్ట్రంలోను న్యాయం జరగలేదన్నారు. కనీసం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై తొమ్మిది ఏండ్లు గడుస్తున్నా ఇంతవరకు గల్ఫ్ పాలసీ, ఎన్నారై పాలసీ అమలు కావడం లేదని, కొద్దిరోజుల క్రితం జరిగిన బడ్జెట్ సమావేశంలోనైనా ఎన్నారై పాలసీ అమలు కోసం చర్చా జరుగుతుందని, కార్మికుల సంక్షేమం కొరకు నిధులు కేటాయిస్తారని వెయ్యి కళ్లతో వేచి చూసిన చివరికి నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాడనే ఆవేదనతోనే ఈ నిరసన తెలిపినట్టు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. నిరసన విషయం తెలుసుకున్న పట్టణ సీఐ వెంకటేష్ సిబ్బందితో సహా సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టి నిరసనకు బాధ్యులైన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



ఎమ్మెల్యే నివాసం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

రసాబాసగా ఎలిగేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - ఎలిగేడు : రసబాసగా ఎలిగేడు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. సర్వసభ్య సమావేశాలు చర్చలకే పరిమితం అవుతున్నాయని, సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో 10వ తరగతి పరీక్షలు ఉండగా సుల్తాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల తెలుగు టీచర్‌ను బదిలీ చేయడం ఏంటని సర్పంచ్ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ర్యాకలదేవ్‌పల్లి గ్రామం నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జెసిబిని రెవెన్యూ అధికారులకు పట్టించిన కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేదని జెసిబిని వదిలివేయడం పట్ల గ్రామ సర్పంచ్ విజేందర్‌రెడ్డి తహసిల్దార్ నాగరాజమ్మను నిలదీశారు. ఈజీఎస్‌లో చేసిన పనులకు బిల్లులు రావడం లేదని అధికారులను అడిగితే సమాధానం దాటవేశారు. అనంతరం ఎంపీపీ స్రవంతి మాట్లాడారు. ఎలిగేడు మండలానికి చెందిన ఎమ్మెల్సీ తానుపర్తి భాను ప్రసాద్‌రావును ప్రభుత్వ చీఫ్‌విప్‌గా నియమించడం పట్ల సభలో హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీఓ అనిల్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాడ కొండల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి

అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం

ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు

నవతెలంగాణ - ముస్తాబాద్ : మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో ముస్తాబాద్ మండల అభివృద్ధికి కృషిచేస్తున్నామని ఎంపీపీ శరత్‌రావు అన్నారు. మంగళవారం ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాలలో గల సమస్యలను వివరించారు. గ్రామాలలో నిర్మించిన శ్మశాన వాటిక, గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలు, మిషన్ భగీరథ పైప్ లైన్ వేసిన బిల్లులు తోపాటు ఈజీఎస్, పిఆర్ బిల్లులు సంవత్సరం గడుస్తున్నా రావడం లేదని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, వెంకట్రావుపల్లె సర్పంచ్ రాజుతో పాటు పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, దళిత, బిసి వర్గసర్పంచులను అగౌరవపరుస్తున్నారని వారి గ్రామంలో వారికే తెలియకుండా పలు అభివృద్ధి కార్యక్రమాలు, చెక్కుల పంపిణీ సర్పంచులను పిలవకుండానే చేస్తున్నారని గూడూరు సర్పంచ్ రమేష్ అన్నారు. పలు గ్రామల్లో చెరువులను రంగనాయక ప్రాజెక్టు ద్వారా నింపాలని ఎంపీటీసీ రామచంద్రం, సర్పంచ్ వెంకటేశ్వరి కోరారు. 30 పడకల ఆసుపత్రి మంజూరు అయిందని, డిగ్రీ కళాశాల కూడా త్వరలో మన మండల కేంద్రంలో ఏర్పాటు కేస్తామని ఎంపీపీ తెలిపారు. ముస్తాబాద్ ఎంపీటీసీ మాట్లాడుతూ ముస్తాబాదును మున్సిపాలిటీ చేయవద్దని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోపాలరావు, జెడ్పిటిసి నరసయ్య, పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాపురావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

విద్యుత్ రిప్రెసెంట్‌వ్‌ల ఎంపిక అడ్డుకోవడం పట్ల ఆగ్రహం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణలో విద్యుత్ సహకార సంఘం రిప్రెజెంట్ అభ్యర్థులుగా ఎన్నిక కొరకు ఒక రోజు ముందు గ్రామ సోషల్ మీడియాలో, రాత్రి, ఉదయం డప్పు చాటింపు ద్వారా ప్రచారం జరుగగా పారిపెల్లి రాములరెడ్డి ఎన్నిక కాగా బిఆర్ఎస్ నాయకులు మంగళవారం సమాచారం ఇవ్వలేదని ఎంపికను ఆపడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 గంటలకు నిర్వహించాల్సిన ఎన్నిక 9:45 నిమిషాలకు ప్రారంభంకాగా సర్పంచ్ అధ్యక్షతన ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామం నుండి 13 మంది అభ్యర్థుల పేర్లు నమోదు చేసుకోగా అందులో నుండి అభ్యర్థులు సపోర్టుతో సూచించుకోగా నలుగురు అభ్యర్థులు పోటీ కోరగా పారిపెల్లి రామిరెడ్డి, బాయికాడ రాజయ్య, నేవూరి సర్వేగారి పద్మరెడ్డి, మేగి నర్సయ్య పోటీలో నిలిచారు. 85మందికిపైగా పారుపల్లి రాంరెడ్డి పేరు ప్రకటించగానే మద్దతుదారులంతా గ్రామపంచాయతీ ఒక రూంలో వెళ్లి మీటర్ నెంబర్ పరిశీలించుకోగా 85 మంది మద్దతుదారులుగా ఉన్నారని బయట తెలియజేయగానే అక్కడ ఉన్న మందిలో 75 శాతం మంది పారిపెల్లి రామిరెడ్డికి మద్దతు తెలిపారు. బిఆర్ఎస్ ఎంపిటిసి భర్త పర్శరాములు తనకు సమాచారం ఇవ్వలేదని ఎలక్షన్ జరపవద్దని మధ్య మధ్యలో గొడవ చేస్తూ, పారిపెల్లి రామిరెడ్డి మద్దతును చూసి ఓర్వలేక ఎలక్షన్ ఆఫీసర్లు బెదిరించి బిఆర్ఎస్ పెద్ద లీడర్ అని చెప్పుకునే వారితో ఫోన్ చేయించి ఆఫీసర్లు బెదిరించి పోలీసుల పహారా నడుమ గొడవ సృష్టించి పారిపెల్లి రామిరెడ్డి విజయాన్ని ప్రకటించకుండా చేశారని సందుపట్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు.



గ్రామసభలో నిలదీస్తున్న గ్రామస్థులు

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని కాంగ్రెస్ ధర్నా

నవతెలంగాణ - ఓదెల: ఏసీడీ విద్యుత్ చార్జీలు తగ్గించాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు గ్యారనవేన నాగరాజు మాట్లాడుతూ వెంటనే చార్జీలు తగ్గించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల ఐలయ్య, ముంజల రాజేశం, అట్టేపల్లి రాజు, సునీల్, రాకేష్, కృష్ణ, గాధం శ్రీధర్, కుమార్, బేరం రాజయ్య, సంపత్, మహేందర్, అనిల్, బిక్షపతి, ప్రభాకర్, నవీన్, రమేష్, తదతరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసిన కాంగ్రెస్ శ్రేణులు

మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేయండి

నవతెలంగాణ - ఓదెల : పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద క్షేత్రమైన ఓదెల మల్లికార్జున ఆలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొలనూరు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం ఉద్యమ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వస్తున్న సందర్భంగా ఓదెల మల్లన్న గుడికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఆయనవెంట మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్య, శంకర్, నరసింహారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌ను మున్సిపాలిటీ చేయవద్దు

బీజేపీ నాయకుల ఆందోళన

నవతెలంగాణ - ముస్తాబాద్ : ముస్తాబాద్‌ను మున్సిపాలిటీ చేయవద్దంటూ మంగళవారం బీజేపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేవారు. ముస్తాబాద్, పోతుగల్ రెండు గ్రామాలు కలిసి సుమారు 1800 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని, వారికి ఉపాధి లేకుండా పోతుందని వాపోయారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

పురుగు మందులపై రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి రైతు వేదికలో మంగళవారం స్థానిక రైతులకు ఐఐఎల్ ఫౌండేషన్, ఇనిసెక్టి సైడ్స్ ఇండియా లిమిటెడ్ ట్రాక్టర్ బ్రాండ్ ఆధ్వర్యంలో పురుగుల మందుల పిచికారిపై అవగాహన కల్పించారు. రైతులు క్రిమిసంహార మందులు వాడే విధానం, వాడేటప్పుడు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను తెలిపారు. అనంతరం రైతులు పాటించాల్సిన భద్రత సూచికల పోస్టర్‌ను ఏఈఓ అనూష, స్థానిక ప్రజాప్రతినిధులు, కంపెనీ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమన్, ఉపసర్పంచ్ బాలకిషన్, వార్డు సభ్యుడు చెట్టిపల్లి నరేష్ పటేల్, సేల్స్ ఆఫీసర్ ప్రశాంత్, కంపెనీ ప్రతినిధులు అరుణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ - చందుర్తి : మండలంలో రైతుల వ్యవసాయానికి మోటారు సాంక్షన్‌పై ఈ నెల 12న నవతెలంగాణలో వచ్చిన కథనానికి సెస్ అధికారులు స్పందించారు. మంగళవారం ఏఈ స్రవంతి మాట్లాడారు సెస్ డైరెక్టర్ల ఎన్నికల్లో భాగంగా కొంచెం ఆలస్యం జరిగిందని తెలిపారు. దీనికి గాను రైతులకు విద్యుత్ మోటార్ సాంక్షన్‌కు ప్రపోజల్ ఇచ్చామని అన్నారు.

సీపీని కలిసిన పెద్దపల్లి జెడ్పీ చైర్మన్



నవతెలంగాణ - రామగిరి : రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రెమా రాజేశ్వరిని మంగళవారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కలిసారు. రామగిరి, కమాన్పూర్, ముత్తారం మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

సిరిసిల్ల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

నవతెలంగాణ - సిరిసిల్ల : ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఆర్బిఐ ఆదేశాల మేరకు లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 17 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు 2కె వాక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బ్యాంకు కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి 2కే వాక్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ సత్య ప్రసాద్.

వేములవాడ ఏరియా ఆసుపత్రి ఘనత

ఒకే రోజు విజయవంతంగా పది కాన్పులు

నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణంలో ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఒకే రోజు 10 కాన్పులు విజయవంతంగా చేసినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్‌రావు తెలిపాడు. ఈ మేరకు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. మొత్తం 10 కాన్పులలో ఐదు సాధారణ కాన్పులు, ఐదు సర్జరీ అయ్యాయని తెలిపారు. జన్మనిచ్చిన తల్లులతో పాటు పుట్టిన బిడ్డలందరూ క్షేమంగా ఉన్నారని, తమ వైద్యులు, సిబ్బంది సమిష్టి కృషివల్లనే ఇది సాధ్యమైనట్లు ఆయన తెలిపారు. మహేష్ రావు, డాక్టర్ చైతన్య సుధా, డాక్టర్ సంతోష్‌చారి, డాక్టర్ జ్యోతితో పాటు హెడ్‌నర్స్ స్టెల్లా, స్టాఫ్‌నర్స్ భాగ్యలక్ష్మి, లక్ష్మీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నష్టపరిహారం చెల్లింపుపై చర్చలు

నవతెలంగాణ - గోదావరిఖని : ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మరణించిన రామగుండం మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు ఆయిళ్ల సందీప్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపుపై మంగళవారం చర్చలు జరిగాయి. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం ఒప్పందం కుదిరింది. సందీప్ కుటుంబానికి రామగుండం నగర పాలక సంస్థ నుండి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, అదేవిధంగా విద్యుత్ శాఖ నుండి 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, మృతుని కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, దళిత బంధు పథకం వర్తింపజేసేందుకు కూడా ఈచర్చల్లో ఒప్పందం కుదిరింది. ఈ చర్చల్లో రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, నాయకులు వై.యాకయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు, తోకల రమేష్, కన్నూరి ధర్మేందర్, కొట్టేపల్లి దుర్గాప్రసాద్, పాత పెల్లి ఎల్లయ్య, కన్నూరి సతీష్ కుమార్, కంది చంద్రయ్య, మంద రవి, కనుకుంట్ల సమ్మయ్య, ట్రాన్కో, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సర్పంచ్ భర్త

నవతెలంగాణ - వీర్నపల్లి : క్రిమిసంహారక మందు తాగి సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండా గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఎవ్వరు లేని సమయంలో సర్పంచ్ ప్రమీల భర్త రాజు నాయక్ పురుగుల మందు తాగి పడిపోయి ఉన్నాడు. కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 10న జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎస్టీ కార్పొరేషన్ లోన్ అప్లికేషన్ పెట్టుకుంటే జాబితా నుంచి కావాలనే తన భర్త రాజు నాయక్ పేరును తొలగించారని అంటే పట్టించుకోవడం లేదని అధికారులను సభలో సర్పంచ్ ప్రమీల నిలదీశారు. అదేవిధంగా గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని, ఇంకెప్పుడు బిల్లులు వస్తాయని.. ఆరు నెలలు అయితే పదవి అయిపోతుందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

అభివృద్ధి పనులలో రోజువారీ పురోగతి కనపడాలి

మార్చి చివరి నాటికి 39 సిసి రోడ్ల పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ

నవతెలంగాణ - సుల్తానాబాద్

మండలంలో వివిధ శాఖల ద్వారా చేస్తున్న అభివృద్ధి పనులలో రోజువారీ పురోగతి కనపడాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సుల్తానాబాద్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. రానున్న వేసవికాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మిషన్ భగీరథ పైప్ లైన్ సామర్థ్యం అందుకు తగ్గట్లుగా పెంచవలసి ఉన్నదా, బోర్ వెల్ ల వివరాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. సుల్తానాబాద్ మండలంలో ఉన్న రెండు వైకుంఠ ధామాలను ఫిబ్రవరి చివరి నాటికి పూర్తిగా వినియోగంలోకి తీసుకొని రావాలని, మండలంలో చేపడుతున్న సి.సి. రోడ్ల నిర్మాణాలను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలో 39 సిసి రోడ్ల నిర్మాణానికి 2.86 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 28 లక్షల విలువ గల 4 పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించగా, మార్చి చివరి నాటికి వంద శాతం పనులు పూర్తి చేసి, బిల్లు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో లేబర్ కాంపోనేంట్ పెరగాలని, పనులకు సంబంధించి చెల్లింపులు ఎంత మేరకు చేశారని, పనుల పురోగతి వివరాలను రెండు రోజులలో అప్డేట్ చేసి సమర్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి జి.పి. భూమి ఉన్నదా, ఆబాదిలో భూమి ఉంటే వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మన ఊరు మన బడిలో 18 పాఠశాలలో జరుగుతున్న పనులలో 4 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారని, ఇంకా రెండు పాఠశాలలో పనులు మొదలు పెట్టలేదని తెలుసుకొని వెంటనే సర్పంచ్ తో మాట్లాడి పనులు మొదలు పెట్టాలని, పురోగతిలో ఉన్న మిగతా పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో నిర్మాణ దశలో ఉన్న రెండు పడక గదుల 80 నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ బి.యాకన్న, ఎంపీడీఓ శశికళ, డిప్యూటీ తహశీల్దార్ సదానందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మండలంలో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్

20 నాటికి ఎస్సీ సంక్షేమ వసతి గృహాల ఆధునీకరణ పనులు పూర్తిచేయాలి

ఫిబ్రవరి 20 నాటికి సుల్తానాబాద్ మండలంలో చేపట్టిన ఎస్సీ బాలుర వసతి గహం ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని ఎస్సీ బాలుర వసతి గృహం ఆధునీకరణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.

కంటి వెలుగు ద్వారా ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు

కంటి వెలుగు శిబిరాల ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటి వెలుగు శిబిరం జరుగుతున్న తీరును, హాజరైన ప్రజలను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు సూచించిన సమయంలో ప్రజలు వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.యాకన్న, ఎంపీడీఓ శశికళ, ప్రత్యేక అధికారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని సర్పంచుల వేడుకోలు



నవతెలంగాణ - ఇల్లంతకుంట

పెండింగులో ఉన్న బిల్లులను చెల్లించాలని మండల సర్పంచులు మంగళవారం ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చల్ల నారాయణ ఆధ్వర్యంలో దాదాపు 12 మంది సర్పంచులు మంగళవారం విలేకరుల ముందు తమ గోడు వినిపించారు. అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ దాదాపు గత సంవత్సరం క్రితం గ్రామాలలో వేసిన సిసి రోడ్లకు ఇప్పటి వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంటులు విడుదల చేయక పోవడం బాధాకరమన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మేము వారి సంక్షేమం కోసం అధికారుల మెప్పు కోసము గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. శ్మశాన వాటిక మొదలు డంపింగ్ యార్డ్, రైతు వేదిక, సిసి రోడ్లు, సంఘ భవనాలు, బృహత్ ఉద్యాన వనాలు, హరితహారం, క్రీడా మైదానాలు లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి అప్పుల పాలయ్యామని ఉన్నారు. సొంత ఆస్తులు, బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తెచ్చి అధికారుల ఒత్తిడికి పనులు పూర్తి చేశామని తెలిపారు. అదే అధికారుల చుట్టూ బిల్లుల కోసం తిరిగిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్పంచులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని సర్పంచులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జితేందర్‌గౌడ్, మల్లారెడ్డి, భాగ్యలక్ష్మి బాలరాజు, వాణిదేవేందర్‌రెడ్డి, సుశీలరాములు, కనకయ్య, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

కాంగ్రెస్ ఓబిసి సెల్ మండల అధ్యక్షుడిగా అల్లం కుమారస్వామి



కండువా కప్పి సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

నవతెలంగాణ - ముత్తారం : కాంగ్రెస్ ఓబిసి సెల్ మండల అధ్యక్షునిగా అల్లం కుమారస్వామి నియమితులయ్యారు. ఏఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదేశాలతో జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు పెండేల మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు గోటికారి కిషన్ అల్లం కుమారస్వామిని నియమిస్తూ ఉతర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామకపు ఉత్తర్వులను అందజేశారు. తనను నియమించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు, నాయకులు మహేష్‌కు, గోటికారి కిషన్‌కుతోపాటు మాజీ జడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా ఓడేడు రత్న కొమురయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, మండల అధ్యక్షులు ఎడవేన సంపత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎడవేన సంపత్‌కు పార్టీ కండువా కప్పి సన్మానించారు.

అవినీతి రహిత పాలనను అందిస్తున్న ప్రధాని మోడీ

బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ - గోదావరిఖని : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో అవినీతి రహిత పాలనను అందిస్తున్నారని బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ అన్నారు. బిజెపి మల్యాపూర్ మండల శక్తి కేంద్రం ఇన్‌చార్జి గాండ్ల స్వరూప అధ్యక్షతన ప్రజా గోస - బిజెపి భరోసా కార్నర్ మీటింగ్ మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. దేశంలో అందిస్తున్న పాలన తరహాలో రాష్ట్రంలో కూడా పరిపాలన అందాలంటే రానున్న రోజుల్లో రాష్ట్రంలో కూడా బిజెపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంట కుమార్, కాంపల్లి రవి, భాగాల స్వామి, గుండబోయిన లక్ష్మణ్ యాదవ్, క్యాతం వెంకట రమణ, సోమారపు లావణ్య అరుణ్ కుమార్, మిట్టపల్లి సతీష్ కుమార్, తదితరులున్నారు.

తదుపరి వేజ్‌బోర్డు సమావేశానికి పిలవాలని చైర్మన్‌కు లేఖ

నవతెలంగాణ - గోదావరిఖని : ఐఎన్‌టియుసి జెబిసిసి 11వ తదుపరి వేజ్‌బోర్డు సమావేశానికి పిలవాలని వేజ్‌బోర్డు చైర్మన్‌కు ఐఎన్‌టియుసి బృందం లేఖ రాసినట్లు సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 10న కలకత్తా హైకోర్టు నుంచి కోల్ ఇండియా స్థాయిలో జరిగే జెబిసిసిఐ వేతన ఒప్పందం సమావేశాలకు ఐఎన్‌టియుసి ఆహ్వానించాలని హైకోర్టు డైరెక్షన్ ఇవ్వడం జరిగిందని, తదుపరి చర్చలకు ఐఎన్‌టియుసి ఆహ్వానించాలని వెలువడిన కోర్టు ఆర్డర్‌ను ఆటాచ్ చేస్తూ జెబిసిసిఐ చైర్మన్, సిఐఎల్ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్‌కు ఐఎన్‌టియుసి బృందం లేఖ రాసినట్లు జనక్ తెలిపారు.

మండలి చీఫ్‌విప్‌ను అభినందించిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్



నవతెలంగాణ - గోదావరిఖని : శాసనమండలి చీఫ్‌విప్‌గా నియమితులైన టి.భానుప్రసాదరావుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఆయన భానుప్రసాదరావును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మూడుసార్లు శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన భానుప్రసాదరావుకు మండలిలో దక్కిన అత్యున్నత పదవితో పెద్దపల్లి జిల్లా ప్రజలకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

డ్రా ద్వారా ఎంపికైన వారికి ప్రాధాన్యత కల్పించాలి


నవతెలంగాణ - గోదావరిఖని : డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రామగుండం నుంచి 2016 సంవత్సరంలో డ్రా ద్వారా ఎంపికైన 160 మందికి ప్రాధాన్యత కల్పించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణను మాజీ మేయర్ కొంకటి లక్ష్మినారాయణ మంగళవారం కలిసి కోరారు. స్పందించిన ఆయన 2016లో ఎంపికైన లబ్ధిదారులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం హామీ ఇచ్చినట్లు తెలిపారు. డ్రాలో ఎంపికైన వారు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకొని, తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలని లక్ష్మినారాయణ తెలిపారు.

కమిషనరేట్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం : మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న బదిలీల్లో భాగంగా రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. రామగుండం సిఎస్‌బిలో ఉన్న వెంకటేశ్వర్లును ఖమ్మం జిల్లా కారేపల్లికి, మంచిర్యాల టౌన్‌లో పనిచేస్తున్న నారాయణను ఖానాపూర్‌కు, రామగుండం టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న కృష్ణారెడ్డి లక్షెట్టిపేట్‌కు, లక్షెట్టిపేటలో పనిచేస్తున్న కరీముల్లాను ఐజి ఆఫీసుకు, బెల్లంపల్లి టౌన్ లో పనిచేస్తున్న రాజును మంచిర్యాల టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్ వన్ ఐజిపి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యువత ఉద్యోగాల్లో ఉండాలన్నదే తన సంకల్పం

డాక్టర్ మోహన్ గోలి



నవతెలంగాణ - వేములవాడ : ఆద్య గోలి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోలి మోహన్ ఆధ్వర్యంలో గతేడాది నవంబరు 12న వేములవాడ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగం పొందిన అనుపురం గ్రామానికి చెందిన ఎర్రం సంతోష్ అనే యువకుడు మంగళవారం డాక్టర్ గోలి మోహన్ ను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపాడు. అనంతరం డాక్టర్ మోహన్ గోలి మాట్లాడుతూ యువత ఊర్లో కాదు ఉద్యోగంలో ఉండాలనే తన సంకల్పాన్ని యువత వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని మెగా జాబ్ మేళాలు ఏర్పాటు చేసి వేములవాడ నియోజకవర్గంలోని యువతీ యువకులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చాడు.

'ప్రభుత్వ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ - వేములవాడ : మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడం సిగ్గుచేటని టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు పర్లపల్లి రవీందర్ అన్నారు. టిఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడున్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. వారం రోజుల్లో వేములవాడ ప్రభుత్వ కళాశాల విద్యాల సమస్యలు పరిష్కరించకుంటే తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర నాయకుడు పులి రాంబాబుగౌడ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్, నాయకులు వలీ మహమ్మద్, రిక్కమల్ల మనోజ్, ర్యాగ ప్రశాంత్, శ్రీకాంత్, నవీన్, గణేష్, అమరేందర్, నరేష్ పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

నవతెలంగాణ - సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఆరోగ్య సిబ్బందికి, హాస్టల్ వాడెన్స్, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్తలకు పారిశుధ్య, పౌష్టికాహార అవగాహన, వ్యక్తిగత పరిశుభ్రత పిల్లలలో వచ్చే వ్యాధుల నివారణపై, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమం డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.సుమన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రములో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరాములు, డీఐఓ డాక్టర్ మహేష్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో మెగా సైక్లోథాన్ హెల్త్ మేళా

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్య మేళ మండల వైద్యాధికారి స్రవంతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పోషకహార లోపం, అన్ని రకాల మానసిక, శరీరక ఆరోగ్య సమస్యలు, సమతుల్య ఆహారం, మానసిక శరీరక ఆరోగ్యం కోసం చేయాల్సిన మోగా ధ్యానం, వ్యాయామం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కారుణ్య ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు

నవతెలంగాణ - గోదావరిఖని : సింగరేణి ఆర్జీ 1 ఏరియాలో 20 మంది డిపెండెంట్స్‌కు యాజమాన్యం నుంచి కారుణ్య నియామకపు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం కల్వల నారాయణ చేతుల మీదుగా మంగళవారం డిపెండెంట్స్‌కు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో టిబిజికెఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ పోనోగోటి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ సిహెచ్.లక్ష్మి నారాయణ, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ - గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్‌లో 8వ రోజు మంగళవారం హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగింది. 13వ డివిజన్ విఠల్ నగర్ ఏరియాలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీలో బిజెపి నుంచి నుంచి ఎండి.గఫూర్, బిఆర్ఎస్ నుంచి వేల్పుల రాజు, వివిధ పార్టీల నుంచి డాక్టర్ రాజేశంతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తఫా, నాయకులు పాల్గొన్నారు.

అరెస్టులు నిరంకుశ పాలనకు నిదర్శనం


సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు సత్తయ్య

నవతెలంగాణ - గోదావరిఖని : అక్రమ అరెస్టులు రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పరిపాలనకు నిదర్శనమని బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు సత్తయ్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బిఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లడానికి సిద్ధమవుతున్న సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్యతోపాటు ప్రతినిధులను వన్‌టౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని అన్నారు. అరెస్టయిన వారిలో కేంద్ర ఉపాధ్యక్షుడు యతిపతి సారంగపాణి, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసు రవీందర్, నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీష్, వడ్డేపల్లి కుమారస్వామి, పెండం సత్యనారాయణ, ఊరగొండ తిరుపతి, పల్లె శ్రీనివాస్, తాట్ల లక్ష్మయ్య, తదితరులున్నారు.

గుడుంబా విక్రేతలకు జరిమానా

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం : రామగుండం ఎస్టీ కాలనీకి చెందిన అజ్మీర లక్ష్మణ్ అనే గుడుంబా విక్రయిదారుడికి లక్ష రూపాయల జరిమానా చెల్లించాడు. వివరాల్లోకి వెళితే అజ్మీర లక్ష్మణ్ సులువుగా డబ్బు సంపాదించాలని గుడుంబా తయారుచేసి అమ్మడం వృత్తిగా ఎంచుకున్నాడు. సమాచారం అందుకున్న రామగుండం ఎక్సైజ్ పోలీసులు నిఘా వేసి అతను గుడుంబా తయారు చేస్తుండగా పట్టుకొని సత్ప్రవర్తన కోసం రామగుండం తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినప్పటికీ అతను తన విధానం మార్చుకోకుండా మళ్లీ గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడగా తహశీల్దార్ అజ్మీర లక్ష్మణ్‌కు ఏడాది జైలు శిక్ష విధించాడు. రెండు నెలల జైలు శిక్ష అనంతరం తాను జైలులో ఉండలేనని లక్ష రూపాయల జరిమానా చెల్లిస్తానని తహశీల్దార్‌కు మొర పెట్టుకోగా అనుమతించారు. తాజాగా అతను రూ.లక్ష బ్యాంకు చాలానా రూపంలో చెల్లించి ఎక్సైజ్ అధికారులకు అందజేసి జైలు నుంచి విడుదల అయ్యాడు.

మిస్సింగ్ కేసు నమోదు



రామగిరి శ్రీనివాస్

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం : ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రామగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లుగా కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ తెలిపారు. ఈ నెల 10న ఇంట్లో గొడవ పడ్డ శ్రీనివాస్ ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఈ క్రమంలో కుటుంబ సభ్యులు నాలుగు రోజులుగా వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మిస్సింగ్ అయిన వ్యక్తి బ్లూ టీషర్ట్, స్కై బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, సమాచారం తెలిస్తే 8712656526, 8712656524 నెంబర్లకు ఫోన్‌చేసి తెలపాలని సూచించారు.

పెద్దాపూర్ మల్లన్న ఆలయంలో చోరీ

నవతెలంగాణ - జూలపల్లి : మండలంలోని పెద్దాపూర్ గ్రామ మల్లన్న ఆలయంలో చోరీ జరిగింది. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం పూజారి ఆలయాన్ని శుభ్రపరుస్తుండగా తాళం పగలగొట్టి హుండీలోని 20వేలకుపైగా డబ్బులను దొంగిలించినట్టు గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు తెలిపాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తు గడుపు పెంపు

నవతెలంగాణ - గోదావరిఖని : డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం దరఖాస్తు గడును ఈ నెల 20 వరకు పెంచినట్టు రామగుండం తహశీల్దార్ జావెద్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తులను మీ సేవ నిర్వహకులు తహశీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి ఇవ్వాలన్నారు.

విద్యార్థులను దుర్భాషలాడిన ఫిర్యాదుపై బీసీడబ్ల్యూఓ రంగారెడ్డికి కలెక్టర్ మెమో

వివరణ అంగీకరించని అధికారి
విచారణ చేయనున్న కలెక్టర్
తెలియకుండా ఉంచుతున్న అధికారులు..

నవతెలంగాణ - పెద్దపల్లి

బీసీ విద్యార్థులను దుర్భాషలాడిన ఫిర్యాదుపై వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంక్షేమ శాఖ జిల్లా అధికారి రంగారెడ్డికి జిల్లా కలెక్టర్ మెమో జారీ చేశారు. ఈ నెల 3నే మెమో జారీ చేసినప్పటికీ బయట ఎవరికి తెలియకుండా గుట్టుచప్పుడు లేకుండా దాసి ఉంచారు. అందుకు బీసీడబ్ల్యూఓ ఈ నెల 6న వివరణ కూడా ఇచ్చారని అందులో బీసీ విద్యార్థులను తిట్టినట్లుగా అంగీకరించకపోవడంపై విచారణ జరుపనున్నట్లు సమాచారం. పెద్దపల్లి జిల్లా కేంద్రం మండలంలోని పెద్ద కలువల డిగ్రీ కళాశాలలో బీసీ విద్యార్థుల ఉద్యోగ శిక్షణ కోసం ఏర్పాటుచేసిన స్టడీ సెంటర్లో ఆరు నెలల నుండి బీసీ విద్యార్థులకు శిక్షణ బీసీ స్టడీ సర్కిల్ సందర్శించడంలో భాగంగా నెల రోజుల క్రితం బి సి డబ్ల్యు ఓ రంగారెడ్డి బీసీ విద్యార్థులను ఉద్దేశించి 'బీసీలు దొంగలు మీకు చదువు రాదు ఉద్యోగాలు రావు' అంటూ పరుష పదజాలంతో దుర్భాషలాడినట్టు విద్యార్థులు బీసీ సంఘం నాయకులకు ఫిర్యాదు చేశారు. అందుకుగాను గత ఏడాది డిసెంబర్ ఒకటిన బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాదూరి శ్రీమన్నారాయణ, డిసెంబర్ 8న ఎస్ఎస్యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంకూరు అవినాష్ జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 3వ తేదీన వచ్చిన ఆరోపణలపై మూడు రోజులలో సమాధానం ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ బీసీ డబ్ల్యూ ఓ రంగారెడ్డికి మెమో జారీ చేశారు. ఈనెల 6న అందుకు రంగారెడ్డి వివరణ ఇచ్చినట్లు తెలిసింది అయితే ఆ వివరణలో బీసీ విద్యార్థులను ఎటువంటి తిట్టడం కానీ దూషించడం కానీ చేయలేదని తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చారని తెలిసింది ఈ వివరణ సరిగా లేకపోవడంతో కలెక్టర్ విచారణ చేయనున్నట్లుగా తెలుస్తుంది. అయితే ఇదే విషయంపై గత పది రోజులుగా బీసీ డబ్ల్యూ శాఖలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎవరికి తెలియనట్లుగా చేయడం పట్ల రంగారెడ్డికి రాజకీయంగా ఉన్నతాధికారుల అండదండలు ఉన్నట్లుగా తెలుస్తుంది. మరోపక్క బీసీ సంఘాలు బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాత్రం బీసీడబ్ల్యూఓ రంగారెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐటీఎఫ్ బోనాల పండుగ విజయవంతం పట్ల కళాకారుల హర్షం



ఐటీఎఫ్ సభ్యుడు, జర్నలిస్టు రఫీకి మెమోంటో అందిస్తున్న నిర్వాహకులు

నవతెలంగాణ - వేములవాడ : ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ (ఐటిఎఫ్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా యూట్యూబ్ కళాకారుల ఆధ్వర్యంలో ఈ నెల 5న వేములవాడ పట్టణంలో నిర్వహించిన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పణ కార్యక్రమం విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేసిన నిర్వాహకులతో పాటు చరిత్రలోనే మొదటిసారి నిర్వహించిన గూగులమ్మ తల్లికి యూ ట్యూబ్ బోనాల పండగకు ప్రారంభం నుండి ముగింపు వరకు విస్తృత ప్రచారం కల్పించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐటీఎఫ్ గౌరవాధ్యక్షులు జి.ఎల్ నామ్‌దేవ్, బుర్ర నటరాజ్, మాట్ల తిరుపతి, ఓరుగంటి శేఖర్, మారం పప్పీ, రాజన్న సిరిసిల్ల జిల్లా బాధ్యులు జడల రమేష్, మహ్మద్ రఫీ, గణేష్, జగిత్యాల జిల్లా బాధ్యులు రాజ్ నరేంద్ర, మహిపాల్, నడిగట్టు రాజు, కరీంనగర్ జిల్లా బాధ్యులు బుర్ర సతీష్, ప్రవీణ్, పొద్దుపొడుపు శంకర్, పెద్దపల్లి జిల్లా బాధ్యులు సరిత, నరేష్, తిరుపతిలతో పాటు నాలుగు జిల్లాల యూ ట్యూబ్ కళాకారులు పాల్గొన్నారు.

పుల్వమా వీర జవాన్లకు నివాళి



ఎల్లారెడ్డిపేట : నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో వీర మరణం పొందిన జవాన్లకు విద్యార్థులు కొవ్వొత్తుల నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు గణాది శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : పుల్వమా దాడిలో వీర మరణం పొందిన భారత జవాన్లకు వైకే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దె సాయికిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలం ఐతారాజుపల్లి గ్రామంలో ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైకే ఫౌండేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్శెట్టి అరవింద్, పెద్దపల్లి నాయకులు కల్వల అజయ్, పున్నం అఖిల్, ఈర్ల అభిరామ్, ఈర్ల కార్తీక్, రంజిత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఇల్లంతకుంట : పుల్వామా దాడిలో వీర మరణం పొందిన అమర జవాన్లకు ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణంలో మంగళవారం మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఎబివిపి ఆధ్వర్యంలో 250 మీటర్ల జాతీయ జెండాతో కళాశాల, జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు, యువకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు, మండల కన్వీనర్ కూనబోయిన ప్రవీణ్, ప్రశాంత్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



వేములవాడ రూరల్ : మల్లారం గ్రామంలో..

నవతెలంగాణ -రామగిరి : రామగిరి మండలంలోని ఆదివారంపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ మైదం కుమార్, ఎంపీటీసీ మేడగోని ఉమారాజయ్య ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి ఆరెల్లి దేవక్కకొమురయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇనుముల రమేష్, ఎంపీఓ కాటం భాస్కర్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు మైదం వరప్రసాద్, మెడికల్ ఆఫీసర్ హిమబిందు, సూపర్వైజర్ లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఉపసర్పంచ్ ఎలువాక కోటి, కెడిసిసి డైరెక్టర్ ఏలువాక కొమురయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైదం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్య పల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాంలో పాల్గొని వాతావరణ కాలుష్యంపై గ్రామంలో వాడవాడనా సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి, ఎంపిటిసి గట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఇల్లంతకుంట : ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని రాష్ట్ర ఆహార భద్రత కమి షన్ సభ్యుడు ఆనంద్ అన్నారు. గాలిపెల్లి గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మల్లుగారి వాణీదేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన కిరణ్‌ను పరామర్శించి 50 వేల ముఖ్యమంత్రి సాయనిధి చెక్కు అందించారు.

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో కంటివెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, సమస్యలు ఉన్నవారికి కండ్లజోడు అందిస్తామని, ఈ శిబిరం వారం రోజుల పాటు కొనసాగుతుందని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ తిరుపతి, ఉపసర్పంచ్ ఎల్లాల దశరథరెడ్డి, ఎంపీటీసీ మల్లారం తిరుపతి, వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి ఐలయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య మడేల్, వైద్యాధికారి మధుప్రవాసని, ఏఎన్ఎం పుష్పల, ఆశ కార్యకర్తలు రేణుక, లావణ్య, మహిళా సంఘం సీఏ సందిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఎడ్ల లక్ష్మిరాజం ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ వెంకటేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జులా రాజిరెడ్డి ప్రారంభంచారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిప్పవరం భాస్కర్, జాలపల్లి లచ్చయ్య, డాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

19 అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ - సిరిసిల్ల : ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి గ్రామంలో ఈ నెల 19న రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎర్రవెల్లి స్వామి గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అంకణి భాను, జిల్లా ఇన్‌చార్జి మేకల మునీందర్ మాట్లాడారు. జిల్లా కార్యదర్శి లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, జిల్లా నాయకులు బండెల దేవరాజు, తాటిపల్లి అంజయ్య, జారపు రాజబాబు, ఈసంపల్లి కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

18 రోజులు 22 మ్యాచులు

- ఆరంభ మ్యాచ్‌లో ముంబయి, గుజరాత్ ఢీ
- మార్చి 26న డబ్ల్యూపీఎల్ ఫైనల్
- మహిళల ప్రీమియర్ లీగ్ 2023 షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-ముంబయి

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభ సీజన్ దిశగా అన్ని పనులు శరవేగంగా సాగుతు న్నాయి!. వరుసగా ఫ్రాంచైజీల వేలం, క్రికెటర్ల వేలం ముగించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. తాజాగా అరంగేట్ర సీజన్ షెడ్యూల్ విడుదల చేసింది. 18 రోజుల పాటు సాగనున్న డబ్ల్యూపీఎల్ తొలి సీజన్‌లో 22 మ్యాచులు జరుగనున్నాయి. మార్చి 4న ముంబయి ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్ లీగ్ ఆరంభ మ్యాచ్‌లో తలపడనుండగా.. మార్చి 26న డబ్ల్యూపీఎల్ టైటిల్ పోరు జరుగనుంది. ఈ మేరకు బీసీసీఐ మహిళల ప్రీమియర్ లీగ్ 2023 షెడ్యూల్ విడుదల చేసింది.

డబుల్ హెడర్స్

మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచులన్నీ ముంబయిలోనే నిర్వ హిస్తున్నారు. డివై పాటిల్ స్టేడియం, బ్రబౌర్న్ స్టేడియం (క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా)లో 22 మ్యాచులు జరుగు తాయి. నాలుగు రోజులు డబుల్ హెడర్స్ ఉండనున్నాయి. డబుల్ హెడర్స్ రోజు తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ఆరంభం కానుండగా.. రెండో మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ప్రారంభం అవనుంది.

ఇదీ ఫార్మాట్

మహిళల ప్రీమియర్ లీగ్ ఆరంభ సీజన్‌లో ఐదు జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. ముంబయి ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, ఢిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్స్‌లు గ్రూప్ దశలో డబుల్ రౌండ్ రాబిన్ పద్దతిలో తలపడనున్నాయి. గ్రూప్ దశలో 20 మ్యాచులు ముగిసిన అనంతరం అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. గ్రూప్ దశలో 2, 3వ స్థానాల్లో నిలిచిన జట్లు రెండో ఫైనల్ బెర్త్ కోసం ఎలిమినేటర్‌లో పోటీపడతాయి. గ్రూప్ దశ చివరి మ్యాచ్ యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ (మార్చి 21) మధ్య జరుగనుండగా.. ఎలిమినేటర్ పోరు మార్చి 24న జరుగుతుంది. ఫైనల్‌కు ముందు రోజు విరామం ఇచ్చారు. బ్రబౌర్న్ స్టేడియం, డివై పాటిల్ స్టేడియాలు గ్రూప్ దశలో మ్యాచుల వారీగా ఐదు జట్లకు రొటేషన్ పద్దతిలో ఆతిథ్య మైదానంగా వ్యవహరించనున్నాయి.

హైదరాబాద్ ఎఫ్‌సీ గెలుపు

ఎటికె మోహన్ బగాన్‌పై 1-0తో విజయం

హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ జోరు కొన సాగుతోంది. మంగళవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో ఎటికె మోహన్ బగాన్‌పై హైదరాబాద్ ఎఫ్‌సీ 1-0తో గెలుపొందింది. ప్రథ మార్ధంలో గోల్ లేకుండా ముగియగా.. ద్వితీయార్ధంలో చివర్లో హైదరాబాద్ ఎఫ్‌సీ స్టార్ స్ట్రయికర్‌ను బరిలో నిలిపింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఒగ్బాచే 86వ నిమిషంలో మెరుపు గోల్ కొట్టాడు. ఒగ్బాచే గోల్‌తో 1-0 ఆధిక్యం సాధించిన హైదరాబాద్ సీజన్‌లో 12వ విజయం నమోదు చేసింది. 18 మ్యాచుల్లో 12 విజయాలతో హైదరాబాద్ ఎఫ్‌సీ ఐఎస్ఎల్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.



హెచ్‌సీఏకు ఏక సభ్య కమిటీ

- వివాదాలు, ఎన్నికల పర్యవేక్షణ బాధ్యత
- విశ్రాంత జస్టిస్ నాగేశ్వర రావు నియామకం

హెచ్‌సీఏపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు జరుగనున్నాయి. అజహర్, విజయానంద్‌లకు చెక్ పవర్ తొలగించిన సుప్రీంకోర్టు.. గతంలో నియమించిన పర్యవేక్షణ కమిటీని సైతం రద్దు చేసింది. భారత ఒలింపిక్ సంఘం ఎన్నికలను పర్యవేక్షించిన సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ ఎల్. నాగేశ్వర రావుకు హెచ్‌సీఏ వివాదాల పరిష్కారం, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏక సభ్య కమిటీకి జస్టిస్ ఎల్. నాగేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.



నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఎట్టకేలకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో ప్రతిష్టంభనకు ముగింపు పడనుంది!. హైదరాబాద్ క్రికెట్ సంఘంలో ఎన్నికైన పాలక మండలి ఆట అభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయాల్లో మునిగిపోవటంతో వ్యవస్థను చక్కదిద్దేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణ కమిటీని నియమించింది. హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లే కాస్త నయం అనిపించేలా సాగిన పర్యవేక్షణ కమిటీని తాజాగా సుప్రీంకోర్టు రద్దు చేసింది. హైదరాబాద్ క్రికెట్‌లో సంస్థాగతంగా కొనసాగుతున్న వివాదాలకు పరిష్కారం చూపటంతో పాటు నూతన ఆఫీస్ బేరర్ల ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించాల్సిందిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నాగేశ్వర రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. హెచ్‌సీఏ వర్సెస్ చార్మినార్ క్రికెట్ క్లబ్ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. జస్టిస్ ఎస్‌కె కౌల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది.

పర్యవేక్షణ కమిటీ రద్దు

హైదరాబాద్ క్రికెట్ సంఘంలో ఎన్నికైన ఆఫీస్ బేరర్లు అంతర్గత కుమ్ములాటలతో నిత్యం కోర్టు గడప తొక్కుతూ ఆటను నిర్లక్ష్యం వహించారు. దీనిపై ఆగ్రహం చెందిన సుప్రీంకోర్టు గతంలో నలుగురు సభ్యులతో కూడిన పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ కంటే దారుణంగా పర్యవేక్షణ కమిటీ పని చేసింది. కమిటీలో ఏ ఇద్దరు ఓ అంశంపై ఏకీభవించని పరిస్థితి. సుప్రీంకోర్టు అప్పగించిన బాధ్యతలను విస్మరించి.. ఇతర అంశాల్లో హెచ్‌సీఏకు సిఫారసులు చేయటం సుప్రీంకోర్టుకు ఆగ్రహం కలిగించింది. హెచ్‌సీఏలో సమస్యలను సద్దుమణిగేలా చేసేందుకు మరో 13 వారాల గడువు కోరిన పర్యవేక్షణ కమిటీ సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇంతకాలం హెచ్‌సీఏ ఉద్యోగులకు జీతాల చెల్లింపులు, ఇతర అవసరాలకు అజహరుద్దీన్, విజయానంద్‌లకు ఇచ్చిన చెక్ పవర్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసింది.


ఏకసభ్య కమిటీ

హెచ్‌సీఏ పాలక మండలి, పర్యవేక్షణ కమిటీ గడువు (మూడు నెలలు) ముగియటంతో ప్రస్తుతం హెచ్‌సీఏలో మాజీల పాలన సాగుతుందని సీనియర్ న్యాయవాది జయంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. హెచ్‌సీఏలో తరచుగా తలెత్తుతున్న వివాదాలు, సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఎన్నికల ప్రక్రియలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకు విశ్రాంత న్యాయమూర్తి ఎల్.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించటం మంచిదని మరో సీనియర్ న్యాయవాది సిద్దార్థ దవె ధర్మాసనానికి సూచించారు. 'జస్టిస్ నాగేశ్వరరావు పర్యవేక్షణ అవసరమైతే.. ఆయన పర్యవేక్షణలో ఎలక్టోరల్ కాలేజ్‌ను (హెచ్‌సీఏ ఎన్నికల్లో ఓటు వేసే సభ్యులు) ఉంచుదాం. ఆయన పర్యవేక్షణలో జరిపిద్దాం. మరి, అందుకు జస్టిస్ రావు సుముఖంగా ఉన్నారా? ఆయన సుముఖత ఎవరైనా తెలుసుకున్నారా? అని జస్టిస్ కౌల్ అడిగారు. అందుకు అడ్వకేట్ జయంత్ భూషణ్ స్పందిస్తూ.. 'ఒకవేళ పర్యవేక్షణ కమిటీలో ఇతర సభ్యులు ఉంటే అందులో పని చేసేందుకు జస్టిస్ రావు సిద్ధంగా లేరు. ఒకవేళ ఏకసభ్య కమిటీ అయితే పని చేసేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు' అని ధర్మాసనంతో తెలిపారు.

దీంతో రిటైర్డ్ జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు ఏక సభ్య కమిటీ పర్యవేక్షణలో హెచ్‌సీఏ వివాదాలు, ఎన్నికల ప్రక్రియ ముగియాలని త్రి సభ్య ధర్మాసనం ఆదేశించింది. మాజీ అధ్యక్ష, కార్యదర్శుల చెక్ పవర్ రద్దు చేశాం. పూర్తి అధికారం ఏక సభ్య కమిటీకి అప్పగించాం. అంతమాత్రాన, భారం అంతా ఆయనపై మోపవద్దు. హెచ్‌సీఏ యంత్రాంగం ఈ ప్రక్రియలో జస్టిస్ రావుకు అవసరమైన సహాయం అందించాలి. ఏక సభ్య కమిటీ ఆర్థిక వ్యవహారాలను సైతం హెచ్‌సీఏ చూసుకుంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో విచారణను మార్చి 2కు వాయిదా వేసింది. అయితే, ఆ రోజు ఏక సభ్య కమిటీ అంశంలో జస్టిస్ ఎల్. నాగేశ్వరరావుకు ఏమైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుందని, ఇతర ఏ అంశాలను ధర్మాసనం వినబోదని స్పష్టం చేశారు.

ఐఓఏను చక్కదిద్దిన వ్యక్తి

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) పలు వివాదాలు, సమస్యలు ఎదుర్కొని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నుంచి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఐఓఏ నూతన రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ, ఎలక్టోరల్ కాలేజ్ బాధ్యతలను సుప్రీంకోర్టు జస్టిస్ ఎల్. నాగేశ్వరరావుకు అప్పగించింది. ఐఓఏలో వివాదాలకు ముగింపు పలికిన జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు ఇప్పుడు అదే తరహాలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)ను చక్కదిద్దేందుకు ఇక్కడికి రానున్నాడు.



"దేశంలో క్రీడా సంఘాలు ఆటలను వదిలేసి న్యాయ స్థానాల చుట్టూ తిరగటం దురదృష్టకరం. హెచ్‌సీఏలో నెలకొన్న ప్రతిష్టంభన వీడి, ఎన్నికలు జరగాలి. సుప్రీంకోర్టు ప్రధాన లక్ష్యం అదే. అయితే, ఆ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించటం ఎలా అనేది ప్రశ్న. అందుకు జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు తగిన వ్యక్తి. ఈ అంశంలో ఆయన సిద్ధహస్తులు. హెచ్‌సీఏ సమస్యలకు పరిష్కారం చూపేందుకు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావుతో ఏకసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నాం

- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం

జోరు కొనసాగేనా?

నేడు వెస్టిండీస్‌తో భారత్ ఢీ
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్



కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా): ఆరంభ మ్యాచ్‌లో దాయాది పాకిస్థాన్‌పై ఏకపక్ష విజ యం, మహిళల ప్రీమియర్ లీగ్‌లో కోట్ల వర్షం ఉత్సాహంలో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టు.. నేడు మరో సవాల్ కు సిద్ధమైంది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గ్రూప్-2 దశలో నేడు వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది. వెస్టిండీస్‌తో గత ఐదు మ్యాచుల్లో ఓటమెరుగని టీమ్ ఇండియా నేడు కేప్‌టౌన్‌లో అదే రికార్డు కొనసాగిం చేందుకు చూస్తుంది. గత మ్యాచ్‌లో అనారోగ్యంతో బెంచ్‌కు పరిమితమైన స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన నేడు కరీబియన్ అమ్మాయిలపై బ్యాట్ ఝులి పించేందుకు సిద్ధమవుతోంది. ఒత్తిడితో కూడిన పాకిస్థాన్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఛేదన విమర్శకుల మెప్పు పొందింది. జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్, షెఫాలీ వర్మలు రాణించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నుంచి జట్టు మెగా ఇన్నింగ్స్ ఆశిస్తోంది. దీప్తి శర్మ, రాధ యాదవ్ బంతితో గొప్ప ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో భారత్ పటిష్టంగా కనిపిస్తోంది. హేలే మాథ్యూస్, కాంప్‌బెలె, ఫ్లెచర్‌లు వెస్టిండీస్‌కు కీలకం కాను న్నారు. నేడు సాయంత్రం 6.30 గంటలకు భారత్, వెస్టిండీస్ ప్రపంచకప్ మ్యాచ్ ఆరంభం కానుంది.

రెండో టెస్టుకు శ్రేయస్

ఫిట్‌నెస్ సాధించిన బ్యాటర్



ముంబయి : ఫిట్‌నెస్ సమస్యలతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు దూరమైన టీమ్ ఇండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ రెండో టెస్టుకు అందుబాటులో ఉండనున్నాడు. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిపుణుల పర్యవేక్షణలో ఫిట్‌నెస్‌పై దృష్టి నిలిపిన అయ్యర్.. ఫిబ్రవరి 17 నుంచి న్యూఢిల్లీలో ఆరంభం కానున్న రెండో టెస్టుకు తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో ఆస్ట్రేలియాతో నాగ్‌పూర్ టెస్టులో సూర్యకుమార్ యాదవ్ అరంగేట్రం చేశాడు. అయ్యర్ పునరాగమనంతో ఢిల్లీ టెస్టులో సూర్యకుమార్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. భారత్‌కు ఏడు టెస్టులు ఆడిన అయ్యర్ 56.72 సగటుతో 624 పరుగులు చేశాడు. స్పిన్‌పై ఎదురుదాడి చేయటం అయ్యర్ ప్రధాన బలం. ఆసీస్‌తో సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ కీలకం కానున్నాడు.

మగవాళ్ళ బాధలను చూపించే సినిమా



హీరో శర్వానంద్‌తో 'హ్యాష్‌టాగ్ మెన్ టూ' చిత్ర బృందం

నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష చెముడు, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, రియా సుమన్, ప్రియాంక శర్మ తదితరులు ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'మెన్ టూ'.

లాన్‌థ్రెన్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై శ్రీకాంత్ జి.రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను హీరో శర్వానంద్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రొడ్యూసర్, హీరో మౌర్యకి కంగ్రాజులేషన్స్. 'రణరంగం' సినిమాలో ఇద్దరం కలిసి నటించాం. ప్రతి స్టెప్ నాకు చెప్పేవాడు. తను ప్రొడ్యూస్ చేస్తున్నానని చెప్పినప్పుడు ఎందుకు ప్రొడక్షన్ అని చెప్పా. అతను స్క్రిప్ట్ నచ్చి సినిమా చేశాడు. యంగ్‌స్టర్స్ కొత్తగా ఇలా చేస్తుంటే బాగా అనిపించింది. మౌర్య తండ్రి కూడా చాలా హెల్ప్ చేశారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలి. ప్రొడ్యూసర్‌గా కూడా మౌర్య సక్సెస్ అయ్యాడని, బిజినెస్ బాగా జరిగిందని విన్నా' అని తెలిపారు. 'ఏదో ఆడవాళ్లని తక్కువ చేసి చూపించాలనే ఉద్దేశంతో చేసిన సినిమా కాదు. లేడీస్ వల్ల జెంట్స్ ఎంత బాధపడుతున్నారు.. వాళ్ల వల్ల వచ్చే సమస్యలను జెన్యూన్‌గా చూపించే ప్రయత్నం చేశారు. మగవాళ్ల బాధలను చూపించే చిత్రం. జెంట్స్‌కే కాదు.. లేడీస్‌కి కూడా సినిమా నచ్చుతుంది' అని నటుడు బ్రహ్మాజీ చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ జి.రెడ్డి మాట్లాడుతూ, "హ్యాష్ ట్యాగ్ మెన్స్ టూ సినిమా స్టోరీతో సినిమా చేయాలనుకుంటే వీడెవరో కాంట్రవర్సీ చేయాలనుకుంటున్నాడని అందరూ అనుకున్నారు. అయితే మౌర్య నమ్మకంతో ఒప్పుకున్నారు' అని అన్నారు. 'యంగ్ టీమ్‌తో కలిసి మంచి సినిమా చేశామని అనుకుంటున్నాను' అని నిర్మాత మౌర్య సిద్ధవరం చెప్పారు.

జీవిత పాత్రలో రాధిక



రాధిక

"స్వాతి ముత్యం, స్వాతి కిరణం' లాంటి అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రాల తరువాత దర్శకుడు వెంకట సత్య చెప్పిన 'ఆపరేషన్ రావణ్' స్క్రిప్ట్ నచ్చి నటనకి ప్రాధాన్యం ఉన్న, ఎంతో హృద్యమైన జీవిత పాత్ర చేశాను' అని సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ చెప్పారు.

'పలాస 1978' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న హీరో రక్షిత్ అట్లూరి కొత్త చిత్రం 'ఆపరేషన్ రావణ్'. మంగళవారం జరిగిన క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ ఈవెంట్‌లో రాధికా శరత్ కుమార్ మాట్లాడుతూ, 'దర్శకుడికి ఇది తొలి చిత్రం అయినప్పటికీ నా పాత్రని మలిచిన తీరు, చిత్రాన్ని తీర్చిదిద్దిన విధానం ఎంతగానో ఆకట్టుకుంది. తెలుగుతో పాటు ఏక కాలంలో తమిళంలో విడుదలవుతున్న ఈ చిత్రంలో పని చేయడం చాలా సంతోషంగా ఉంది' అని చెప్పారు. సుధాస్ మీడియా బ్యానర్ మీద ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్న ఈ న్యూ ఏజ్ ఏక్షన్-సస్పెన్స్ థ్రిల్లర్‌లో రక్షిత్ అట్లూరి సరసన సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించారు. షూటింగ్ పూర్తి చేసుకుని, నిర్మాణంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.



బన్నీవాసు, కిరణ్ అబ్బవరం, కశ్మీర

అఖిల్ ముఖ్య అతిథిగా ప్రీ రిలీజ్

అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. బన్నీ వాసు నిర్మాత. 'భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, 18 పేజెస్' లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రంలో కశ్మీర హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం నుండి రిలీజైన సాంగ్స్, టీజర్ అన్ని మంచి అంచనాలను క్రియేట్ చేశాయి. అలానే రీసెంట్‌గా రిలీజ్ చేసిన ట్రైలర్ ఈ సినిమాపై మరింత అంచనాలను పెంచింది. నెంబర్ నైబరింగ్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. మహాశివరాత్రి కానుకగా ఈనెల 18న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర బృందం మంగళవారం ప్రెస్‌మీట్‌లో చిత్రానికి సంబంధించి పలు విశేషాలను షేర్ చేసింది. ఇందులో భాగంగా సినిమా చాలా బాగా వచ్చిందని, ఈ సినిమాలో ప్రేమ, కామెడీ , థ్రిల్లింగ్ .. ఇలా అన్ని అంశాలు మిళితమై ఉన్నాయని పేర్కొంది. అలాగే కేవలం ఒక సెక్షన్ ఆడియన్స్‌ని మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ మూవీ ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేసింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఈనెల 16న నిర్వహించబోతున్నామని, ఈ వేడుకకు ముఖ్య అతిథిగా అక్కినేని అఖిల్ హాజరు కాబోతున్నట్లు ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలియజేసింది. 'ఓ మంచి కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. మా బ్యానర్‌లో రాబోతున్న మరో సూపర్‌హిట్ సినిమా అనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాత బన్నీవాసు తెలిపారు.


ఆర్ఆర్ఆర్ సూపర్ - జోనాథన్ మేజర్స్

ఇప్పుడు సినీ ప్రపంచంలో ఎక్కడ విన్నా.. ఆర్ఆర్ఆర్ తెలుగు సినిమా గురించే అందరూ మాట్లాడుకుంటున్నారు. ఆస్కార్ బరిలో ఉన్న ఈ సినిమాపై హాలీవుడ్ ప్రముఖులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. మన తెలుగు సినిమా ఖ్యాతిని శిఖరం పై కూర్చోబెట్టి, భారతీయ సినిమా సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పిందీ సినిమా. తాజాగా ఈ సినిమా చాలా బాగుందంటూ ప్రముఖ హాలీవుడ్ కథానాయకుడు జోనాథన్ మేజర్స్ కితాబివ్వడం హాట్ టాపిక్‌గా నిలిచింది.

'యాంట్-మ్యాన్ అండ్ ది వాస్ప్: క్వాంటుమానియా'లో సూపర్ విలన్ కాంగ్ ది కాంకరర్ పాత్రను పోషించిన జోనాథన్ మేజర్స్ భారతీయ చిత్రాల గురించి ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసుకోవడం సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలిచింది. ఇటీవల భారతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, 'నేను భారతీయ సినిమాకు అభిమానిని. ఇటీవల బ్లాక్ బస్టర్ చిత్రం 'ఆర్ఆర్ఆర్' సినిమా చూశాను. ఈ సినిమా కాంగ్ ది కాంకరర్ దృష్టిని 'జయించిందని' చెప్పగలను (నవ్వుతూ). ఈ సినిమాను మూడుగంటల పాటు ఆస్వాదించగలిగాను. ఇద్దరు నటులను (జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్) తెరపై చూడటం నాకు చాలా నచ్చింది. ఇంకా అద్భుతమైన భారతీయ సినిమాలను చూడటానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పారు.

జోనాథన్ మేజర్స్ చేసిన ఈ ప్రకటన ప్రపంచ స్థాయిలో భారతీయ సినిమాకు గౌరవాన్ని, ప్రజాదరణను పెంచిందని అనడానికి నిదర్శనం. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని నాటు..నాటు పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ బరిలో నిలిచిన విషయం తెలిసిందే.

ఈనెల 17న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో 'యాంట్-మ్యాన్ మరియు ది వాస్ప్: క్వాంటుమేనియా' యాన్ ఎపిక్, సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్‌ను మార్వెల్ స్టూడియో ఇండియా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనుంది.



'యాంట్-మ్యాన్ అండ్ ది వాస్ప్: క్వాంటుమానియా' చిత్రంలో ఒక దృశ్యం

నవచిత్రం

ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ



దివ్యాభావన, క్రిష్, ఆర్యన్ గౌర

లవ్ సాంగ్స్, పైగా మెలోడీ ట్యూన్స్‌తో ఉంటే ప్రేక్షక లోకానికి ఇట్టే నచ్చేస్తుంటాయి. అలాంటి చక్కటి మెలోడి గీతాలతో, మంచి ప్రేమ కథతో 'ఓ సాథియా' అనే చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాకు దర్శక, నిర్మాతలిద్దరూ మహిళలే కావడం విశేషం. తన్విక జశ్విక క్రియేషన్స్ బ్యానర్‌పై చందన కట్టా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, దివ్యా భావన దర్శకత్వం వహిస్తున్నారు. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా డైరెక్టర్ క్రిష్ ఈ సినిమాలోని 'వెళ్లిపోయే..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'వెళ్లిపోయే.. పాపా వెళ్లిపోయే..' అంటూ సాగిపోయే ఈ బ్రేకప్ సాంగ్‌లో యూత్ ఆడియన్స్ కనెక్ట్ అయ్యే లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. భాస్కరభట్ల రాసిన పదాల కూర్పులో నిజమైన ప్రేమికుడి భావాలు మనసుకు హత్తుకుంటున్నాయి. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన తీరు, సాంగ్‌కి తగ్గట్టుగా బాబా భాస్కర్ కొరియోగ్రఫీ ఈ పాటలో హైలెట్ అయ్యాయి. వినోద్ కుమార్ (విన్ను) అందించిన మ్యూజిక్ ఈ సాంగ్‌కి మేజర్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ సాంగ్ రిలీజ్ చేసిన దర్శకుడు క్రిష్ ఈ చిత్ర యూనిట్ మొత్తానికి బెస్ట్ విషెస్ చెప్పారు. సాంగ్ చాలా బాగా వచ్చిందని, ఈ సినిమా సక్సెస్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు.

'ఓ సాథియా' అంటూ ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో రాబోతున్న ఈ సినిమాలో ఆర్యన్ గౌర, మిష్టి చక్రవర్తి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. గతంలో రచయిత విజయేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, మణిశర్మ విడుదల చేసిన 'ఓ సాథియా' టైటిల్ సాంగ్‌కు సోషల్ మీడియాలో విశేషమైన స్పందన లభించగా, లేటెస్ట్‌గా డైరెక్టర్ క్రిష్ వదిలిన 'వెళ్లిపోయే' సాంగ్ యూత్ ఆడియన్స్‌కి ఎంతో బాగా కనెక్ట్ అవుతూ యమ స్పీడుగా వ్యూస్ రాబడుతోంది. అతిత్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించనున్నారు.

మనసు మనసుతో..



పార్వతీశం, జష్వికా

'కేరింత' ఫేమ్ పార్వతీశం, జష్వికా జంటగా నటిస్తున్న చిత్రం 'తెలుసా మనసా'. న్యూ ఏజ్ ప్లాటోనిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని శ్రీ బాలాజీ పిక్చర్స్ బ్యానర్‌పై వర్షా ముండాడ, మాధవి నిర్మించారు. వైభవ్ దర్శకుడు. పార్వతీశం పల్లెటూర్లో బెలూన్స్ అమ్ముకునే కుర్రాడు మల్లి బాబు పాత్రలో నటించారు. హెల్త్ అసిస్టెంట్ సుజాత పాత్రలో జష్వికా నటించింది. వారిద్దరికీ ఒకరంటే ఒకరికి చెప్పలేనంత ప్రేమ ఉంటుంది. కానీ దాన్ని బయటకు చెప్పుకోలేరు. మరీ ముఖ్యంగా మల్లిబాబు అయితే పలు సందర్భాల్లో సుజాతకు తన ప్రేమను చెప్పటానికి ప్రయత్నించి చెప్పలేకపోతాడు. అయితే ఇద్దరూ అనుకోని కారణాలతో దూరమవుతారు. మరి వాళ్లిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది ఈ సినిమా కథాంశం.

మంగళవారం ఈ సినిమా నుంచి 'మనసు మనసుతో..' అనే మెలోడి సాంగ్ విడుదలైంది. 'వాల్తేరు వీరయ్య'తో సెన్సేషనల్ హిట్ కొట్టిన దర్శకుడు బాబీ కొల్లి ఈ పాటను విడుదల చేసి, సినిమా మంచి విజయం సాధించాలని చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు.

గోపీ సుందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మరోసారి ఈ పాటలో ఆయన తనదైన మార్క్ చూపించారు. వాలెంటైన్స్ డే సందర్భంగా.. నిజమైన ప్రేమలోని లోతును ఆవిష్కరించేలా, హృదయానికి హత్తుకునేలా ఈ పాట ఉంది. వనమాలి రాసిన ఈ పాటను శ్రీకృష్ణ అద్భుతంగా ఆలపించారు. ప్రసాద్ ఈదర సినిమాటోగ్రఫీ ఈ పాటకు మరింత అందాన్నిచ్చింది. డెబ్యూ డైరెక్టర్ వైభవ్ ఈ చిత్రాన్ని న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా అద్భుతంగా మలుస్తున్నారని, త్వరలోనే మరిన్ని విషయాలను తెలియజేస్తామని మేకర్స్ అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.